ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



4 అణాలు

21-5-'52

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY

సంపుటము 44
సంచిక 37
సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక
అణాలు. 0-4-0
21-5-52

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక
Founder : K. NAGESWARA RAO
నందన వైశాఖ బహుళ త్రయోదశి బుధవారము

ఈవారం
ముఖ్యవిషయాలు

వ్యాఖ్యలు, విమర్శలు:

పార్లమెంటులో ప్రమాణ స్వీకారాలు

భారత అధ్యక్షుడు డా॥ రాజేంద్రప్రసాద్ గారిచేత సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి పతంజలి శాస్త్రిగారు యీ 18 న ప్రమాణ స్వీకారం చేయించారు. భారత అధ్యక్షుడు ఉపాధ్యక్షునిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. తాత్కాలిక స్పీకరు మావలంకర్ గారి అధ్యక్షతను ఆనాడే జరిగిన సమావేశంలో పార్లమెంటుకు క్రొత్తగా ఎన్నికైన సభ్యులు వరుసగా ప్రమాణాలు స్వీకరించారు. చేసే ప్రమాణం కొందరు భగవంతుని సాక్షిగా చేస్తే, నెహ్రూ తదితరులు కొందరు ఆత్మసాక్షిగా చేశారు. కొందరు కమ్యూనిస్టులు ప్రజల సాక్షిగా చేశారు. అదే రోజున ఉపాధ్యక్షుడు డా॥ రాధాకృష్ణన్ గారి అధ్యక్షతను సమావేశమైన స్టేట్స్ కౌన్సిలు సభ్యులు కూడా ప్రమాణాలు స్వీకరించారు.

కేంద్రమంత్రివర్గంలో తెలుగువారికి స్థానం

భారత అధ్యక్షుని ప్రమాణస్వీకార క్రతువు ముగియగానే భారత ప్రధాని నెహ్రూ తన ప్రస్తుత మంత్రివర్గ రాజీనామాను ఆయనకు అందచేశారు. పార్లమెంటులో సంఖ్యాధిక్యత కల కాంగ్రెసు పార్టీ నాయకుడైన నెహ్రూను భారత అధ్యక్షుడు క్రొత్త మంత్రివర్గం స్థాపించ



పార్లమెంటు స్పీకరు మావ్లాంకర్

సేపు వాదోపవాదాలు జరిగినమీదట సభ వారు వుపసంహరణకు అనుమతించారు. రాజాజీ తన ప్రతిపాదనను వుపసంహరించుకోబోయేముందు ప్రకాశంగారిని తప్పుచేశానని ఒప్పుకోమని ఎన్నోమార్లు అడిగారు. ప్రకాశంగారు తానుచేసింది ఎంతమాత్రం తప్పుకాదనే వాదించారు.

ప్రకాశంగారి యిన్నేళ్ల జీవితంలోనూ తాను చేసింది తప్పు అని ఒప్పుకొన్న సందర్భం ఒక్కటైనా లేదు. ఆయనకు తాను చేసిందంతా ఒప్పేనని నమ్మకం బాగా గట్టిగా ఎల్లప్పుడూ వుంటూనే వుంటుంది. అటువంటి వ్యక్తిచేత తప్పు చేశానని సూచనగానైనా అనిపించటం అసాధ్యం. ఈఅభిశంసన తీర్మానం ఓటుకు పెట్టితే తప్పక నెగ్గివుండేది. అయినప్పటికీ రాజాజీ దూరం ఆలోచించి తన ప్రతిపాదనను వుపసంహరించుకొన్నారు. ఈ వుపసంహరణ జరుగకపోతే ప్రభుత్వపక్షం వారికి యికపై అడుగుఅడుగుకు అంతరాయాలు తప్పక ఎక్కువై వుండేవి. అంతేకాక ప్రభుత్వపక్షానికి, వ్యతిరేకపక్షానికి మధ్యను రోషకావేషాలు యింకా ఎక్కువ అయివుండేవి. అటువంటి వాతావరణం ఏర్పడటంకోసం పొంచివున్న శక్తులు యీ వుపసంహారణవల్ల నిరాశపడవలసి వచ్చింది. ఏది ఏమైనా రాజాజీ తన ప్రతిపాదనను వుపసంహరించుకోవటంలో కొంత ఔదార్యాన్ని ప్రదర్శించారని ఒప్పుకోక తప్పదు.

ఆంధ్రరాష్ట్ర సమస్య

ఈ16 వ పత్రికా విలేఖరులతో ప్రసంగిస్తూ రాజాజీ ఆంధ్రరాష్ట్ర సమస్యా పరిష్కారం విషయమై తాను యిక చేయగలిగింది ఏమీ లేదని ప్రకటించారు. ఈ విషయమై చర్చించేందుకు అవకాశం యిమ్మని స్వామీ సీతారాంగారి తరఫున ఎవరో తమవద్దకు వచ్చారనీ, స్వామీజీని కలుసుకొన్నా యింతకంటే చెప్పేందుకు తమకు మరేమీ లేనప్పుడు వారిని కలుసుకోవటం ఎందుకనే అభిప్రాయంతో స్వామీజీని చూడలేదనికూడా రాజాజీ తెలిపారు. ఇటీవల ఒకసారి యీ విషయమై ప్రస్తావిస్తూ ఆంధ్రరాష్ట్రస్థాపనలో జాప్యం జరుగుతున్నకొద్దీ, అడ్డంకులు ఎక్కువఅవుతున్నాయనీ రాజాజీగారే అన్నారు. జాప్యం జరుగకుండా, అడ్డంకులు హెచ్చకుండా చేసేందుకు ఎవరో ఒకరు పూనుకొంటే అట్టివారిపట్ల రాజాజీ యీవిధంగా ప్రవర్తించినందువల్ల ఆంధ్రరాష్ట్రంకోసం

(6-వ పేజీ చూడండి)

కొత్త కారు

"ఏమండోయ్, మిమ్మల్నే! వెనుక కారు, కొంచం ప్రక్కకు తోలండి," వెనుకసీటులో కూర్చున్న నా భార్యారత్నం, లత హెచ్చరిక.

అసలు రెండునెలల క్రిందట కారులో యెక్కి తిరుగుతానని కలలోకూడా అనుకోలేదు. ఇంకా బాగా జ్ఞాపకంవుంది లాటరీలో కారు అడ్వర్టైజు చేసిన రోజు. ఆవేళ అన్నాను లతతో: "లతా! ఈకారు చూడు. బావుందా?"

"బాగులేకేం, మహా చక్కగావుంది. నే కారులో తిరిగేయోగం యెప్పుడో? నాకంత అదృష్టం కూడానా!" అంది.

"అదేమిటి లతా, అలా అంటావు. చూడు ఈకారు మనదే!"

"మనదెట్లా అవుతుంది. నేనేం అంత పిచ్చిదాన్ననుకున్నారా? మీకు లాటరీ అంటేనే తల కొప్పారు! నేనెన్నాళ్ళ బట్టీ చెబుతున్నా 'లాటరీ గొడవన్నా వేయండి, మనకు డబ్బు వస్తుంది' అని. నామాట మీరు వినడం యీ జన్మలో లేదు!"

"లాటరీలు మంచివికావు లతా! అదో విధమైన అంటుజాడ్యం. అంటుకుందంటే వదలదు. యిల్లు వొళ్ళు గుల్ల యేదాకా."

"నే లాటరీ పేరెత్తినప్పుడల్లా మీకు యిదొక సమాధానం దొరుకుతుంది. నెలకు

శ్రీ సోమరాజుల ప్రకాశరావు

రెండు రూపాయలు కట్టినంత మాత్రాన బికారుల మవుతామటండీ! మీరు మరీను. పోనీలెండి, నే సినిమాలు చూడడం మానుకుంటాను, ఏదైనా లాటరీ కట్టండీ."

"అలాగే లతా. యీమాటు లాటరీ కడుతాకాని, కారు మనదేనంటావా?"

"హాయ్, హాయ్! ఎంత మంచివారండి మీరు! నాపేరిట కట్టండేం? తప్పకుండా ఫస్టుప్రైజు మనదే."

లాటరీ కట్టిన నాటినుండి లత కలలకు అంతులేదు. కారుకొంటే కారుకు తగిన హోదా వుండాలి. ఇంట్లో ఒక నౌకరును పెట్టాలి. ప్రస్తుతం వుంటున్న యిల్లు మార్చి, ఒక చిన్న బంగళా అద్దెకు పుచ్చుకోవాలి. కారులో రోజూ బీచీకి షికారు పోవాలి......

"ఏమండోయ్, కారులోనే మావూరికి వెళ్ళిరావచ్చండి. మనం రైళ్లలో జనసమ్మర్దంలో పడి అవస్థపడడంకన్నా హాయిగా కారులో పోవచ్చు. రైలుఖర్చులు కూడా తగ్గుతాయండి!" అంది. పాపం, పెట్రోలుకి డబ్బు ఖర్చు కాదనుకుంది.

నేనుమాత్రం వెయ్యి దేవుళ్లకు మొక్కుతున్నా కారు గాకూడదని. లత కలలు గనుక ఫలించాలంటే నాజీతం రాళ్ళు చాలక వంద రూపాయలు అప్పు పుచ్చుకోవాలనీ వస్తుంది నెలకు.

లత అదృష్టమో, నా దురదృష్టమో, మొత్తానికి లాటరీలో మొదటి బహుమతి నాది. ఆస్టిన్ 1952 మోడల్ కారు. నా పెళ్లయాక రెండవ మరపురాని శుదినం ఆరోజే. ఎంతలా గౌరవించి విందుచేసింది! ఇంద్రభోగం అనుభవించానంటే నమ్మండి.

వందరూపాయలు ఫీజిచ్చి డ్రైవింగు నేర్చుకున్నాక అదే మొదటిసారి నా ముద్దుల భార్యను కారులో బయటకి తీసుకెళ్లడం.

"ఏమండీ, డ్రైవింగు పూర్తిగా నేర్చుకున్నారా?" అంది కారు తలుపు తెరుస్తూ.

"అడుగులోనే హంసపాదా? మాట్లాడక యెక్కు-పూర్తిగా నేర్చుకోకపోతే నీకెవడిస్తా డనుకున్నావు లైసెన్సు?"

"అబ్బ! అదికాదండీ. మొట్టమొదటి సారి రోడ్డుమీద తోలడం కాస్త యెందుకైనా మంచిది, నెమ్మదిగా తోలండేం!"

"అలాగేలే" అన్నా నేకాని కారుని స్టార్టు చేసినప్పటినుంచి మా ఆవిడ చెప్పిన మాటలు గింగురుమని చెవిలో మ్రోగుతూనే వున్నాయి. "జాగ్రత్త, మొదటిదఫా కారు నడుపుతున్నారు. నన్నెక్కడైనా తోసెయకండేం."

ఎందుకో నే వొంటరిగా కూర్చుని తోలినప్పటి ధైర్యంలేదు. మనసులో భీతిగానే వుంది. దానికి తోడు మాఆవిడ వెనకసీటునుంచి హెచ్చరిక లివ్వడం ప్రారంభించింది.

అసలు యేదైనా క్రొత్తగా నేర్చుకోవాలంటే క్రింద మీదా పడి నేర్చుకోవాలి. నా యెనిమిదవయేట సైకిలు నేర్చుకుంటున్నాను. మా అన్నయ్య నన్ను సైకిలుమీద కూర్చోబెట్టి వెనకనుంచి ఒక్క తోపు తోశాడు. పెడలు తొక్కుతూ పోతున్నాను కాని దిగడం చేతకాలేదు. అలా వెళ్ళివెళ్ళి మంచినీళ్ల బిందె మోసుకు పోతున్న మాచమ్మమీద పడ్డాను. ఆవిడ బిందెతోసహా ధామ్మని క్రిందపడ్డది. నా గడ్డం ఠంగుమని నేలకు కొట్టుకుంది. ఆవిడ శాపనార్థాలలో నా గాయం నొప్పి తెలియలేదు. కాని యిప్పటికీ గడ్డంక్రింద గుర్తు కనిపిస్తుంది.

"ముందు చూడండి, ఏమిటా ఆలోచనలు కారు నడుపుతూ?" మళ్ళీ మా ఆవిడ వార్నింగు.

కారు తోలడం కష్టమే! ఎన్నని బుర్రలో జ్ఞప్తి వుంచుకోను. డ్రైవింగు మాష్టరు చెప్పిన రూల్సు: మొదటిగేయర్,

రెండవగియర్...క్లచ్, ఆక్సలరేటర్, బ్రేకు, స్టీరింగు, హారన్...క్లచ్ వేసి గియరు మార్పు...

ఇవో చక్రబుర్రలో తిరుగుతూంటే మరోవైపు ట్రాఫిక్ రూల్సు: ఎడమకు తోలు, వెనుక బళ్లకు దారివదలు. అనవసరంగా బయటికి చెయ్యి చాపకు. రోడ్డు మలుపులో సంజ్ఞయివ్వు...

ఇవి చాలవన్నట్లు వెనుకనుంచి మా ఆవిడ వార్నింగులు.

“ఏమండోయ్, నెమ్మదిగా! ఆ కారుని వెళ్ళనివ్వండి. ఎంత రాష్‌గా పోతున్నాడో వాడు! వీళ్ళ నందరిని అరెస్టుచేసి జైళ్ళకు పంపితేకాని రోగం కుదరదు. ఇన్ని ప్రమాదాలుండవు......”

“అడుగో పోలీసువాడు చెయ్యి చూపుతున్నాడు. ఆగండీ...”

“అబ్బ! అటెటు చూస్తున్నారు! ఆ ఆడదాన్ని చూడకపోతే యేం మునిగింది? ఆ కుర్రాడిమీద పోనిచ్చేరు, మీ పుణ్యముటుంది......”

మా ఆవిడ ఒక్కొక్కమాట ములుకులా గుచ్చుకుంటోంది. మెత్తటి సీటుమీద కూర్చున్నానన్నమాటేగాని, ముళ్లకంపలో కూర్చున్నట్లే వుంది. ఓ అరవై రూపాయలిచ్చి డ్రైవర్ని పెట్టుకున్నా సరిపోయేది. కారులో కూర్చుని హాయిగా పోవచ్చు. అరవై రూపాయలు మిగులుతాయికదా అని నేనే డ్రైవు చేద్దామంటే మనశ్శాంతి చేకూరేటట్టు లేదు.

స్టీరింగు పట్టుకు యిటు అటు త్రిప్పుతూ జాగ్రత్తగానే పోతున్నా. కానీ మా ఆవిడ హెచ్చరికలు మాత్రం మానలేదు.

“అబ్బ! పూరుకుందూ, నీసొద!” అంటున్నా కారుకి అడ్డంగా ఓ కుక్క పరిగెత్తింది. దాన్ని తప్పించుకుందామని కారుని ప్రక్కకు త్రిప్పాను. వెనుకనుంచి యింకో కారుయాభై మైళ్లస్పీడులో దూసుకుపోయింది.

“నేనంటే మీకుకోపం కాని, ఒక్క నిమిషంవుంటే ఆ కారు మన కారుతో ‘ఢీ’ కొట్టుకొనేది.” అంది.

ఈ హెచ్చరికలు వినలేక నావొళ్ళు మండుతోంది. నరాలపటుత్వం సడలుతోంది.

“నీవాగడం మూలానే స్టీరింగుమీద కంట్రోలు పోతోంది,” అంటూ ముందున్న అద్దంలో మా ఆవిడవైపు చూశాను. భయంతో వెలవెల బారిన మొహం.

బిత్తరచూపులు. గుప్పిట్లో ప్రాణాలు పెట్టుకు కూర్చున్న దానిలా పిడికిట్లు గట్టిగా మూసుకుని రెండడుగుల వెడల్పు సీటువున్నా చోటే లేదన్నట్టు అంచున కూర్చుంది. ఆ దృశ్యం చూచినప్పుడు నాకే నవ్వువచ్చింది. మొగుడు కారు నడుపుతుంటే పెళ్లాం యిలా బిక్కచచ్చి కూర్చుంటుందా? ఎవరైనా చూస్తే యేమనుకుంటారు? పెళ్లాన్ని బెదిరించి కారులో కూర్చోపెట్టి తీసుకు పోతున్నాడని అనుకోరూ? ఏమిటో పిచ్చిచేష్టలు. కానీ, యిల్లు చేరగానే దానికి కార్లో కూర్చోడమెలాగో నేర్పివ్వాలి. స్టీరింగు దగ్గర వుండిపోయాను కాని, లేకపోతేనా...?

దాని దుంపతెగ ‘చచ్చింది.’ బ్రేకు ‘...బ్రేకు...’...” మా ఆవిడ అరుపు.

నా ఆలోచనలకు బ్రేకు వేసి యీ ప్రపంచంలోకి వచ్చి కారు నాపాను.

(48–వ పేజీ చూడండి)



వాఖ్యలు విమర్శలు


(3-వ పేజీ తరువాయి)

ఆందోళనపడుతున్నవారి మనస్సులలో ఒకింత నిస్పృహ పొడసూపకమానదు. దీని ప్రాబల్యం రేపు 25 న స్వామీజీ సత్యాగ్రహం ప్రారంభిస్తే అందుకు కొంతవరకు దోహదం కూడా చేయవచ్చు.

అధ్యక్షుని వుపన్యాసం

ఈ 16 న భారతఅధ్యక్షుడు పార్లమెంటు తొలిసమావేశంలో ప్రసంగిస్తూ ప్రజలు చెలాయించిన వోటుతో ఎన్నికైన సభ్యులకందరకూ స్వాగతం చెప్పారు. వరుసగా 5 సంవత్సరాలపాటు వర్షాలు కురవక క్షామపీడితమైవున్న రాయలసీమ ప్రాంతంలో ప్రజలు పడుతున్న బాధలను గూర్చి ప్రసంగిస్తూ అక్కడ సైనికాధికారులు నీటి సమస్యా పరిష్కారానికి చేస్తున్న కృషిని వివరించారు. వెనుకటి పార్లమెంటు రద్దుఅవటంతో చర్చకాకుండా నేనిలచిపోయిన హిందూకోడ్ బిల్లు యీసారి మళ్లీ చర్చకు రానున్నదనీ, అయితే యీసారి బిల్లు అంతా ఒకే సారి చర్చకు రాకుండా భాగాలు భాగాలుగా చర్చకు వస్తుందనీ యీయన ప్రకటించారు. దేశాన్ని సుభిక్షం చేసేందుకుగాను మైనర్ ప్రాజెక్టులు తలపెట్టారనీ, వీటి నిర్మాణానికి కావలసిన డబ్బు పొదుపుచేసే వుద్దేశంతోనే ఆహారధాన్యాలకు యిచ్చే సబ్సిడీలు తగ్గించటం జరిగిందనీ తెలిపారు. ధరవరలలో వచ్చిన మార్పులను తమ ప్రభుత్వం గమనిస్తూనే వున్నదనీ, దేశంలో వుత్పత్తి కానీ, దేశీయులవృత్తులు కానీ దెబ్బతినకుండా కనిపెట్టుతున్నదనీ హామీయిచ్చారు. పడిపోతున్న ధరలను తగినంతవరకు పడిపోనిచ్చి, యిక అక్కడనుంచీ పడకుండా ప్రభుత్వం కట్టుదిట్టం చేయగలదని కూడా చెప్పారు. భారత ప్రభుత్వ వైదేశిక సంబంధాలనుగూర్చి ప్రస్తావిస్తూ, ఏనాటికైనా ఒక నాటికి ప్రపంచ రాజ్యాలన్నీ ఏకమై సహకార వ్యవస్థగా రూపొందక మానవనే విశ్వాసాన్ని వెలిబుచ్చారు.

డా|| రాజేంద్ర ప్రసాద్ గారు చారిత్రాత్మకమైన యీ సమావేశంలో వుదాత్తమైన ఉపన్యాసాన్ని చేశారని ఒప్పుకోక తప్పదు. భారతదేశానికి సంబంధించిన యించుమించు అన్ని సమస్యలను ఆయన తన ప్రసంగంలో వుటంకించారు. మన దేశంలో యింకా పోర్చుగీసు, ఫ్రెంచి భూభాగాలు వుండటం సహించరాని విషయం. దీనికి సంబంధించి అధ్యక్షుని ప్రసంగంలో ఏమీ లేదు. మొత్తంమీద రాజేంద్రబాబూగారి యీ వుపన్యాసం అన్ని రాజకీయ పక్షాలవారిని సమాధానపరచేదిగా వున్నది. ప్రతిపక్షంవారు దీనిపై ఎక్కువగా విమర్శ చేసేందుకు ఏమంత ఆస్కారం లేదనే చెప్పాలి. ★


ఆంధ్రదేశమంతటా అన్నిముఖ్యకేంద్రములలో
త్వరలో
విడుదల
పక్షిరాజా వారి
కాంచన
తెలుగు
లలిత, పద్మిని, K.R.రామస్వామి,
దొరైరాజ్, ఋష్యేంద్రమణి, కుమారి,
రామశర్మ, దొరైస్వామి, నటించినది ...
డైరెక్షన్... S.M.శ్రీరాములు నాయుడు

కాపురం

1-వ దృశ్యము

(తలుపులు బాదిన చప్పుడు)

సోమమ్మ: ఎవరది అట్లా దబాదబా బాదేస్తున్నారు? తలుపులు విరిగిపోవూ. వస్తున్నా, వస్తున్నా.

(బయటనుంచి) పాలు, పాలు. తలుపు తియ్యండి, యే జామునే వినిపించుకోరే మమ్మా.

(తలుపుతీసిన ధ్వని)

సోమమ్మ: పాలు తెచ్చావా? ఇదిగో ఈ చెంబులో పొయ్యి.

పాలమ్మి: ఏమమ్మగారూ, ఎంత పిలిచినా పలకరూ?

సోమమ్మ: నాబొంద! రాత్రంతా నిద్రపట్టక తెల్లవారుజామునే కునుకుపట్టింది. పోనీ నేను సరేసరి నాకోడలికేం చెప్పు. బారెడు ప్రొద్దెక్కింది గదా, ఇంకా పట్టెమంచం దిగలేదు. బోలెడు పాచిపని ఉంది. ఇదంతా ఎప్పుడయేటట్టు, యేమిటి ఖర్మం. ఈ కాలపు కోడళ్ళకు మనం చెప్పలేమమ్మా.

పాలమ్మి: క్రొత్తకాపురం గదండమ్మగారూ?

సోమమ్మ: క్రొత్తకాపురమూ, వల్లకాడూ, కాపురానికొచ్చి మూడునెలలయితే, యింకా క్రొత్తపెళ్లికూతురేనా? ఏమిటోలే ఈ కాలపువాళ్లకి ఇల్లు, పనీ పాటా చేసుకుందాం అనే ధ్యాసే లేకపోతే మనమేం చేస్తాం. కాలమమ్మా, కాలం!

పాలమ్మి: నాకు ప్రొద్దుపోయిందమ్మా, నే వస్తాను. ఆ పాలచెంబు తియ్యండి.

సోమమ్మ: యేమే లలితా? తూర్పు వేపు చూడు. ఎంత ప్రొద్దెక్కిందో? ఇంకా వీధివాకిలి చిమ్మనన్నా చిమ్మలేదే?

లలిత: (అప్పుడే లేస్తూ ఆవలిస్తుంది) ఏమిటండీ అత్తయ్యగారూ, ఇంకా సరిగా తెల్లవారనన్నా లేదు. గందరగోళం చేస్తున్నారు?

సో: ఇంకాపైగా మంచంమీద దర్జాగా కూర్చొని ప్రొద్దు పోలేదంటున్నావా? నీతాత ఎవడు చేస్తాడీ చాకిరీఅంతా?

రామం: (లేస్తూ) ఏమిటమ్మా ప్రొద్దున్నే గొడవ చేస్తున్నావు?

సో: అవును రా నీకు గొడవగానే ఉంటుంది. ఉండదూ మరి?

రామం: అదికాదమ్మా, ఆ పనిమనిషిని కుదుర్చుకుంటే పొయ్యేదానికింత రభసెందుకు? దానికిచ్చే ముష్టినాలుగు రూపాయలతో మనం మేడలుగట్టబోతున్నామా?

సో: అవునులేరా, వందలు సంపాయించి పడేస్తున్నావు గదూ? ప్రొద్దున్నే లేచి పాచిపనిచేసుకోలేదుటరా ఎంత సుకుమారి అయినా?

ల: అబ్బ మీ రెందుకు పోట్లాడుకొంటారు మధ్య? ఇదుగో నే లేచి వస్తున్నా, కాస్త వళ్లు బడలికగావుంటే పడుకొన్న దానికింత ఆర్భాటం చేశారు.

(గిన్నెలు తోముతున్న చప్పుడు)

2-వ దృశ్యము

రాత్రి—

సో: యేమే లలితా? అప్పుడే గదిలోకి చేరేవా?

ల: (దూరాన్నుంచి) వస్తున్నా అత్తయ్యగారూ, వారు మంచినీళ్ళు డిగితే ఇచ్చివస్తున్నా.

సో: ఏదోవంకలే నీకసలు పనిమీద ధ్యాసుంటేగా? ఈ ఎంగిళ్లన్నీ ఇట్లావదిలిపెట్టి దుడదుడాపోవటమే.

ల: నేను ఎక్కడికీ పోలేదండీ? ఈ ఎంగిళ్లు ఎత్తి వంటిల్లు కడగకుండా ఎక్కడకు పోతాను?

సో: అంతేలే మాటకుమాట సమాధానం చెప్పటం నేర్చావు.

ల: జవాబు చెప్పకపోతే మీకెలా తెలుస్తుందత్తయ్యగారూ?

సో: అబ్బబ్బ! నీతోనే వేగలేనమ్మా. సరేలే ఈవంటిల్లంతా శుభ్రంచేసి, చిన్నబ్బాయికి పీటవేసి ఉంచు, వాడేప్పుడేళ్లడానికెళ్లాడో, ఇంకా రాలేదు వెధవ!

3-వ దృశ్యం

(పడకగదిలో లలిత, రామం)

ల: యేమండీ! మాపుట్టింటికి వెళ్లాలని ఉందండీ? మూడునెలలయింది మా అమ్మానాన్నవాళ్ళని చూసి ఈ సంక్రాంతి పండుగకు పోయొస్తాను పంపించరూ?

రామం: దానికేంలే లలితా రేపు అమ్మతో చెప్పిపంపిస్తాను.

ల: ప్రతిదానికీ అమ్మగారి పర్మిషను ఉండాలా ఏమిటండీ?

రామం: పెద్దవాళ్లింట్లో ఉన్నప్పుడు, మనం వాళ్ల మాటనుబట్టి పోవాలి.

ల: దేనికండీ పెద్దవాళ్లు వయసుకా బుద్ధికా? ప్రతిదానికీ మీ అమ్మ యేదో సాకు చెపుతుంది. నేను కాపురానికి రాకముందు ఉన్న పనిచేసే మనిషిని తీసేసింది గద, చాకిరీ అంతా చచ్చేటట్టు నే చేసుకోవాలి. అప్పటికీ మీ అమ్మ చేతిలో తిట్లు, సణుగులు తప్పవు. చేసినకొద్దీ చెయ్యమంటుంది. మీరేమో చూస్తూ ఊగుకొంటారు.

రా: లలితా యేంపని చేసినా మన యింట్లోనే, మనకోసమే గదా?

ల: అయితే దాని కంతూ పొంతూ ఉండక్కరలేదుటండీ. మనిషయి పుట్టింది చాకిరీకేనా?

రా: అమ్మయినా నీ మేలును కోరుతుంది గాని కీడును కోరుతుందా?

ల: అవును మాటలు బాగా చెప్తారు. మొన్న జ్వరంపడ్డ రెండురోజులూ నానా శాపనార్థాలు పెడుతూ చాకిరీ చేసుకుంది. మళ్ళీ అదే కూతురయితే అలా చేస్తుందా? కాలు క్రిందపెట్టనియ్యకుండా అన్ని పనులూ చూసుకోదూ? ఎందుకండీ ఇంత పక్షపాతం కోడలంటే. కోడలు కూడా ఒక తల్లి కూతురని మీ అమ్మకు తెలీదా?

రా: లలితా నీవు చదువుకున్నదానివి. అన్ని సంగతులు పూర్తిగా అర్థం చేసుకొనగల దానివి. నీకు నేను చెప్పాల్సిన అవుసరం లేదు. కోడలికీ, అత్తకీ వస్తున్న ఈ మనస్పర్ధ లీనాటివి కావు. ఈ అత్తాకోడళ్ల ద్వేషం పోవాలంటే, అత్తలంతా గుర్తించాలి తాముకూడా ఒకప్పుడు ఒక యింటి కోడళ్ళమేనని; తమ కోడళ్లు కూడా ఒక తల్లి కూతుర్లేనని.

ల: ఆ సంగతి మీ అమ్మకు మీ రెందుకు చెప్పలేరు?

రా: లలితా అదే నా తల్లితో చెపితే, 'వెధవా? నువ్వు నాకు చెప్పొచ్చావా? నాకు తెలీదా? నా పాలతో పెరిగి పెద్దవాడవై చివరికి నాకే నీతులు నేర్పొచ్చావా? కట్టుకొన్న పెళ్ళానికి చెప్పుకోలేక నా జోలికి వస్తున్నావా? అవునులే 'అడ్డాలనాడు బిడ్డలు గాని గడ్డాలనాడు బిడ్డలా' అని మనవాళ్లు చెప్పిన సామెత ఊరికే పోతుందా?' అంటుంది. చూసే పరాయివాళ్ళకు గూడా ఇదంతా రభసగానే ఉంటుంది

శ్రీరాగి

ల : అందుకని వాళ్ళ మనసులో మార్పు వచ్చేదాకా నా గతి యింతేనన్నమాట!

రా : లలితా? అక్కడే చదువుకొన్న యువతికీ చదువురాని యువతికీ తేడా. చదువుకొన్నందుకు నీ గొప్పదనం చూపించాలి. ఎదుటివాళ్లు నిన్ను తిట్టారని, నీవు ఎదురుతిరిగి తిట్టే, ఇద్దరూ బజారున పడి అల్లరవటమేగదూ? ఎదుటివారు దౌర్బల్యానికి గురి అయినప్పుడు, మన మా దౌర్బల్యానికే లొంగకుండా ఉండటమే గొప్పదనం. ఆమె తిట్టినప్పుడల్లా నీవు తలవంచుకొని పోతుంటే, ఎన్నిసార్లని నిన్ను తిడుతూ ఉంటుందామె? తిట్టి తిట్టి విసుగెత్తి ఊరుకొంటుంది. దానికే నీ వెదురు తిరిగితే ఆమె మరింత రెచ్చిపోతుంది. అభిప్రాయభేదం వచ్చిన ఇరువురూ కలిసి గొంతెత్తితేగదా కలహం అయ్యేది? రెండు చేతులనూ కలుపుతేగదూ చప్పుడయ్యేది. లలితా చదువంటే పుస్తకాలద్వారా భాష గాదు నేర్చుకొనేది. ఆ భాష మన కందచేసే భావాలు నేర్చుకోవాలి. గ్రంథాలు పఠించటం పదాలుకోసం కాదు. ఆ పదాలు మన కందచేసే భావాలకోసం. ఒక రచన చదవటం ఆ రచయిత మన కందచేసే సందేశంకోసం.

కాని ఒక సంగతి. నా మీదా నీ మీదా ఆధారపడి కొంతమంది, అంటే నాకు నా తల్లిదండ్రులు, అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లూ, నీకు నీ తల్లిదండ్రులూ, అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లూ ఉన్నారు చూడు. ముందు వాళ్ల సౌఖ్యం మనం చూడాలి. తరువాత మన సంగతి చూసుకోవాలి. అంతమాత్రంచేత నాకు నీమీదా, నీకు నామీదా ప్రేమలేదనుకోవటం బుద్ధి పొరపాటు.

4-వ దృశ్యం

సో : అబ్బాయి, అబ్బాయి, ఎక్కడరా?

రా : ఇక్కడే నమ్మా! ఎందుకంత ముంచుకొనిపోయినట్టరుస్తావు?

సో : అవునులే అరవటంగా నే వుంటుందిలే. ఇట్లా దొడ్లోకి రా. నీభార్య చేసిన పనితనం చూద్దుగాని (దొడ్లోకి వెళ్లినట్లు నడక చప్పుడు, పిండికొడుతున్న ధ్వని)

సో: చూసేవుట్రా ఆ పిండి దంచమంటే ఎట్లా దంచుతున్నదో? చూడు, ఆ కుండి చుట్టూతా పిండంతా ఎట్లా చిమ్మిందో సగం పిండంతా నేలపాలేగదా? ఇట్లా అయితే సంసారం ఎలా గడుస్తుందిరా నాయనా?

సో : ఇది చాలదుటరా ఇంకా ఏవ నాలి?

ల : అత్తయ్యగారూ, ఊరికే అలా ఎందు కిదవుతారు. ఒకసారి రెండుసార్లు చూపిస్తే పనిచేసుకుపోనూ?

సో : ఆఁ పని చేసేటట్టే ఉన్నావు! నీవు పని చెయ్యటానికొస్తేగా?

ల : ఊరికే ఎందుకండీ అలా మాట లంటారు?

సో : ఏంరోయి నువ్వు దగ్గరుండి నీ పెండ్లాముచేత మాటలనిపించేటట్టున్నావు? అయ్యో రాత!

రా : లలితా నువ్వూరుకో. ఇంట్లోకి పద.

ల : ఊరుకోక నేనేం చేశానండీ?

రా : అబ్బబ్బ! ఈ పాడుకొంపలో నే నుండలేను. ఎప్పుడూ ఏదో గొడవ!

(బయటకు నిష్క్రమణ)

5 వ దృశ్యం

రా : (స్వగతం) అబ్బబ్బా, ఈ అత్తాకోడళ్ళ మధ్య నేను చచ్చిపోతున్నాను. పోనీ అది చిన్నపిల్ల ఊరుకోవమ్మా అంటే ఈమె ఊరుకోదు. లలితా నువ్వు చదువుకొన్న దానివి గదా, ఆమె చెప్పినట్లు

కోడలు

ల : అబ్బ! ఎంత లెక్చరిచ్చారండీ?

రా : అక్కడే నీలో ఉన్న దౌర్బల్యం బయటపడుతున్నది. ఇప్పుడు నే చెప్పిన మాటలే నీ పాఠ్యపుస్తకంలో ఉంటే, చక్కగా కంఠతా బెట్టి పరీక్షలో రాస్తావు. కాని దేనికి పరీక్షలో వ్రాయటం? అవి నీ మనస్సుకు ఎక్కేందుకు నీ చేత కంఠతా పెట్టిస్తున్నారుగాని పరీక్షలో వ్రాసేందుకు గాదు. లలితా మనం చదువుకొన్న విజ్ఞానాన్ని మన దినచర్యలో ఇముడ్చుకోవాలి. అలా చెయ్యనినాడు నీ చదువూ, నా చదువూ వ్యర్థం.

ల : సరేగాని నాకు చీర ఎప్పుడు కొంటారు? నా చీరల సంగతి మీ కెందుకు జ్ఞాపక ముంటుంది? మీవాళ్ల సంగతి చూసుకొంటారుగాని నా సంగతి మీ కెందుకు గుర్తుంటుంది?

రా : లలితా అక్కడే నీవు పొరబడుతున్నావు. మనకు వివాహమయిన మరుక్షణంనుంచీ, నాకు నువ్వూ, నీకు నేనూ గాక మరింకెవ్వరు దిక్కు? నీ మనస్సులో అలాంటి దురభిప్రాయాలు పెట్టుకోవాక.

రా : దీనికేటమ్మా ఇంత ఆర్భాటంగా పిలిచేవు? చిన్నపిల్ల గాదూ? ఎప్పుడన్నా పుట్టింట్లో చేసి ఎరుగునా ఏమన్నానా?

సో : అయితే దానికి బుద్ధి చెప్పడం పోయి దాన్నే వెనకేసుకొస్తావేం రా?

రా : అదికాదమ్మా? అది పిండి పార బొయ్యాలని బోస్తుందంటావా? పని చేత గానప్పుడు చెప్పి, ఒకతడవా రెండుతడవలు చూపించి చేయించుకోవాలిగాని ఎందుకమ్మా యింత రభసా?

సో : సరేలేరా? నీకు చూపించటం నాదే బుద్ధి తక్కువ. మీరూ మీరూ ఒక్కటి. మధ్య నేనే చెడ్డదాన్ని. దాన్నేమన్నా అంటే అది ఘుంయిమని లేస్తుందాయె. నువ్వు కొడుకువి గదా అని నీతో చెప్తే దాన్నే వకేసుకొస్తావు? బాబూ ఈ బాధ నేను పడలేను గాని నన్నెక్కడన్నా పంపించెయ్యి. హాయిగా ఎక్కడో ఒక మూల 'రామా, కృష్ణా' అనుకొంటూ కూర్చుంటా.

రా : ఇప్పుడు నిన్నేం బాధ పెట్టానమ్మా ఎక్కడికో వెళ్తానంటావు?

పోరాదా అంటే అది ఊరుకోదు. రామ! రామ! ఈ అత్తాకోడళ్ళ పోట్లాట మా యింటోనేనా ప్రతియింట్లో ఉంటుందా? వీళ్లమధ్య నే ఛస్తున్నా. *My god*! ఫస్టు వరల్డు వారయిపోయింది. సెకండు వరల్డు వారయిపోయింది. దేశాలు శాంతించినయి. కాని ఈ అత్తాకోడళ్ళ 'వార్' ఎప్పుడంత మవుతుందోరా బాబూ? పోనీ మదర్ *old woman* అని వదిలేద్దాము మరి కొత్తే జేల్లోనుంచి బయటకొచ్చిన ఈ ఎడ్యుకేటెడ్ గరల్సు మాటేమిటి? ఏమో! ఆ బ్రహ్మదేవుడు ఈ అత్తాకోడళ్లమీదేదో శాపం పెట్టుంటాడు. లేకపోతే ప్రతి యింట్లోనూ ఏమిటీ *Nuisance* పోనీ శాంతిసంభాషణలు సాగిద్దామా అంటే కొడుకుల *mediation* వాళ్లకు సుతరామూ పడదుగదా? ఇంక యింట్లో రోజూ జరిగే కొట్లాటలు తీర్చటానికి *U. N. O* నుంచి *peace commission* తెచ్చుకోవాలి? *what nonsence*?

6-వ దృశ్యం

రా: యేమమ్మా, లలిత పుట్టింటికి వెళ్లి ఒక నెలరోజులుండి వస్తుందట. లేపు దిగబెట్టి రమ్మంటావా?

సో: దాన్ని సంక్రాంతి పండక్కి పుట్టింటికి పంపి కూర్చుంటే ఇక్కడ పనిపాటలన్నీ ఎవరు చూస్తార్రా.

రా: పనిమనిషిని పెట్టుకొందాం. చాకిరీ ఎప్పుడూ ఉండేదేగా.

సో: అదిగాదురా, అమ్మాయిని, అల్లుణ్ణి పండక్కి తీసుకురావట్రా. పాపం అది ఎట్లావుందో ఏమో ఉత్తరం గూడా రాలేదు.

రా: యింకా క్రొత్త అల్లుడే నా పండక్కి తీసుకురావటానికి. ముగ్గురి పిల్లలను కన్న తర్వాత గూడా యింకా క్రొత్త అల్లుడికి మర్యాదలు చేసినట్లు చెయ్యమంటావా?

సో: నా ఖర్మరా బాబూ. వాళ్లు నాకేన్ని వుంటే యిట్లా అనేవాడ్రా? చక్కగా చిలకాగోరింకల్లాగా అల్లుణ్ణీకూతురిని పండక్కి పిలుద్దామనుకుంటే నువ్వనేదిదా? నిన్నగాక మొన్న పెళ్లయిందో లేదో అప్పుడే తోబుట్టువును మరిచిపోతావా? ఎంతయినా మగవాళ్లురా అబ్బాయి.

రా: అదేమమ్మా ఏదన్నా అంటే చెల్లాయిమీద నాకు ప్రేమలేదంటావు? యీ పండక్కి పోనీ లలిత పుట్టింటికి వెళ్తానన్నది గదా అని వాళ్ళని పిలవద్దంటున్నాగాని, పిలవటం అసలేమానేయమన్నానా? నీకు కూతురయితే నాకు చెల్లెలుగాదా అమ్మ?

సో: పోనీ నీ భార్యనే తరువాత పుట్టింటికి పంపించుకో.

రా: సరేలే అమ్మ నీయిష్టం.

సో: ఇవ్వాళే ఉత్తరం వ్రాయి బావను పండక్కి నాలుగురోజులు ముందుగా రమ్మని.

7 వ దృశ్యం

సుబ్బాయమ్మ: ఏమండీ అల్లుడిదగ్గర నుంచి ఏమన్నా జవాబు వచ్చిందా?

సుబ్బారావు: ఇవ్వాళే ఉత్తరం వచ్చింది.

సుబ్బాయమ్మ: యేమని వ్రాశారు? పండక్కి బయలుదేరి వస్తామన్నారా?

సుబ్బారావు: రారట. కొన్ని తొందర పనులుండటంవలన యీ పండక్కి అమ్మాయితో రాలేను. వచ్చే పండక్కి తప్పక వస్తానని వ్రాశాడు.

సుబ్బాయమ్మ: అయ్యో! ఖర్మం. పండక్కి అల్లుడూ కూతురూ యింట్లో సరదాగా తిరుగుతూంటే చూసే అదృష్టం నాకు లేదు గాబోలు. పోనీ మీరు స్వయంగా వెళ్లి పిలుస్తే వస్తాడేమో చూడండి.

సుబ్బారావు: నీదంతా పిచ్చి. ఉత్తరం వ్రాస్తే రానివాడు స్వయంగా వెళ్లి పిలుస్తే మటుకు వస్తాడని నమ్మకమేమిటి. యిదంతా నీ వియ్యంకురాలి మహిమలాగా తోస్తున్నది. స్వతహాగా మనఅల్లుడు మంచివాడే. క్రిందటిసారి వెళ్లినపుడు 'తప్పకుండా సంక్రాంతిపండక్కి రావాలి సుమా' అని చెప్తే 'అలాగేలెండి' అన్నాడు.

సుబ్బాయమ్మ: తనకూతురంటే తనకెంత ప్రేమో, మనకీ అంతే అన్న సంగతి సోమమ్మగారు తెలుసుకోలేదా? ఈ తడవ పండక్కి మీరేమైనాసరే పోట్లాడిఅయినా నాకూతురుని తీసుకురండి.

సుబ్బారావు: ఇంతలో తొందరదేనికి? తొందరపడితే వ్యవహారం చెడుతుంది. అయినా నేను పోయి ప్రయత్నిస్తాను.

8-వ దృశ్యం

(వాకిలి ముందర బండి ఆగినచప్పుడు)

సో: అదిగో అమ్మాయి, రానే వచ్చింది. మా అమ్మే! వంట్లో కులాసాగావుంటున్నదా అమ్మాయి.

జానకి: ఆఁ వంట్లో బాగానే వుంటున్నది.

సో: ఆయనేరీ?

జా: మధ్య దారిలో బజారులో పని వుండి ఆగేరు. మెల్లగా వస్తారు. లలితా కులాసాగా వున్నావా?

ల: ఆఁ కులాసాగానే వున్నాను.

సో: లలితా అట్లా గుడ్లు వప్పగించి చూడకపోతే కాళ్లు కడుక్కోటానికి నీళ్లు తెచ్చియ్యరాదూ?

ల: ఇదిగో తెస్తున్నా నత్తయ్యగారూ.

సో: మరీ నీ వదినెకు ఒక్క పని తెలీదే, చెప్పి చెప్పి నోరు పడిపోతున్నది.

జా: చిన్నపిల్ల గాదుటమ్మా? అలా కసురుకుంటే ఎలాగ?

(ముగ్గురు పిల్లలూ గోలగోలగా ఇదిగో మా అమ్మమ్మ అని అరుస్తూ వుంటారు)

ల: ఇదిగో వదినా నీళ్ళు, కాళ్ళు కడుక్కో. ఓరేయి రామూ, గోపీ, మధూ మీకు కాళ్లు కడుగుతాను రండి.

సో: అమ్మాయి లలితా, కాసిని కాఫీనీళ్లు పెట్టమ్మా. జానకి ప్రొద్దున కాఫీ త్రాగిందో లేదో.

జా: కాఫీ త్రాగే బయల్దేరామమ్మా. మళ్ళీ యిప్పుడు దేనికి?

సో: ప్రయాణంచేసి అలసి వచ్చావు. కాసిని కాఫీనీళ్లు త్రాగుదు గాని.

(రామం ప్రవేశం)

సో: అదిగో అబ్బాయి వచ్చాడు.

రా: అరే, చెల్లాయి వచ్చిందే! జానకీ కులాసాగా వున్నావా? బావగా రేరీ? అరేయి గోపీ, రామూ, మధూ, మీ మామయ్యను మర్చిపోయినారా. రండి రండి.

(పిల్లలు మామయ్యా, మామయ్యా అంటూ వస్తారు)

జా: కులాసాగా వున్నా మన్నాయి. మీ బావగారు బజార్లో పనివుండి ఆగిపోయ్యారు. ఈపాటికే వస్తూ ఉండాలి.

సో: రామం, జానకి చిక్కినట్టు కనబడటం లేదూ?

జా: పో అన్నాయ్. అమ్మ మాటల కేంలే, మీ బావగారు రోజురోజుకూ బలిసిపోతున్నానని హేళనచేస్తూ ఉంటారు.

రా: జానకి చిక్కలేదు బలవలేదు. ఇదివర కెట్లా వుందో ఇప్పుడూ అట్లాగే వుంది.

సో: రామం యింట్లో కూరలేమీ లేవు. యిన్ని కూరలు తొందరగా మార్కెట్టు కెళ్లి తీసుకురా నాయనా. నీ చెల్లాయికి కూరలేంది అన్నం సయించదు.

రా: లలితా ఆ సంచీ ఇట్లా ఇయ్యి బజారుకు వెళ్ళొస్తాను.

(రామం నిష్క్రమణ)

(సోమమ్మ అల్లుడు ప్రకాశరావు ప్రవేశం)

సో: రా! నాయనా రా. ఎన్ని ఉత్తరాలు వ్రాసినా సమాధానం వ్రాయ వేమయ్యా.

ప్ర: వారానికొకసారి మీ అమ్మాయి క్షేమసమాచారాలను గురించి వ్రాస్తూనే ఉంటిని. ఇంకా ఎన్ని రాయమంటారు? మా బావమరిది ఇంట్లో లేడాయేం?

జా: అన్నాయ్ ఇప్పుడే మార్కెట్టుకు వెళ్లాడు; బావగారికి కూరలు లేంది ముద్ద దిగదుగదూ, అందుకని కూరలు తేవటాని కెళ్లాడు.

ప్ర: అవును లే నీ పేరు చెప్పుకొని నేను కూడా తింటాను. అన్నట్లు మా ఒదిన లలిత కనపడదేం?

జా: యింట్లో పనిచేసుకొంటున్నది. (పెద్దగా) లలితా మీ అన్నయ్యగారు పిలుస్తున్నారు.

ల: (లోపల నుంచి) వస్తున్నా. కులాసా అన్నయ్యగారూ?

ప్ర : యేమమ్మాయి, చిక్కిపోయినావు. పని ఎక్కువయిందా యేం?

అ : లేదండీ అమ్మాయిగారూ నేనేం చిక్కిందే?

ప్ర : ఎందుకమ్మాయి బూకరిస్తావు? నీవు కాపురానికొచ్చే క్రొత్తలో ఎలా ఉన్నావు, ఇప్పుడెలా ఉన్నావు? అన్నం సరిగా తింటంలేదు కాబోలు. అమ్మకోసం బెంగపడ్డట్టుంది. ఏమండీ అత్తగారూ పాపం లలితను పండక్కి పుట్టింటికి పంపించరాదూ?

సో : నీదంతా చోద్యమయ్యా, కాపురానికొచ్చి ఇంకా మూడునెలలు కాలేదు. అప్పుడే అమ్మకోసం బెంగపెట్టుకోందా?

అ : వస్తా నన్నయ్యగారూ, లోపల చాలా పనివుంది (నిష్క్రమణ).

జా : ఏమమ్మా, పోనీ పాపం ఒదినెను వాళ్ళ పుట్టింటికి పంపించరాదుటమ్మా?

సో : ఏమో మీరంతా వస్తారు. అంతా ఇంట్లోవుంటే సరదాగా వుండొచ్చు ననుకున్నాను గాని, అమ్మకోసం బెంగపెట్టుకొందని నాకేం తెలుసు. బెంగపెట్టుకోటానికి చిన్న పసిపాపా యేం?

ప్ర : మీ అమ్మాయిదగ్గరనించి వారం రోజుల కొకసారి ఉత్తరంరాందే ఉండలేరే, లలితమాత్రం వాళ్ళ అమ్మకు అలాంటి పిల్ల కాదుటండీ?

(ఇంటిముందు బండి ఆగిన చప్పుడు)

జా : మన యింటిముందే బండి ఆగింది. ఎవరో వస్తున్నట్టున్నారు?

(సుబ్బారావు ప్రవేశం)

సో : ఓఁ వియ్యంకులుగారా. రండి, రండి, అమ్మాయ్ కాళ్ళకు నీళ్ళు తెచ్చియ్యమ్మా! అలా కుర్చీలో కూర్చోండి.

సు : మీ అల్లుడుగారిక్కడే వున్నారే? ఏమండీ ప్రకాశంగారూ ఎప్పుడూ రావటం.

ప్ర : నేనూ ఇంతకుముందే వచ్చానండీ?

సు : పిల్లలంతా కులాసా?

ప్ర : ఆఁ ఆఁ అంతా కులాసేనండి మీ దయవల్ల.

సు : అల్లుడుగారు లేరల్లేవుందే.

ప్ర : ఇప్పుడే బయటికెళ్ళాడండి.

సో : అమ్మాయి లలితా, మీ నాన్నగారొచ్చారే, ఒక్కసారిలారా (సుబ్బారావుతో) ఏమిటో పనిచేస్తూనే వుంటుంది ఎప్పుడూ! వద్దంటే వినదూ ఎలాగండీ మీ అమ్మాయితో.

ల : (ప్రవేశిస్తూ) నాన్నా ఎప్పుడొచ్చారు?

సు : ఇదేనమ్మా రావటం. అదేమమ్మా అలాగున్నావు. అంత చిక్కిపోయావేం? ఏమండీ అక్కగారూ అమ్మాయి ఒంట్లో బాగా లేకపోతే అల్లుడుగారిచేత ఒక్క కార్డు ముక్క రాయించగూడదుటండీ.

సో : అదేంటన్నగారూ, అదేమన్నా నాతో చెప్తుందా, చేస్తుందా? మీకు కార్డు రాయించటానికి.

ల : నాకేం నాన్నగారూ, బాగానే వున్నాగా.

సు : నీకేం తెలుస్తుందమ్మా మానే వాళ్ళకు తెలుస్తుందిగాని. ఏమండీ అక్కగారూ అమ్మాయిని అల్లుణ్ణి పంపించండి పండక్కి ఉండి వస్తారు.

సో : అన్నగారూ, మీరు చూస్తూనే ఉన్నారుగా యిప్పుడే మా అమ్మాయి వాళ్ళూ వచ్చారు పండగకి ఉండిపోదామని. మాస్తానే మీ అమ్మాయిని పంపించమంటే ఎలా?

సు : అదిగాదక్కగారూ, నేనెప్పుడో మీకు త్తరం వ్రాశాను అమ్మాయిని అల్లుణ్ణి పండక్కి పంపించమని. అల్లుడుగారుకూడా క్రిందటిసారి నేను వచ్చి అడిగినపుడు తప్పకుండా ఈసంక్రాంతి పండుగకి వస్తామని చెప్పారు. ఇప్పుడు మీరిలా అంటే ఎలా?

సో : ఏమో నాకా సంగతి యేమీ తెలీదు. మీ అల్లుడుగారిష్టం మీ అమ్మాయి యిష్టం. మధ్య నాదేముంది?

(అంటూ లోపలికి పోతుంది)

(రాముం ప్రవేశం)

రా : నమస్కారం మామగారూ, నమస్కారం బావగారూ. అంతా ఒకేసారి కూడబలుక్కొని వచ్చినట్లున్నారు?

సు : యేమోయి రాముం? అమ్మాయీ నువ్వూ బయలుదేరండి మన వూరు పోదాం.

రా : మా అమ్మగారిని కనుక్కున్నారా?

సు : అదేమిటోయ్ ఇంట్లో నీ పెత్తనమా? మీ అమ్మగారి పెత్తనమా?

రా : అదిగాదు లెండి. పెద్దవాళ్ళున్నపుడు వాళ్ళ ఇష్టప్రకారం నడచుకోవాలి గదా!

సు : ఆమె నిన్నడగమంది.

రా : మా బావగారూ, చెల్లాయి యివ్వాళే వచ్చారు. పండక్కి వాళ్ళనింట్లో పెట్టి మీ యింటికి రావటం బాగ వుంటుందంటారా?

సు : నాకదంతా తెలీదు. పండక్కి రమ్మని నీకు ముందే వ్రాసేనా లేదా?

రా : వ్రాసిన మాట నిజమే లెండి.

సు : మరింకేం. అమ్మాయిని తీసుకొ బయల్దేరండి.

(లోపలనుంచి) సోమమ్మ : మీ కూత

ఇప్పుడు పంపటానికి వీల్లేదు అని చెప్పరా అబ్బాయి.

సు: చూడు నాయనా అమ్మాయి ఈ మూడు నెలలలో ఎలా చిక్కిపోయిందో. పోషణ సరిగా లేదు కాబోలు.

పో: (లోపలనుంచి) ఆమె తినక పోతే బలవంతం చేసి నోట్లో కుక్కమంటారా?

సు: అక్కగారూ అలాగంటారు? మా అమ్మాయిమటుకు మీ కూతురులాంటిది కాదుటండీ. ఏమయ్యా రామం మాట్లాడవేం?

అ: నాన్నగారూ ఎందుకండీ ఈ రభస అంతా? నాకు పోషణ సరిగానే జరుగుతున్నది. నేను మీ అల్లుడుగారు తరువాత వస్తాము మీరు వెళ్లండి.

సు: ఈ రభసఅంతా నీ క్షేమంకోసం, నీ సుఖంకోసమే తల్లీ. నా కళ్లెదుట నువ్వు చిక్కి శల్యమైపోతుంటే చూస్తూ ఊరుకోమంటావా? ఏమయ్యా రామం, మరి నువ్వు రాకపోతే అమ్మాయినన్నా నా వెంట పంపించు.

రా: ఏంచెప్పమంటారు మామగారూ, తీసుకెళ్లమంటే అమ్మకు కోపం, వద్దంటే మీకు కోపం, ఇటువంటి సందిగ్ధావస్థలో నేనేం చెప్పేది. అంతా మీ యిష్టం.

సు: అంటే పరోక్షంగా పంపించనని చెప్తున్నావు. అంతేగదూ?

అ: నాన్నగారూ నా మాట విని మీరు వెళ్లిపోండి. వీలు చూసుకొని నేను వస్తాను.

సు: సరేనమ్మా నీ యిష్టం. నేనేది చెయ్యదల్చుకొన్నా నీ మేలుకోసమే గదా. అక్కగారూ; ప్రకాశంగారూ వెళ్తొస్తాను. రామం పోయి రమ్మంటావా?

రా: అదేమిటి ఇప్పుడు వెళ్తానంటారేమిటి భోజనంచేసి సాయంకాలం వెళ్దురు గాని మామగారూ!

సు: ఇంకా భోజనమెందుకులే రామం. వచ్చిన పని వాకిటనే అయిందిగదా. వస్తా. లలితా పోయొస్తానమ్మా.

పో: (లోపలనుంచి) యింట్లో అల్లుడు కూతురు వచ్చిఉంటే కూతురును పుట్టింటికి ఎలా తీసుకువెళ్దామని వచ్చాడో.

రా: అదేమిటమ్మా ఆయన కేం తెలుసు, చెల్లాయీ బావా పండక్కి మనింటికి వస్తారని.

9 వ దృశ్యం

ప్ర: జానకీ, జానకీ!

జా: వస్తున్నా, యేమిటండీ గాభరాగా పిలుస్తున్నారు.

ప్ర: యేంలేదు మన పెట్టె, బెడ్డింగు సర్దేయ్.

జా: యేమిటీ విడ్డూరం, ఎక్కడికీ ప్రయాణం?

ప్ర: వింతలేదూ, విడ్డూరంలేదు. మనం మన ఊరు పోదాం త్వరగా తెముల్చు.

జా: అదేమిటండీ మనం పండక్కి ఇక్కడుందామని వచ్చాంగదూ?

ప్ర: రావటం ఉందామనే వచ్చాం గాని, ఇదిగో ఇప్పుడే మా ఆఫీసునుంచి

(47-వ పేజీ చూడండి)

సాగదు

కాళ్లు తేలిపోతున్నాయ్. తను బస్సు దగ్గరకు పొయ్యేలోగా పడిపోడు గదా! వొక్కపూట అన్నం తినకపోయేసరికే యెంత బలహీనంగా వుంది! జ్వరం రానంతవరకే తను మనిషి!

బస్సు యింకా రాలేదు. వొక క్రమ పద్ధతిలో నడవ్వు. పదినిమిషాల కోసారి, పావుగంట కోసారి-అంతా వాళ్లయిష్టం. అబ్బ! నిలుచుంటే కళ్లు తిరుగుతున్నట్టుగా వుంది. అది చాలక చుర్రుమంటున్న యెండ!

పోనీ రిక్షా యెక్కిపోతే! వుహుఁ. లాభంలేదు. బస్సైతే బేడతో పోతుంది. రిక్షాకి పావలా యిచ్చుకోవాలి. అయినా తన దగ్గర డబ్బులేవీ? రెండు రోజుల్లో జీతాలొస్తాయి. నాల్గవ తారీకెప్పుడొస్తుందా అని తహతహ.

బ్రతికొనురా బాబూ! అనుకున్నాడు బస్సు చూచి. వచ్చినబస్సు తిన్నంగా వెళ్లవచ్చునా? లేందే! మధ్యమధ్య పావుగంటల మజలీలు! నోరు మూసుకొని కూచోరు జనం. వొకటే రొద-తను జ్వరంతో బాధపడుతున్న వ్యక్తి అని కొంచమన్నా గమనించరు!

తను అనుకున్నంతే అయింది. డాక్టరెక్కడికో వెళ్లాడట! అరగంటవరకు తిరిగి రాడట. ఆస్పత్రిలో పట్టుమని పది నిమిషాలు కూచుని పేషెంట్సుని చూడడు. రావడమే పదింటికి-సిమ్మెంటు బల్లలమీద కూర్చుంటే నడుములు విరిగి పోతున్నయ్ తనకి.

డాక్టరు వచ్చాడు. కానీ వచ్చినవాడు వెంటనే యెవరితోనో రాజకీయాల చర్చలంకించుకున్నాడు. యెంతకీ తెములడు. డాక్టర్లకి రాచకీయా లెందుకో? హాయిగా ప్రాక్టీసు చేసుకుంటూ నాలుగురాళ్లు సంపాదించవచ్చు. రాజకీయాలోకి దిగి రెంటికీ చెడ్డరేవళ్ళవుతారు తను చెప్పేదేదో సరిగా వినిపించుకోడు-గబగబ చీటి రాసిస్తున్నాడు డాక్టరు.

"ఇదిగో-ఈ మాత్రలు కొని రోజుకి మూడు వేసుకో!" అన్నాడు.

తనేదో నసిగాడు. డాక్టరు వినలేదు. తన దగ్గర డబ్బుల్లేవన్న సంగతి డాక్టరుకేం తెలుసు!

"మాత్రలు రెండురోజుల తర్వాత కొనకూడదాండీ!" తను అడిగాడు.

"వుహుఁ. మిక్శ్చర్‌తోపాటు అవీ వాడాలి లేకుంటే జబ్బు ముదురుతుంది సుమా!"

దాంతో నోరు మూసుకొని బయట పడ్డాడు తను-మందు తప్పకుండా కొనమన్నాడు గాని యెల్లా కొనడం? అప్పుకూడ పుట్టదాయె. తన స్నేహితులంతా గుమాస్తాలే! అందరూ ఖాళీ జేబుల్తో జీతాల కోసం మీనమేషాలు లెక్కపెడుతుంటారు.

కష్టాలన్నీ కట్టగట్టుకొని వస్తాయెందుకో ననుకున్నాడు. ఆఖరికి బ్రెడ్ కొనడానిక్కూడా చిల్లర డబ్బులు లేవు తనదగ్గర. తన ఆశలన్నీ సుబ్బారావుమీదే-వాడొక్కడే తనకి ఆఫీసులో ఆప్తమిత్రుడు. యెలాగైనా సంపాదించి పెడ్తాడు నాలుగు రూపాయలు.

బస్సుదిగి అట్లాగే మూలుగుతూ, వుస్సురస్సు రంటూ సుబ్బారావు యిల్లుచేర "సుబ్బారావ్!" అని కేక వేశాడు.

"లేరండీ! యిప్పుడే ఆఫీసుకి వెళ్లారు!" అని యింట్లోంచి జవాబు వచ్చేసరికి తన ప్రాణాలెగిరిపోయి నట్టయినయ్. ఆఫీసుకు వెళ్ళేందుకు యింకా అరగంట టైం వుండగానే వెళ్లిపోయాడేం? భలేగా కలిసి వస్తున్నయ్ పరిస్థితులని విషాదంగా నవ్వుకున్నాడు తను.

తడబడే కాళ్లతో నడుస్తున్నాడు ఆశలన్నీ వదులుకొని - "యేరా అలా వున్నావ్?" అని మూర్తి యెదురుపడి అడిగాడు.

"జ్వరం వస్తోంది భాయ్!"

"యెప్పట్నుంచీ?"

"నిన్న సాయంత్రంనుంచీ!"

"అయ్యోపాపం! మరి డాక్టరు దగ్గ కెళ్లావా?"

"ఆఁ! చూడు మూర్తీ! సుబ్బారావ్ ఆఫీసులో కనిపిస్తే వోమాటు అర్జంటుగా మా యింటికి రమ్మంటావ్ గదూ?" అన్నాడు తను.

"సరే!" మూర్తి వెళ్లిపోయాడు.

నడిచే వోపిక యేమాత్రం లేక రిక్షా యెక్కి యిల్లు చేరుకునేసరికి తన భార్య చంటికుర్రాణ్ని వోదార్చుతోంది. కుర్రాడేడుస్తూనే వున్నాడు.

"యేమండీ! డాక్టరు మందిచ్చాడా?" అడిగిందావిడ.

"ఆఁ! మందుకొనాలి కూడా!"

"అయ్యో! మందుకొనాలీ. వూరుకో బాబూ! చూడు! మీ నాన్నగారికి జ్వరం వచ్చిందిః వూరుకో!"

"చేతిలో దమ్మిడీ లేదు. మందు కొనడమెల్లా హేమా!"

"యేం చేదామండీ! యింట్లో కట్టెపుల్లలు కూడా అయిపోయాయి"

వొళ్లు మండిపోయింది. మందు యెలా కొనాలో అని మథన పడుతూంటే కట్టెపుల్లల కొచ్చింది తొందర! ఆడవాళ్ళకి కొంచమైనా యుక్తాయుక్త పరిజ్ఞానం వుండదా అని గొణుకున్నాడు జ్వరం విసుగులో-

"పక్కింటివాళ్ళని వో అయిదురూపాయలు అప్పు అడిగేదా?"

"నీకేం మతిపోయిందా హేమా! మనం యీ యింట్లో కొత్తగా చేరాం. పరిచయం లేనివాళ్ళని అప్పెలా అడగ్గలం?"

"అవసర మొచ్చినప్పు డేంచేస్తాం?

"యేమైనాసరే-ఆపనిమాత్రం చెయ్యొద్దు!"

తనకిక మాట్లాడే ఓపిక లేకపోయింది. మంచంమీద నడుం వాల్చాడు-ముక్కు

లోంచి వెచ్చగా వస్తోంది శ్వాస. వొళ్లంతా హూనమైనట్టుగా వుంది. హేమ తన వొంటిమీద చెయ్యివేసి, "మీవొళ్లు యింత మసిలిపోతుందేమండీ!" అంటూ థర్మామీటరు తెచ్చింది. చూశాడు. 103 డిగ్రీల జ్వరం. తనకు తెలుసు–యెందుకు జ్వరం యెక్కరాదూ? వొళ్లు బాగా అలసిపో లేదూ నడిచి నడిచి?

కళ్లు మూసుకున్నాడు బాధగా. ఆ చీకట్లో యేమిటేమిటో సుళ్లు తిరుగుతున్నాయ్ కళ్ళముందు. మంచంమీద తను వొక పక్కకి జారిపోతున్నాడు. భయంగా మంచం గట్టిగా పట్టుకున్నాడు. మళ్ళీ రెండోపక్కకి జారిపోతున్నాడు. కళ్ళముందు చీకట్లో యేవేవో తళుక్కుమంటోంది. ఆ వ్యథ భరించలేక కళ్లు తెరిచాడు–నీరసంగావుంది–

తలుపు తట్టిన చప్పుడు. సుబ్బారావే అయివుండాలి. "యెవరూ?" అన్నాడుతను.

"నేనేరా;" సుబ్బారావు గొంతుకే!

"లోనకురా!"

తలుపు నెట్టుకుని సుబ్బారావు వచ్చాడు, "యేరా! యెలాగుంది వంట్లో!" అంటూ.

"నిన్నటినుంచి జ్వరం వస్తోంది. ఇవ్వాళ అటు యిటు తిరిగేసరికి టెంపరేచరు యెక్కువైంది!"

యేమిటో మాట్లాడుతున్నాడు గాని డబ్బుసంగతి త్వరగా చెప్పేయాలని ఆదుర్దా. వో అయిదునిమిషాలు అయిన తర్వాత తను యెంత యిరుకులో పడ్డాడో సుబ్బారావుకి నివేదించాడు.

"నా పరిస్థితీ అధ్వాన్నంగా వుంది. కానీ నీవిషయం చూస్తుంటే నాకు మరీ యిదిగావుంది. ఈరోజు వొకరిద్దరు డబ్బిస్తామని ప్రామిస్ చేశారు. సాయంత్రానికెలాగయినా సాధించుకొస్తాలే!" అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావుకోసం యెదురుచూశాడు. సాయంత్రం ఐంది. చీకటి పడుతోంది. తనవొంట్లో టెంపరేచరు యెక్కువైంది పుదయంకన్నా–మాత్రలు కొందామనే డబ్బుకోసం అంత ఆదుర్దా. టెంపరేచరు అందుకే యెక్కువైందేమో! డాక్టర్లమీద, మిత్రులమీద, డబ్బున్న వాళ్ళమీద మండిపోతున్నాడు లోలోన–టెంపరేచరు వేడి చాలదన్నట్టు. అంతా స్వార్థం, అంతా భేషజం, అని వుక్రోషం వెళ్ళబుచ్చాడు. మనస్సులో యేదో ఆందోళన. ఇంకా జ్వరం యెక్కువైతే యేమిటి దిక్కు? తనెక్కడికన్నా పారిపోతే బాగుండునని పించింది; ఆ విరక్తి భావంలో–

యెనిమిది తొమ్మిది గంటలప్పుడు గాబోలు సుబ్బారావు వచ్చాడు. తనేదో భావనా ప్రపంచంలో వున్నాడప్పుడు. సుబ్బారావు సంతోషవార్త తేలేదు. డబ్బుకోసం తనెంత అవస్థపడ్డాడో చెప్పాడు బాధతో–గోపాల్రావు యిస్తానంటూ రెండుసార్లు తిప్పి మూడవసారి యింట్లోంచి మాయమయ్యేట్ట. శర్మ, పుదయం వెళ్తే సాయంత్రం రమ్మని, సాయంత్రం కొట్టుదగ్గర కెళ్ళేసరికి తనని చూచి యేదో పని వున్నట్టు యెవరితోనో మాట్లాడుతూ చరచర బయటికెళ్లి పోయాడట–తనకోసం ప్రత్యేకంగా శెలవుబెట్టి తిరిగాడు సుబ్బారావు! అతడి శ్రమంతా వృథా పాపం! యేనాటికయినా గోపాల్రావు, శర్మలకు పాఠం చెప్పలేకపోతాడా! సుబ్బారావు చాల విచారంగా వెళ్లిపోయాడు తన నిస్సహాయతకి–

తనకా రాత్రి తిండిసున్న– జ్వరంవేడి, మాడే కడుపుతో నిద్ర సరిగా పట్టలేదు. మరుసటి రోజుకల్లా విచిత్రంగా జ్వరం

శ్రీ పి. శ్రీనివాసరావు

తగ్గిపోయింది. బహుశ లంఖణాలవల్ల అనుకున్నాడు. సుబ్బారావు వచ్చి పరామర్శించి పోయాడు. యిడ్లీతిని కాఫీతాగాడు తను. పదకొండు గంటలకి పోస్టుజవాను వచ్చాడు.

"ఉత్తరాలున్నాయా?" అడిగాడు

"కాదండీ–మనిఆర్డరు!"

"మనియార్డరా? మనిఆర్డరే? నిజంగానే?"

"అవునండి–"

తీసుకొన్నాడు. నిజంగానే! పదిహేను రూపాయలొచ్చాయి. రెన్నెల్లక్రితం ప్రచురించబడ్డ కథకి ప్రతిఫలం–తనకా కథే జ్ఞాపకంలేదు. ఈ వొచ్చే డబ్బు రెండురోజులముందు రాగూడదూ, అనుకొన్నాడు.

కాస్సేపాలోచించాడు. ఆలస్యంగా వచ్చినా ఫరవాలేదనిపించింది తనకేదో ఘనవిజయం లభించినట్టుంది. యేదో వొకటి చెయ్యాలి. చెయ్యాలి తప్పకుండా–ఉత్సాహం ముందుకు నెడుతుంటే, బలహీనత వెనక్కు లాగుతోంది. గబగబ భోంచేసి రిక్షాయెక్కి తిన్నగా సుబ్బారావు యింటికెళ్లాడు యెంతో వుల్లాసంగా–

తనని చూసి ఆశ్చర్యంగా "యిలా వచ్చావేం?" అన్నాడు సుబ్బారావు.

"యేమీలేదు. మనకి యీరోజున డబ్బులొచ్చాయోయ్! నడు–అలా వెళ్దాం!"

"డబ్బులొస్తే?... నాకేం అర్థంగావడంలేదు." సుబ్బారావన్నాడు.

"అదేమిటోయ్! మనకి డబ్బెందుకు రావడం? ఖర్చుచేయడానికా? యింట్లో పెట్టి పూజచేసేందుకా? నడునడు!"

సుబ్బారావుని జబ్బపుచ్చుకుని లాక్కొచ్చాడు. బలవంతాన సుబ్బారావుని రిక్షా యెక్కించాడు. "నడవడమేమిటి యీరోజున–నాన్సెన్స్!" అంటూ–

దోవలో కృష్ణారావు కనిపించాడు. దీనంగా, గాభరాగా వెడుతున్నాడెక్కడికో–రిక్షా ఆపి పలకరించాడు. కృష్ణారావు కూతురికి తీవ్రంగా జ్వరం వచ్చిందట–డాక్టరుకోసం వెడుతున్నాట్ట–

"అయితే డబ్బు కావాలా? తీసుకో!" అంటూ కృష్ణారావుకి రెండు రూపాయలు అందించాడు. కృష్ణారావు తెల్లముఖంతో "యిదేమిటి?" అన్నాడు.


"అయితే యింకో రూపాయి యిదిగో!" రూపాయి యిచ్చాడు–రాజ్యం దానమిచ్చే ధీమాలో. కృష్ణారావు దిగ్భ్రమచెందినట్టు చూస్తుంటే, "నువ్వేం గాభరాపడకు, తిరిగి యివ్వనక్కరలేదులే!" అంటూ వెటకారంగా నవ్వాడు తను.

రిక్షాలు గోపాల్రావు యింటిముందు ఆగాయి. గోపాల్రావు బయటికొచ్చి, పలకరించాడు.

(19–వ పేజీ చూడండి)

వివిధ ఫలజాతులతో, వక్కొవ్వ నిచ్చిన పండ్ల మధురవాసనలతో పండ్లమార్కెట్టు చూడ ముచ్చటగా వుంది. ఆ మార్కెట్టులోకల్లా రామయ్య దుకాణం చాలా పెద్దది. ఋతునియమం లేకుండా కావలసిన ప్రతీ పండూ ఎప్పుడూ అక్కడ దొరుకుతుంది. సాధారణంగా ధనవంతులు, ఎత్తుబొబ్రలశేరులు, ఆ దుకాణంలో ఖరీదు చేస్తుంటారు. సాధారణ జనం ఓసారి ఆ కొట్టువద్దకు వచ్చి, ధరలు తెలుసుకొని, గుడ్లు మిటకరించి, పెదాలు విరచి, తమ అశక్తిని వెల్లడించి వెళ్ళిపోతుంటారు. పళ్ల దుకాణదారులు పోటీలమీద పోటీలతో కేకలు వేస్తున్నారు జనాన్ని ఆకర్షించ డానికి. "ఒకటో రకం జహాంగీరు మామిడి పళ్ళు — తాజాతాజా సరుకు — ఒక్కసారి తినిచూస్తే దాని రుచి మీకే తెలుస్తుంది. డజను మూడు రూపాయిలు మాత్రమే!"

నాగన్న కళ్ళొక్కసారి ఎత్తైన ఆ జహాంగీరు మామిడిపళ్ళరాసిమీద పడ్డాయి. పసిడి కలశాల్లా, కమనీయ సౌరభాలను వెదజల్లే, ఆ పండ్లరాశిని తలచుకోగానే ఒక్కక్షణం తెలియకుండానే, నిజంగా తానా పళ్లను తిని రసమును గ్రోలిన ట్లొక మధుర స్మృతిలో పడిపోయాడు నాగన్న. ఇంతలో రామయ్య పాలికేక లతని తన్మయత్వానికి భంగం కలిగించాయి. కళ్ళు తెరచి చూశాడు. ఎదురుగుండా జహాంగీరు మామిడిపళ్లు — నోరూరింది. లేమి వికటాట్టహాసం చేసింది. "తానెంత, తనతాహతెంత" అనుకొన్నాడు నిరాశతో క్రుంగిపోతూ. నాగన్న వయస్సు 12 సంవత్సరాలు. జ్ఞానం వచ్చినప్పటినుంచీ ఆ పళ్ళమార్కెట్టులోనే ముష్టి అడుక్కొంటున్నాడు. నవ్వు ముఖంతో, హాస్యపు కబుర్లాడుతూ, వచ్చేపోయేవారిని ఇట్టే నవ్వించి, మనసు కరిగించి అట్టే డబ్బు వసూలుతుంటాడు. అమాయకంగా, చేతులు చాపి, తన మామూలుస్థలంలో కూర్చొని, భిక్షం అడుక్కొనే నాగన్నని ప్రతిరోజూ వచ్చే పోయే వందలాది జనం చూస్తూనే వుంటారు. పేదసాదల వ్యత్యాసాలతో, స్వార్థం జీర్ణించిపోయిన ధనమదాంధులు నాగన్నను చూసీ చూడనట్లు వెళ్లిపోతుంటారు. అలాంటి వాళ్లను చూడగానే, నాగన్న వాళ్ళవెంటబడి, అమాయికపు దీవనలతో, హాస్యపు మాటలతో, "అయ్యా.. ఒక్క కానీ ఇయ్యండయ్యా... మీ యిల్లంతా బంగారుమయం అవుతుంది. అమ్మా... ఒక్క కానీ ఇయ్యండమ్మా... నీ కొడుకు భారతదేశానికి చక్రవర్తవుతాడు." అంటూ కాళ్లావేళ్లా పడి బ్రతిమాలుతాడు. కొంతమంది మాట్లాడకుండా ఒక కానీ పడేస్తారు. మరికొందరు వాడిని వదిలించుకోడానికి తప్పనిసరిగా తోచింది ఇస్తారు. సాధారణంగా, పిల్లల్ని కన్న ముసలిదంపతుల వెంటబడి ఇట్టేమనసు కరిగించి, ఆఖరికి వాళ్లు ఏదో ఒకటి ఇచ్చేదాకా వదలడు. తరువాత కొత్తగా పెండ్లి అయిన జంటలుకూడా, వాడు వర్ణించే వర్ణనలకు చిరునవ్వు నవ్వుకొంటూ, లెక్కలేనట్లుగా ఒక కానీ విసిరి పోతుంటారు. కాని, పైలా పచ్చీసుగా, తల్లిదండ్రులు — అష్టకష్టాలుపడి పంపిన డబ్బువిలువ గుర్తు లేకుండా, టిప్‌టాప్‌గా తయారై ఆడగాలికోసం బయలుదేరేన విద్యార్థులుమాత్రం వాడిని చూడగానే అసహ్యంతో నాలుగు తిటి, పక్కకి నెట్టివేస్తారు. అటువంటివాళ్లు వస్తున్నారనగానే కిక్కురుమనకుండా, వాళ్లు పోయేదాకా, పక్కకుతప్పుకొంటాడు. ఈ రకం మనుష్యుల్ని తలచుకోగానే నాగన్నకు అప్రయత్నంగా కన్నీళ్ళు వచ్చాయి. ప్రయత్నంమీద దుఃఖాన్ని ఆపుచేసుకొన్నాడు. కాలే కడుపులతో, శుష్కించిపోయిన దేహాలతో జీర్ణవస్త్రాల మధ్య అల్లాడే ఈ పేదశరీరాలను చూస్తే, ఇంత అవహేళన, అసహ్యం, నిర్లక్ష్యం ఎందుకో. మళ్లీ కొంతసేపటికి నాగన్నకు ఎప్పటిధైర్యం ఉత్సాహం వస్తుంది. వాడి దృష్టిలో, తన జీవితమంతా కష్టపడి, ఇలా ముష్టెత్తిన డబ్బులతో కొనలేనటువంటి ఆ జహాంగీరు మామిడి పళ్లను, డబ్బంటే లక్ష్యంలేక గడ్డిపోచగా భావించి, కొను



రెండు మామిడిపళ్ళు



క్కుపోడానికి వచ్చిన వ్యక్తులను ఏమనాలో తోచక, అల్లాగే వాళ్లను చూస్తూ నిలుచుండిపోతాడు నాగన్న. చేసేది యాచకవృత్తైనా, కల్లాకపటం, కుత్సితం, మోసం లేని జీవిగా, అచ్చటి దుకాణదారుల హృదయాల్లో మెలుగుతున్నాడు. ఏదైనా చిన్న పనిమీద అవతలకు వెళ్ళవలసివచ్చినప్పుడు, దుకాణదారులు, నాగన్నను తిరిగొచ్చేదాకా, దుకాణం చూస్తుండమంటుండే వారు అప్పుడప్పుడు. అటువంటి సమయాల్లో ఠీవిగా దుకాణం గద్దెమీద కూర్చొని వాళ్లు లేని లోటు తీర్చేవాడు. అన్నిటికన్నా తీవ్రమైన కోరిక ఒకటి వుండేది నాగన్నకు. రెండు జేబులనిండా డబ్బుతో, రోజూ దుకాణంలో పళ్లుకొనడానికివచ్చే వాళ్లమాదిరిగా వుండాలని.

అలా అవగలిగితేనా, ఈ ప్రపంచంలో తనకు కావలసిన మంచివస్తువులను కొనేసేవాడు. ఒక రూపాయి నోటు జేబులోంచి తీసి అలా రామయ్య మొహాన పడేసి, తనకు కావలసినన్ని జహంగీరు మామిడిపళ్లు కొనుక్కునేవాడు. ఇది తలచుకొన్న మరుక్షణంలోనే నాగన్న మొహం అదోలా అయి, దీర్ఘ నిశ్వాసం విడిచేవాడు. ఎందుచేతంటే, ఒక్కొక్క పండు నాలుగణాలు. రెండురోజులు కష్టపడి ముష్టెత్తినా కూడా ఒక్క పండు ఖరీదు రావడం దుర్లభం. ఆఖరికి ఒక్క పండుకొనడం గూడా తన తాహతు, శక్తిని, మించిన పని అని నాగన్న బాగా ఎరుగును.

విషాదాశ్చర్యాలు కలిగించే ఈవిధమైన ఎన్నో ఇతర భావాలతో నాగన్న తన యాచకవృత్తి పూర్తిచేశాడు. సాయంత్రం ఇంటికి వెళ్లగానే, వచ్చినడబ్బు తండ్రి చేతిలో వుంచాడు. తండ్రికూడా తన మూడేండ్లకూతురు మంగిని కూడా తీసుకొని ఆ పట్టణంలోని ఇతరస్థలాల్లో అడుక్కొని తిరిగివచ్చాడు. ఇద్దరి యాచకవృత్తి ఫలితంగా వాళ్ళముగ్గురి పొట్టలూ ఓవిధంగా గడిచిపోతున్నాయి. మళ్లీ మర్నాడు ఉదయంనుంచీ, కొత్తజీవితం ప్రారంభించడానికై, చిరిగిపోయిన గుడ్డపేలికలు పరుచుకొని అలసిపోయిన దేహాలను కాస్సేపు దానిమీద జేరేశారు విశ్రాంతికి. రాత్రి గంజి తాగేటప్పుడు నాగన్న అప్రయత్నంగా "అయ్యా! జహంగీరు

శ్రీ ఆరిఫ్ నిసార్

మామిడిపళ్ళు రుచి ఎల్లాగుంటుంది" అని ప్రశ్నించాడు. మాగిపోయి, సగం సగం కుళ్లిపోయిన చవకరకపు పళ్లు ఏవోకొన్ని మాత్రం అప్పుడప్పుడు కొనుక్కొని రుచి చూశాడు తండ్రి. ఆ అనుభవం తలచుకొని "అవి చాలా రుచిగా...తియ్యగా రంగా...వుంటాయి." అన్నాడు నిద్రమత్తులో గొణిగినట్టుగా "ఒకసారి పెద్ద విందు జరిగిందొకచోట. సగంసగం తిన్నవీ, ఇంకా అక్కడక్కడ గుంజు మిగిలిపోయినవీ, పెరటితొట్లలో వాళ్ళదాసీలు పడవేస్తే, నేనొకసారిమాత్రం వాటిని తీసుకొని రుచిచూశాను" అన్నాడు తండ్రి.

మంగి గంజి త్రాగడం మానివేసింది. ఆమె జీవితంలో ఇలాంటి పళ్ళగురించి వినడం ఇదే తొలిసారి. "రేపు మాపిటికి వచ్చేటప్పుడు నాకు రెండుపళ్ళు తెచ్చి ఇవ్వరా అన్నా"! అంది అమాయికంగా మంగి. "తప్పకుండా" అన్నాడు నాగన్న అతికష్టం మీద వాటిఖరీదు జ్ఞాపకం తెచ్చుకొని.

కాని ముద్దుచెల్లెలి కోరిక నిరాకరించలేకపోయాడు. చిరుతహృదయంలో ఉబుకొని వచ్చుభావాలను అణచిపెట్టుకొంటూ, గంభీరంగా మార్కెట్టులో తన మామూలు స్థలానికివెళ్లాడు, మర్నాడుఉదయాన్నే నాగన్న. మార్కెట్టు పెద్దగేటు సమీపించేసరికి అప్పుడే దుకాణదారులు పళ్ళన్నిటినీ వరుసలో సర్దుతున్నారు. త్వరలోనే, జేబుల గలగలలతో నిండిన మనుష్యులతో, గొంతుకలు చించుకొని అరచే దుకాణదారులతో మార్కెట్టు రద్దీగా వుంటుందనుకొన్నాడు. నాగన్న తన మామూలు స్థలంలోకి వచ్చి, ఒకసారి పరిసరాలను తిలకించాడు. అప్పట్లో జనం అంతగా లేరు. ఇంకా వస్తున్నారు. వాళ్లను చూడగానే తన మామూలు కార్యక్రమం ప్రారంభించాడు. ఆరోజున, మంగికోసం ఆఖరికి రెండు పళ్లు కొని పట్టుకెళ్ళడానికి చాలినంత డబ్బు సంపాదించాలి. పాపం! ఆమె ఎప్పుడూ, ఇంతవరకూ ఇటువంటి కోరికలు కోరలేదు. ఆమె ఈ తొలిసారి కోర్కెను తప్పకుండా తీర్చాలనుకొన్నాడు. ఆరోజంతా చాలా కష్టపడ్డాడు. వచ్చేపోయేవారికి దయ పుట్టేలా



కాళ్ళమీద పడ్డాడు. ఫలితం వృధా అయింది. అదేం దుర్దినమో గాని, సాయంత్రానికి ఒక్క అణా డబ్బులు వచ్చాయి. నిశ్శబ్దంగా తన మామూలు స్థలాని కొచ్చి కూర్చున్నాడు. రామయ్య పరిచితమైన కంఠం, ఇతర దుకాణదారులు పోటీలతో వేసే కేకలూ, నాగన్నలో అశాంతిని రేకెత్తించాయి. పరిస్థితులు తారుమారుగా, భరించలేనివిగా అగుపడ్డాయి. ఆకలిగొన్న జంతువులా ఆ మామిడిపళ్లకేసి తీక్షణంగా చూశాడు.

మార్కెట్టులో జనం పల్చపల్చగా వున్నారు. అప్పుడప్పుడు నిశ్శబ్దానికి భంగం కలిగేటట్లుగా, నాగన్న ముష్టికోసం గట్టిగా అరచేవాడు. కాని జనం అస్పష్టంగా ఏదో మాటలంటూ వెళ్లిపోయేవారు. అతన్ని ఎరుగున్నవాళ్ళు ఆశ్చర్యపోయారు. ఆరోజున నాగన్న వింతప్రవర్తన చూసి ఇదివరకటి నాగన్నేనా అనుకొన్నారువాళ్లు. సూర్యాస్తమయం అయింది. సంధ్యవెలుగులు క్షీణించిపోగానే, చీకటి బల్లేలు పొడుచుకొంటూ వచ్చాయి. ఇంక డబ్బు దొరుకుతుందనే ఆశలు కూడా క్షీణించసాగాయి. నాగన్న సహనశక్తిని గోల్పోయి అదోలాగయ్యాడు. కాని వెంటనే ధైర్యం చేసి, రామయ్యవద్దకు వెళ్లాడు.

"రామయ్య బాబూ! రెండు మామిడిపళ్ళిద్దూ!" అన్నాడు ఆ జహంగీరు మామిడిపళ్ళకేసి చూపిస్తూ. రామయ్య ఒకసారి విస్తుపోయి, ఎగాదిగా చూసి "అయితే నీకు మామిడిపళ్లు కావాలిరా? నీ అబ్బకాలంలో గాని, నీ బాబుకాలంలో గాని ఎప్పుడైనా ఎరుగుదుర్రా! ఛీ...ఛీ...అవతలకి నడు ముష్టివెధవా!" అంటూ గట్టిగా చప్పట్లు చరిచి, విరగబడినవ్వడం మొదలెట్టాడు రామయ్య. నాగన్న పెదవి కొరికాడు. అవమానం భరింపలేనిదిగా, దావానలంలా హృదయాన్ని దహించివేస్తోంది. భయంతో వణికిపోయాడు. కన్నీళ్లు చెక్కులమీదుగా జలజలా ప్రవహించసాగాయి. మలినమైన చింకిపేలికలైన చొక్కా చేతులతో కన్నీళ్ళు తుడుచుకొని, దీనంగా, కొంచెందూరంగా నిలుచున్నాడు; ఈ అయోమయ ప్రపంచంలో తన నికృష్ట జీవనంగురించి ఊహామాత్రంగా ఆలోచించడానికి ప్రయత్నిస్తూ. మామిడిపళ్ళకోసం, ఆతురతతో నిరీక్షిస్తున్న మంగి ఆకారం వాని దృక్పథంలో గోచరించింది. వట్టిచేతులతో ఇంటికి పోగూడదనుకున్నాడు. లేకపోతే ఆమె కెంతో ఆశాభంగమవుతుంది. మళ్లీ ఒక్కసారి డబ్బులన్నీ లెక్కబెట్టాడు. ఆఖరికి ఒక్క పండు కొనడానికిగూడా చాలదు. అయినా సరే మంగికి తప్పకుండా మామిడిపళ్లు తీసుకెళ్లాలి. వాడి వళ్ళంతా ఒక్కసారి విసుకుపోయింది. మసకమసకగా వున్న వాని చిరుత హృదయంలో, కడలిపొంగుల్లా ఎన్నో ఊహలు బయలుదేరి మరుక్షణంలోనే నిరాశతో విరిగి ముక్కలయి పోతున్నాయి. ఉన్నట్టుండి హఠాత్తుగా జంగిడలోని రెండు మామిడిపళ్ళు అందుకొని వెంటనే పరుగెత్తాడు.

"దొంగ..దొంగ! పట్టుకోండి" అంటూ

రామయ్య గద్దెనుండి క్రిందికురికి నాగన్నను తరుముతూ వెంటబడ్డాడు. నాగన్న మార్కెట్టుగేటుదాటి విశాలమైన రోడ్డు మీదకు వచ్చాడు. కుడిచేతివైపునుండి ఒక కారు చాలా వేగంగా వాడి వైపుకు వస్తోంది. కారు వచ్చేలోగా తను రోడ్డు అవతలివైపుకు వెళ్ళగలిగితే, రామయ్యకు ఆ కారు అడ్డువస్తుంది. ఈ లోగా తను వెళ్ళిపోవచ్చనుకున్నాడు. కారు ప్రమాదం జరిగేటంత దగ్గరగా వచ్చేసింది. కాని ఇంక వానికి వేరే మార్గంలేదు. రామయ్య కూడా అప్పటికి చాలా దగ్గరగా వచ్చేశాడు. ధైర్యంచేసి ముందుకు పరిగెత్తాడు. ఇంతలో పెద్ద దప్పుడు చేస్తూ, సడన్‌బ్రేకుతో కారు ఆగిపోయింది. చుట్టూ జనం మూగారు. "ఎవరో పిల్లాడు కారుకిందపడిపోయాడు" అన్నమాట వెలువడింది. డ్రైవరు కారు చక్రాల కిందనుంచి నాగన్నశరీరాన్ని ఇవతలకి తీశాడు. పాపం! నాగన్న చనిపోయాడు. ఆ రెండు మామిడిపళ్లు నాగన్న గుప్పిటనుండి జారి, చితికిపోయి, ఆ అదృష్టహీనుని శరీరంనుంచి చిందినరక్తపు కాలువల్లో, మాంసపుముద్దల్లా ఎర్రగా రోడ్డుప్రక్కనున్న మునిసిపాలిటీ విద్యుద్దీప కాంతుల్లో వికృతంగా మెరియసాగాయి.

"రామ! రామ!" అన్నాడు తరుముకొచ్చిన రామయ్య "వాడు చాలా మంచివాడు. వాడు ఎందుచేత ఆ రెండు మామిడిపళ్లు దొంగిలించాడో నా కాశ్చర్యంగా వుంది. నన్నడిగివుంటే, వాడికి కావలసినన్ని ఇచ్చివుండేవాడిని. వాడంటే మా కెంత అమితమైన ఇష్టం!" అంటూ రామయ్య అచ్చటనుండి వెళ్లిపోయాడు. ★

నగదు

(15-వ పేజీ తరువాయి)

"జ్వరం తగ్గిందా? నయమేనా?" అంటూ.

"ఆఁ! డా. నీకోసమే వచ్చాం-కాఫీ తాగివద్దాం రా!"

"యిప్పుడే తాగాను" నసిగాడు గోపాలరావు.

"ఫర్వాలేదు. రా!"

తను స్వీట్సు, హాట్సు గబగబ ఆర్డరిచ్చాడు గోపాలరావు ఆశ్చర్యపడి చూస్తుంటే-

"తినవయ్యా! డబ్బులెందుకూ? ఖర్చు చెయ్యడానిక్కాదూ?" తనలా మాట్లాడుతుంటే మరీ రిత్తపోయాడు గోపాలరావు.

బిల్లు పుచ్చుకొని, సర్వర్‌కి పావలా యిచ్చాడు "తీసుకోవోయ్! అలవాటు లేదా? అయితే యేంలే? తీసుకో! నా డబ్బులు గుల్ల పెట్టవులే!"

వ్యంగ్యంగా నవ్వు.

గోపాలరావుని వదిలి సరాసరి శర్మషాపుకెళ్లాడు.

"వంట్లో నయమేనా?" శర్మకుశలప్రశ్న.

"ఆఁ! మీ కటాక్షంవల్ల!" ఆమాట విని శర్మ వులిక్కిపడ్డాడు.

కాసేపు అటు యిటు షాపులో పచారు చేసి, చాల వస్తువులు తీసుకొన్నాడు.

"వీటి అన్నిటిదీ మొత్తం యెంతయిందో చెప్పు శర్మా!"

"ఇన్నా? ఇవన్నీ యేం చేసుకొంటావ్?"

"భయంలేదు-అంతా యీరోజు నగదు. అదిగో నీబోర్డు వుందిగా 'యీరోజు నగదు, రేపు అప్పు' అంటూ!"

శర్మ మాట్లాడలేదు కొన్ని క్షణాలు.

"ఆరురూపాయల, మూడణాలు" అన్నాడు లెక్కవేసి-

డబ్బిచ్చి వేశాడు. సామాన్ల పొట్లాలు సుబ్బారావు కందించాడు పద పోదాం అంటూ-

"ఏమోయ్ సుబ్బారావ్! యీరోజు నగదు రేపు అప్పు. అంతేగా జీవితం" అంటూ నవ్వాడు వికటంగా. సుబ్బారావు అవునన్నట్టు తల పంకించాడు. ★

సీరియల్ నవల

రెండు మహా నగరాలు

చార్లెస్ డికెన్స్

11

'మిస్ మానెట్! అలా ఖైదీవంక చూడండి!' అన్నాడు, అటార్నీ జనరల్.

యౌవన సౌందర్యాలు మిసమిసలాడుతూన్న ఆ జాలికళ్ళ మనోహర స్త్రీ మూర్తి, తనకు ప్రతికక్షిగా నిలబడటంతో, బోనులోవున్న ముద్దాయికి యేదో చెప్పరాని ఉత్కంఠ కలిగింది. ఆ గిజాటులో బోను కటకటాలమీద అతని అరచేతులు ఆందోళనగా కదులుతున్నయ్. అక్కడ కూర్చున్న జనం తన ఆవేశాన్ని గమనించుతున్నారనే స్పృహ కూడా అతనికి లేదు. ఉబికి వస్తున్న ఆవేశాన్ని అణచుకోలేకపోతున్నాడు. పెదవులు చలించిపోతున్నయ్, హృదయం స్పందించిపోతోంది. కోర్టు హాల్లో కందిరీగలమోత మరింత జోరైంది.

'మిస్ మానెట్!—ఖైదీని లోగడ యెప్పుడేనా చూచినట్టున్నారా?'—

'చూచాను సర్!'—

'ఎక్కడ?'

'ఇందాక లారీగారు చెప్పిన పడవలోనే నండి—అప్పుడే నేనూ చూచాను'—

'లారీగారు పడవలో తనతోపాటు ప్రయాణం చేశారన్న స్త్రీ మీరేనా?'—

'దురదృష్ట వశాత్తూ నేనే.'

ఆ మాటలలోవున్న జాలి జడ్జీగారి కఠోర కంఠధ్వనిలో మునిగిపోయింది: 'దురదృష్టం, గిరదృష్టం ఇలాంటి వ్యాఖ్యానాలు అనవసరం. అడిగినదానికి సమాధానం చెప్పు'—అని గాండ్రించాడు.

'మిస్ మానెట్, ఆ ప్రయాణసందర్భంలో ఖైదీ మీతో మాట్లాడిన మాటలేమైనా జ్ఞప్తికి తెచ్చుకోగలరా?'—

'ఆఁ జ్ఞాపకమున్నయ్'—

'సరే, చెప్పండి.'

'వారు పడవలోకి వచ్చినప్పుడు...'

'వారా?—అంటే యెవరు ఖైదీసంగతేనా?'

అన్నాడు జడ్జీ'

'అవును'—

'అయితే—ఖైదీ అనే చెప్పు—వారూ గీరూ అనకు'—

'ఖైదీ పడవలోకి వచ్చి, మానాన్నగారు చాలా అనారోగ్యస్థితిలో అలసిపోయి వుండటం గమనించారు. మానాన్న చాలా క్షీణించిపోయి వుండటంచేత, ఆయన్ని గాలిలో, పడవపై భాగానే పక్కవేసి పడుకోబెట్టాను. ఆయన ప్రక్కనే కూర్చుని సేవచేస్తున్నాను. ఆవేళ పడవలో మేము నలుగురంతప్ప ఇతర ప్రయాణీకులెవరూ లేరు. ఆయన మా నాన్నగారి స్థితి చూసి చాలా జాలిపడ్డారు. పడవ రేవులోనుంచి బయలుదేరగానే, ఎక్కువ గాలి, చలీ వేస్తుందని అన్నారు. ఎక్కువ చలిగాలి తగలకుండా తగినయేర్పాటు చెయ్యాలన్నారు'—

'ఆయన పడవలోకి ఒక్కడే వచ్చాడా?'

'ఒక్కరే రాలేదు'

'ఆయనతో ఎంత మందున్నారు?'

'ఇద్దరు ఫ్రెంచి పెద్దమనుషులున్నారు'

'వాళ్ళుముగ్గురూ ఏదైనా మాట్లాడుకున్నారా?'

'పడవ బయలుదేరబోయే ఆఖరిక్షణాలదాకా యేదో మాట్లాడుకుంటూనే వున్నారు. పడవ బయలుదేరే సమయానికి ఆ యిద్దరూ దిగి వెళ్ళిపోయారు'—

'ఒకళ్ళకొకళ్ళు ఏవైనా కాయితాలు—ఈ జాబితాల లాంటివి—ఇచ్చిపుచ్చుకోవటం చూచారా?'

'ఏవో కాయితాలు ఇచ్చిపుచ్చుకోవటం చూచాను'—

'ఈమోస్తరు కాయితాలేనా'—

'అయితే కావచ్చు—కాని అలాంటివేనని చెప్పలేను—వాళ్ళు నాకు చాలా దూరంలో నిల్చుని చాలా నిమ్మదిగా మాట్లాడుకున్నారు. అక్కడున్న దీపంకూడా, కావుకేసి మినుకు మినుకు మంటోంది. ఏవో కాయితాలు కనుపించాయేగాని అవి ఏరకంగా వున్నాయో చెప్పలేను—వారు మాట్లాడుకున్నది కూడా నాకేమీ వినిపించలేదు.'

'సరే—ఖైదీ మీతో మాట్లాడిన సంగతేవిఁటో చెప్పండి.'

'ఆయన నేను వున్న స్థితిగతులుచూసి చాలా జాలిపడ్డారు—ఆప్యాయత చూపించారు—ఆయన చాలా వయుగల వారు—బెరుకులేకుండ మనసిచ్చి మాట్లాడి ఆదరించారు. మా నాన్నగారికి ఎంతో సాయపడ్డారు'—ఆవిడ కళ్ళవెంట జొటజొటా కన్నీరొలికిపోయింది. ఏడుపు ముంచుకొస్తున్న రుద్ధ కంఠంతో: 'ఆయనకు ఈవేళ అపకారంచేసి, కృతఘ్నత చూపుతానలేవుంది.'

కందిరీగల మోత—

'మిస్ మానెట్—ఈ సాక్ష్యం నువ్వు చెప్పి తీరవలసి వుంది—నీవిధి; ఆ విషయం ఖైదీ అర్థం చేసుకోలేకపోతే తప్పిదం అతనిదికాని నీది కాదు—మీ కిష్టమున్నా లేకపోయినా ఈ సాక్ష్యం చెప్పి తీరాలి—సరే తరవాతేం జరిగిందో చెప్పండి.'—

'తాను నిష్ఠురమైన ఒక రహస్య వ్యవహారాన్ని సాధించటానికి యిలా తిరుగుతున్నానని నాతో అన్నారు. ఆ రహస్యం బయటబడితే చాలా చిక్కులు వస్తాయనీ, అందుచేత మారు పేరుతో

అనువాదం: తెన్నేటి సూరి

వున్నాననీ అన్నారు. ఈ వ్యవహారంమీదే తాను ఫ్రాన్సుకు వెళ్లాననీ ఇలా చాలాసార్లు యింగ్లండు ఫ్రాన్సులమధ్య తిరగవలసి రావచ్చుననీ చెప్పారు.'

'మిస్ మానెట్! ముద్దాయి మీతో అమెరికాసంగ తేమన్నా చెప్పాడా. ఆ సంగతి వివరంగా చెప్పండి.'

'తగాదా ఎందుకు వచ్చిందో నాకు అర్థం అయ్యేలాగు చెప్ప టానికి ప్రయత్నించారు. అమెరికా తగాదా వ్యవహారంలో తప్పంతా ఇంగ్లండుదే నన్నారు. మూడవజార్జిరాజుకంటే, జార్జి వాషింగ్టన్ కీర్తివంతుడై చరిత్రకెక్క వచ్చునని ఛలోక్తిగా అన్నారు. అది ఏదో నవ్వుతూ ఛలోక్తికి అన్న మాటగాని అందులో పెద్దవిశేష మేమీలేదు.'

ఒక పెద్దనటుడు రంగంమీద అభినయించుతున్నప్పుడు ఆయన ముఖంలో పొడసూపుతున్న కవళికల నన్నిటినీ వాళ్ళకు తెలియకుండానే ప్రేక్షకులు అనుకరించుతూ వుంటారు.

ఈ సాక్ష్యం చెప్పుతున్నంతసేపూ, ఆవిడ ముఖంమీద భయాందోళనలు స్పష్టంగా కనుపించుతున్నయ్. జడ్జీ వ్రాసుకుంటున్నప్పుడు తను మాట్లాడటం మానేసి ఉభయపక్షాల న్యాయవాదుల ముఖాలవంకా చూస్తోంది. తన సాక్ష్యాన్ని వాళ్లు యెలా స్వీకరించుతున్నారో అర్థంచేసుకోవటానికి ప్రయత్నించుతోంది. సాక్షి ముఖకవళికలన్నీ కోర్టులోవున్న యావన్మంది ప్రేక్షకుల నుదురులమీద ప్రసరించుతూ, అవన్నీ సాక్షికట్టెదుట వుంచిన బిల్లోరి అద్దాల్లా కనుపిస్తున్నయ్. వ్రాసుకుంటూ వ్రాసుకుంటూవున్న జడ్జి, జార్జి వాషింగ్టనుకు సంబంధించి ఆ అప్రాచ్యపు వాక్యాలు చెవులబడి కుదుపు తిని చివాల్న తల పైకెత్తి చూచాడు.

డాక్టర్ మానెట్‌ను కూడా విచారించవలసిన అవసరంవుందని అటార్నీ జనరల్ విజ్ఞప్తి చేయటంతో ఆయన్నుకూడా బోనెక్కించారు.

'డాక్టర్ మానెట్! ఖైదీని మీరెప్పుడేనా లోగడ చూశారా'

'ఓసారి చూచాను. మూడేళ్ళో, మూడేళ్లన్నరో అవుతుంది—ఒకసారి మాయింటికొచ్చాడు. !

'మీ కుమార్తె, మీరూ, ఫ్రాన్సునుంచి యింగ్లండుకు వచ్చేటప్పుడు—ఇతనుకూడా మీతో ప్రయాణంచేసినట్టు గుర్తున్నదా ?'

'లేదు'—

'గుర్తులేంపోవడానికి ప్రత్యేక కారణం యేదేనా వున్నదా?'

'ఉన్నది'—

'మీ దేశంలో వుండగా, మీ మీద యే నేరమూ మోపకుండానే, విచారణ వగైరా లేమీ లేకుండా, మిమ్మల్ని చీకటికొట్లో ఖైదులో వుంచారట, నిజమేనా ?'

'ఆ!—వుంచారు—చాలా సంవత్సరాలు'

'మనం మాట్లాడుకుంటున్న పడవప్రయాణం తరుణానికి మీరు క్రొత్తగా విడుదలైవుంటారు.'

'అని చెబుతారు'

'అసలు ఆ సంఘటన మీకు జ్ఞాపకమే లేదా ?

'లేదు—నేను జైల్లో చెప్పులు కుట్టడం ప్రారంభించిన దగ్గరనుంచీ, తిరిగి యింగ్లండులో నా కుమార్తెతో జీవించటం ప్రారంభించేవరకూ, ఈ మధ్యకాలంలో ఈ లోకంలో యేమి జరిగిందో నాకు తెలీదు. ఇక్కడికి తీసుకొచ్చిన తరవాత అమ్మాయి నన్ను నెమ్మదిగా మార్గానపెట్టి లోకుల్లో పడేసింది. అమ్మాయి నా దగ్గిరికి యెప్పుడు వచ్చిందో, యెలా వచ్చిందో, యెలా త్రోవకు తీసుకురాగలిగిందో ఇదంతా నాకేమీ తెలీదు.'

ఆ ప్రశ్నలడిగి అటార్నీ జనరల్ కూర్చోబడటంతో తండ్రీ కూతురూకూడా కూర్చున్నారు.

అనంతరం విచారణలో ఒక ప్రధానమైన అంశం బయలుదేరింది. అయిదు సంవత్సరాలనాడు, నవంబరునెల శుక్రవారం రాత్రి ముద్దాయి మరో కుట్రదారుతోపాటు డోవరుమెయిలు కోచ్‌లో ప్రయాణం చేసినట్టూ, రాత్రివేళ మార్గమధ్యంలో దిగి, అక్కడనుంచి పదిమైళ్ళ దూరంలోవున్న సైన్యాలను ఉంచిన ఓడరేవుకు చేరినట్టూ, ఆ సైనికకేంద్రంలో తనకు కావలసిన భోగట్టానంతా పోగుజేసుకున్నట్టు, సైనిక కేంద్రంలోవున్న కాఫీ హోటల్లో కూర్చుని రెండో కుట్రదారుకోసం చాలాసేపు నిరీక్షించినట్టూ ఋజూ కావలసివచ్చింది. ముద్దాయిని ఆనాడు ఆ హోటల్లో చూచినట్టు ఒకసాక్షి చెబుతున్నాడు. ముద్దాయి తరఫు వకీలు, నానా తంటాలూపడి క్రాసుపరీక్ష చేస్తున్నా రవ్వంతేనా ప్రయోజనం లేకుండావుంది. ఆ వేళ హోటల్లో చూచింది ఈ వ్యక్తేనని సాక్షి ఢంకావాయించి చెబుతున్నాడు. ఏమిచెయ్యటానికీ తోచక ముద్దాయి తరఫు వకీలు బుర్ర గోక్కుంటున్నాడు. ఇంతలో, అంతవరదాకా పైకప్పువంక యోగం పట్టినట్టు చూస్తూ కూర్చున్న విగ్గు పెద్దమనిషి చివాల్న బల్లమీదికి వంగి, చిన్ని కాయితం ముక్కమీద యేదో వ్రాసి, చుట్టజుట్టి ముద్దాయివకీలుమీదికి గిరాట్టు వేశాడు. ఆ కాయితం విప్పి చూసుకుని ముద్దాయి వకీలు, ముద్దాయి ముఖంవంకా, యీ విగ్గు పెద్దమనిషివంకా అదో విచిత్రంగా ఆశ్చర్యచకితుడై చూచాడు. బోనులోవున్న సాక్షివంక తిరిగి :



'ఆవేళ నువ్వు చూచినవ్యక్తి ముద్దాయితప్ప మరోరు కారని ఖండితంగా చెప్పగలవా ?'

'ఖండితంగా చెప్పగలను.'

'సరీగా ముద్దాయిలాగే వుంటే మరోవ్యక్తి నెవర్నైనా యెప్పుడేనా చూచావా ?'

'చూళ్ళేదు—ఆయనే యీయనని పొరపడేటంత ఒకే పోలికలున్న మనిషిని యెప్పుడూ చూళ్ళేదు.'

'సరే, ఆ కుర్చీలో కూర్చున్న ఆ పెద్దమనిషివంక చూడు' అన్నాడు తనకు కాయితం అందించిన ఆ మనిషి వంక చూపుతూ: 'ఇప్పుడు చెప్పు ఆ పెద్దమనిషీ ముద్దాయీ ఒకే మాదిరిగా వున్నారా లేదా?—ఏ٘ వంటావు?'—

ఆవిగ్గుపెద్దమనిషిలో వున్న బేఫర్వాతనం ఒక్కటి మిన హాయిస్తే, ఆయన ముమ్మూర్తులా సరీగా ముద్దాయిలానే వున్నారు. అదిమాని, సాక్షి ఒక్కడేకాదు—కోర్టులోవున్న యావన్మందీ విభ్రాంతులయ్యారు. ఆ పెద్దమనిషిని విగ్గు తీసివేయవలసిందిగా ఆజ్ఞాపించమని, ముద్దాయి వకీలు జడ్జీగారికి విజ్ఞప్తిచేశాడు. కోర్టు వారు సమ్మతించి విగ్గు తీయవలసిందిగా ఆజ్ఞాపించారు. విగ్గు తీసే సరికి ఆయనా ముద్దాయీ సరీగా అచ్చున తీసినట్టు ఒకేరూపంలో కనుపించుతున్నారు.

జడ్జీగారు ముద్దాయి వకీలు వంక చూసి: 'అయితే, ఇక మనం ఈ రాజద్రోహ నేరానికి కార్టన్‌గారిని విచారించవలసి వుంటుందా యేఁవిటి ? అని ప్రశ్నించారు. (విగ్గు పెద్దమనిషి పేరు కార్టన్)

'అనవసరం' అన్నాడు ముద్దాయి వకీలు స్ట్రియివర్. కాని సాక్షిని నేనొక్కటి అడగదలచాను—తాను ఆవేళ కూడా యీలాంటి విభ్రాంతి యేదైనా పడివుండటానికి సావకాశం వున్నదా లేదా ?—తాను చూచింది తప్పకుండా ముద్దాయినే నని చెప్పటం తొందరపాటు ప్రసంగమా కాదా ? అంతకంటే యికేమీ అక్కర్లేదు. ఇందువల్ల ఈ సాక్ష్యం యెందుకూ కొర గాదని తేలిపోతోంది. ఈ సాక్ష్యంవల్ల ఈ విచారణకు యెద్విధ మైన ప్రయోజనమూ లేదు. ఈ సాక్ష్యంద్వారా ముద్దాయిమీద ఆరోపించబడిన అభియోగాంశాలన్నీ రద్దయిపోతున్నయ్.

ఈవిచారణకాండనంతా వింటూ, క్రంచర్, వ్రేళ్లనున్న తుప్పంతా పరిశుభ్రంగా నాకేశాడు. ఈ వ్యవహారాన్నంతా ఒక రూపానికి చక్కదిద్ది స్ట్రియివర్ కోర్టువారికి నివేదించటం ప్రారంభించటంతో, తానుకూడా చెవులు దోరబెట్టుకుని అతి జాగ్రత్తగా వింటున్నాడు. స్ట్రియివర్ ఇలా వాదించుతున్నాడు:

'ప్రాసిక్యూషన్‌వారు పరమదేశభక్తుడని బోకొక్కించిన సాక్షి బర్సాడ్, వట్టి అబద్ధాలకోరనీ, కూలిడబ్బులకు దొంగ సాక్ష్యాలుచెప్పే అవినీతిపరుడనీ, జూడాస్ అనంతరం, ఇలాంటి లుచ్ఛా భూమిమీద పుట్టలేదనీ క్రాసుపరీక్షలో సుస్పష్టంగా తేలిపోయింది. స్వామిభక్తిపరాయణుడని చెప్పబడుతున్న రెండవసాక్షి క్లయ్ ఈ మొదటిసాక్షికి స్నేహితుడూ–తగిన స్నేహితుడూకూడా. ముద్దాయి తనకుగల అత్యవసరమైన కుటుంబ బాధ్యతలు నిర్వర్తించుకోవటానికి గాను, పదేపదే ఫ్రాన్సుకు వెళ్ళుతూ వుండటం గమనించి ఈ ఫోర్జరీకోరులు, ఆయనమీద తేలికగా ఈ అభాండలం మోపవచ్చని ఆలోచించారు. తనకున్న బాధ్యతలు అత్యంతరహస్యమైనవనీ ప్రమాదకరమైనవనీ ముద్దాయి, ఆ యువతితో అన్నమాట వాస్తవమే. అవి నిజంగా అలా యితరులతో చెప్పకోవటానికి వీలులేని కుటుంబరహస్యాలు కావచ్చు. అంతమాత్రంచేత అవి రాజకీయ కుట్రకు సంబంధించిన రహస్యాలని వాదించటానికి, ఏవిధమైన అవకాశమూ లేదు. జార్జివాషింగ్టన్‌కు సంబంధించిన ఆ వాక్యంకూడా, నవ్వులాటకన్న పరిహాసవాక్యమే తప్ప—దానికో ఉద్దేశాన్ని ఆపాదించటం కేవలం పొరపాటు. ప్రాసిక్యూషన్ వాదాన్నిబట్టి చూస్తే, ప్రభుత్వం, కుంచితమైన జాతి విద్వేషాన్ని ఆధారంగా తీసుకుని, పలుకుబడిని సంపాదించుకోటానికి ప్రాకులాడుతున్నట్టు కనుపించుతోంది. ఇది కేవలం ప్రభుత్వంయొక్క బలహీనతను వెల్లడించుకోవటం మినహా మరో ప్రయోజన మేమీ లేదు. ప్రాసిక్యూషన్ పొగుజేసిన ఈ తప్పడుసాక్ష్యాలనుబట్టి చూస్తే, రాజకీయ నేరాల విచారణలలో ఈ బాపతు సాక్ష్యాలు ఎలాంటి అవకతవకలకు దారి తీస్తున్నాయో కోర్టువారు తేలికగా అర్థంచేసుకోవచ్చు'—

ఆ చివరిమాటనేసరికి జడ్జి ఉగ్రుడై చూచాడు : 'అలాంటి మాటలు కోర్టులో మాట్లాడగూడదు' అన్నారు—ఆ మాటలు అబద్ధమైనట్టు.

ఉభయపక్షాల వాదాలూ ముగిసినై. ఇక జూరీల నిర్ణయం తేలవలసివుంది.

తమలో తాము సంప్రదించుకోవటానికి జూరీలు పక్కకు వెళ్లారు. మళ్ళాకోర్టుహాలు యావత్తూ కందిరీగలమోత ప్రారంభమైంది.

కోర్టులో ఇంత గందరగోళం జరుగుతున్నా, ఆ విగ్గుమనిషి కార్టన్ మాత్రం, అదేమోస్తరుగా ఆకాశంవంక చూస్తూ, నిర్లక్ష్యంగా కాళ్లుపంబదన్ని కూర్చున్నాడు. ముద్దాయితరఫు వకీలు స్ట్రియివర్ బల్లమీద వున్న కాయితాలన్నీ బొత్తిబెట్టుకుంటూ, చుట్టూవున్న వారితో గుసగుస లాడుతున్నాడు' మధ్యమధ్య జూరీ పెద్దమనుషుల ముఖాలవంక ఆందోళనగా చూస్తున్నాడు. జడ్జీగారికి కూడా వాదప్రతివాదాలు విని, యేదీ٘ మైందీ అర్థంకాక బుర్ర వేడెక్క జ్వర మొచ్చినట్టయి, తోచక కుర్చీలోనుంచి లేచారు. తక్తుమీద ఇటూ అటూ పచారి చేస్తున్నారు. ఇంతమందీ ఇంత ఆందోళనగా వున్నా, విగ్గు పెద్దమనిషిమాత్రం అతి బేఫర్వాగా కుర్చీమీద యాలిగిలబడి ఆకాశంవంక చూస్తూ కూర్చున్నాడు. చేతులు రెండు జేబుల్లోకి దోపివున్నయ్. వెలిసిపోయి, చిరిగి అంపెలైవున్న ఆ లాయరు గౌనూ, మురికి కోడుతూ నెత్తిమీద

రచయితలకు మనవి

రచయితలు తమ రచనలను సిరాతో కాగితానికి ఒకే వైపున వ్రాసి పంపవలెనని మనవి. తమ రచనలను త్రిప్పి పంప గోరువారు, మూడు కాణ్ల స్టాంపులను రచనలతోనే చేర్చి పంపవలెనని కోరుతున్నాము. అలా స్టాంపులను రచనలతో చేర్చి పంపనిచో త్రిప్పిపంపుట సాధ్యముకాదు.

కొంతమంది తమ రచనలను ఏ కారణములవల్ల ప్రచురించలేదో ప్రశ్నిస్తూ లేఖలు వ్రాస్తున్నారు. అట్టి కారణాలను వివరించుట సాధ్యముకాదని రచయితలు గుర్తింపవలెనని ప్రార్థిస్తున్నాము.

—సంపాదకుడు.

నుంచి జారి జారిపోతున్న ఆ విగ్గూ, ఆ అవతారం చూస్తే కోర్టులో వున్న వాళ్లకు అతనంటే మొదట్లో యేర్పడ్డ గౌరవభావం క్రమంగా సన్నగిలిపోతోంది. క్రంచర్ కూడా అదే ధోరణిలో వున్నాడు. పక్కవాడితో:

'ఆ అవతారంగైనా నూస్తే సంపాదనా చట్టబండలూ వున్న లాయర్లా లేడు—అసలు, సంపాయించుకునే ధోరణి మడిసిగా లేడు!

కార్టన్ అలా ఆకాశం వంక చూస్తూ ఏమీ చూడనట్టు నటిస్తున్నాడేగాని, అతనికి చుట్టూ యేమిటి జరుగుతున్నదీ సర్వం అర్థమౌతూనే వుంది; ఎందుకంటే, మిస్ మానెట్ తండ్రి భుజం మీద తల వేల వేయటం అందరికంటే ముందు అతనే గమనించాడు. అక్కడున్న పోలీసుఉద్యోగిని పిల్చి: 'ఆవిడ మూర్ఛపడిపోతోంది కనుపించటం లేదా—తండ్రికి సాయంవెళ్ళి ఆవిణ్ణి బయటకు తీసుకుపోయే యేర్పాట్లు చూడండి!'—అన్నాడు.

ఆవిణ్ణు బయటికి తీసుకువెడుతున్నారు. కోర్టులో వున్న వాళ్ళంతా, ఆవిడమీదా, తండ్రిమీదా కూడా చాలా జాలిబడ్డారు. ఆ వృద్ధుడు తను జైల్లో అనుభవించిన కష్టపు దినాలు జ్ఞాపకంవచ్చినప్పుడు ఎంతో వ్యాకులపడటం వాళ్ళంతా చూచారు. వకీలు ఆయన్ను ప్రశ్నించుతున్నప్పుడు ఆయనముఖం మీద విషాదరేఖలు అలుముకున్నయ్. ఆయన కుమార్తెతో బయటికి వెళ్ళగానే జూరీలలో ఒకాయన జడ్జీగారిని సమీపించి, తమలో తమకు అభిప్రాయభేదంవచ్చిందనీ గదిలోకి వెళ్లి సంప్రదించుకు వస్తామనీ చెప్పాడు.

జార్జి వాషింగ్‌టన్ విషయం ఆలోచిస్తున్న జడ్జీగారికి, అభిప్రాయభేదం వచ్చిందన్నమాట చెవులబడి ఆశ్చర్యపడ్డాడు. సరే, లోపలికి వెళ్లి సంప్రదించుకు రమ్మన్నాడు. తను కూడా విశ్రాంతి తీసుకోవటానికి తక్తు దిగి వెళ్ళిపోయాడు. విచారణ సాయంత్రం దాకా పట్టింది. దీపాలు కూడా వెలిగిస్తున్నారు. జూరీ చాలా తర్జన భర్జనలో పడ్డారనీ చాలాసేపటికిగాని బయటికి రారనీ, కింవదంతి బయలుదేరింది. కోర్టులో వున్న జనమంతా యేదైనా కాస్త మేత వేసి రావటానికి బయటికి వెళ్లారు. ముద్దాయి కూడా కోర్టు వెనకవున్న దొడ్లోకి వెళ్లి నేలమీదే చతికిలబడ్డాడు.

తండ్రీ కూతుళ్లు బయటికి వెడుతూన్నప్పుడు వాళ్లతోపాటు బయటికి పరుగెత్తిన లారీగారు, తిరిగి లోపలికి వచ్చి క్రంచర్‌ను దగ్గిరికి పిలిచారు.

'ఇదుగో జర్రీ, బయటికి వెళ్లి కాస్త కాఫీ గీఫీ త్రాగివస్తావేమో వెళ్లిరా—త్వరగా మాత్రం రా—జూరీ లోపలికి రాగానే యేదో ఒకటి తేలిపోతుంది. వాళ్లు లోపలికి వచ్చేసరికే నువ్విక్కడుండాలి—ఆలస్యం చెయ్యకు—విషయం తేలగానే ఆ వార్తను బ్యాంకుకు తీసుకువెళ్లాలి'—అంటూ ఒక షిల్లింగు పారేశాడు.

జర్రీ తలపూపి చిరునవ్వు నవ్వుకుంటూ బయటికి వెళ్లిపోయాడు. ఈలోగా కార్టన్ లారీగారిదగ్గిరికొచ్చి, బుజంమీద చెయ్యివేసి పలకరించాడు. 'ఆవిడ ఎలా వుంది'—

'చాలా దించుకుపోయివుంది. తండ్రి దగ్గిరుండి అనునయించుతున్నాడు—కోర్టులోనుంచి గాలిలోకి తీసుకువెళ్లిన తరవాత కాస్త ఫరవాలేదు—కోలుకుంటోంది?'—

'అయితే ఆవిడ క్షేమంగా వున్నట్టు ముద్దాయికి చెప్పివస్తాను. ఓ పెద్ద బ్యాంకీలో ఉద్యోగంచేసే మీవంటి పెద్దమనిషి పోయి ముద్దాయిరకంమనిషితో బహిరంగంగా మాట్లాడటం, మీకు అగౌరవంగా వుండదేమో?'

అంతవరదాకా తాను మనసులో పడుతున్న మథన యావత్తూ, కార్టన్ అవగతం చేసుకున్నాడేమోనని లారీకి అనుమానమేసింది. ఆ ఉత్కంఠతో మొహం కందగడ్డలా ఎర్రబడ్డది. కార్టన్ కోర్టువెనక దొడ్లోకి నడిచాడు.

'డార్నే గారూ!'—

ముద్దాయి లేచి దగ్గిరికి వచ్చాడు.

'మీరు ఆ సాక్షి మిస్ మానెట్ ఎలా వున్నదో తెలుసుకోవాలని ఆందోళనపడుతున్నారనుకుంటాను. ఆవిడ క్షేమంగా వుంది; నెమ్మదిగా కోలుకుంటోంది.

'నా కారణంగా ఆవిడ అలాంటి మనస్తాపం పడ్డారు—ఇందుకు చాలా విచారిస్తున్నాను. ఇలా అన్నానని ఆవిడకు తెలియజేయగలరా?'—

'ఆ చెప్తాను—మీరు చెప్పమనికోరితే తప్పకుండా చెప్తాను.'

'కోరుతున్నాను—ఇందుకు, ముందుగానేనా మీకు నా కృతజ్ఞతకూడా తెలియజేస్తున్నాను'—

'నీ విషయం ఏమవుతుందనుకుంటున్నావ్.'—

'ఇంకా ఏమౌతుందని అనుకుంటాను.'—

'జూరీలలో మథన బయలుదేరటం చూస్తే, మీకు కొంత మేలు జరగవచ్చునని అనిపిస్తోంది.'

గంటా, గంటంబావు గడిచింది. మధుమాంసాల మత్తులో, హోటలుదగ్గిర బెంచీమీద కూర్చున్న జర్రీకి మత్తువచ్చి కాస్త వెనక్కి యాలిగిలబడి కునుకు దీస్తున్నాడు. ఇంతలో జనం మెట్లమీద దబదబా పరిగెత్తుకున్నట్టు పెద్ద అలజడి అయింది. జర్రీ తుళ్లిపడి లేచి, వాళ్ళతోపాటు తానుకూడా కంగారుగా లోపలికి పరుగెత్తాడు.

'జర్రీ! జర్రీ!' అంటూ లారీ కోర్టులోపలనుంచి ద్వారంలోకి ఆదరా బాదరా పరుగెత్తుకుంటూ వచ్చాడు.

'ఇక్కడే వున్నా సర్!'—ఎంత యుద్ధం చేసినా లోపలికి తోసుకుపోయే ఆస్కారం కనుపించక, జర్రీ వరండాలోనుంచే సమాధానం చెప్పాడు.

లారీ, ఒక చిన్ని చీటీ జనం నెత్తిమీదుగా జర్రీ చేతికి అందించాడు.

'అందుకున్నావా?'

'ఆఁ'—

'పరుగెత్తు!'

'కేసు కొట్టేశారు'—అని చీటీమీది అక్షరాలు.

జర్రీ వెళ్ళిపోతున్నాడు: 'ఈ తడవగేనా యెనకటికిమల్లే నే 'పునర్జన్మ' అని చెప్పంటే ఇప్పుడు సరిగా అర్థముండేది అనుకుంటున్నాడు.

★

బొమ్మరిల్లు



"గొల్లపిల్ల"

శ్రీమతి జె. జానకి

చల్లలమ్మే
గొల్లపిల్లా
పల్లెటూరి
పడుచుపిల్లా
నెత్తిమీదా
కడవతోటీ
కడవనిండా
చల్లతోటీ
చల్లనమ్మా
డబ్బుచేయగ
పట్టణానికి
బయలుదేరెను.

గొల్లపిల్లకు
త్రోవలోనా
లేనిపోనీ
తాంపులేవో
లేత తలలో
మొలక లెత్తెను.
"చల్లనమ్మా
డబ్బుచేసెద,
డబ్బుపెట్టీ
కోడినొక్కటి
తీసుకొచ్చెద;
కొన్నకోడీ
ఎన్నినాళ్లో
కాకమును పే
గుడ్లుపెట్టును.
గ్రుడ్లుఅన్నీ
ఎన్నినాళ్లో
కాకమును పే
పిల్లలగును.
పిల్లలన్నీ
ఎన్నినాళ్లో
కాకమును పే
పెద్దవగును.
పెద్దవయినా
పిల్లలన్నీ
గ్రుడ్లుపెట్టును;
గ్రుడ్లుఅన్నీ
కోళ్ళు అగును;
కోళ్ళు అన్నీ
గ్రుడ్లుపెట్టును;
గ్రుడ్లుకోళ్ళూ
కోళ్ళు గ్రుడ్లూ
లెక్కమీరీ
ఎక్కువగును.
వాటినమ్మిన
ఎంతో డబ్బూ
సొంతమగును;
సొంత మయినా
డబ్బుతోడను
ముదముతోడను
ముక్కుకి పుడకా,
చెవులకి దుద్దులు
చేతికి గాజులు,
కాళ్ళకి అందెలు
మెడకి గొలుసూ,
నడుముకి ఒడ్డాణం,
క్రొత్త క్రొత్తవి
చీరలెన్నో!
తీసుకొచ్చెద,
పెట్టుకొనియెద.
కట్టుకొనియెద.
ఊరిలోనీ
వారికన్నా
చక్కనైనా
చుక్కనయ్యెద.
తలను త్రిప్పుతు
చేతు లూపుతు
శీకు శాకుగ
నడుచు కుంటూ
ఊరువాడా
తిరిగి వేసెద."
అనుచు గొల్లది
నెత్తిమీదా
చల్లకడవను
మరచిపోయీ
మురిసిపోయీ
అంత నిజముగ
జరుగుతున్నటు
తలను త్రిప్పెను
చేతు లూపెను.
నెత్తిమీదా
చల్లకడవా
జారిపోయెను,
ముక్కలయ్యెన
పల్లెటూరీ
గొల్లదానీ
గాలిమేడలు
కూలిపోయెను
లేనిపోనీ
ఆశలన్నీ
ఉన్నదానిని
సున్నచేసెను.

ఇల్లు కాలితే కాలింది!

వి. వి. [illegible]

ఒకప్పుడు చైనాదేశంలో చింగ్ చౌ, వాంగ్ పెన్ అనే తండ్రీ కొడుకులు ఒక చిన్న పూరిగుడిసెలో కాపురం చేస్తూ వుండేవారు. వాంగ్ తల్లి, పాపం, చిన్నప్పుడే చనిపోయింది. చింగ్ చౌ అడవిలో కట్టెలు కొట్టకొచ్చి, వూళ్లో అమ్ముకొంటూ జీవయాత్ర కొనసాగిస్తుండేవాడు. వాంగ్ యింటిదగ్గరే వుండి అన్నం వండటం మొదలుకొని పశువులను పందులను కాచుకురావటం వరకు అన్ని పనులూ తానే చేస్తుండేవాడు.

ఒక రోజున మామూలుగానే చింగ్ చౌ అడవికి పోయాడు. వాంగ్ పెన్ యింట్లో అన్నం వండుతూ వుండగా చూరుకు నిప్పు అంటుకొన్నది. వాంగ్ పెన్ ఒంటరిగాడై ఏమీ తోచక ఏడ్వ మొదలుపెట్టాడు. ఎలాగో జ్ఞాపకంవచ్చి గబగబా పోయి గుంజకు కట్టివున్న పశువులను మాత్రం వదిలేశాడు. పందుల విషయం మరచిపోయాడు. ఆ పందులన్నీ పదిలంగా వుండటం కోసం మామూలుగా ఒక చిన్న గుడిసెలో వుంచి తలుపుకు తాళం పెట్టేవారు. ఇంటికి అంటుకొన్న నిప్పు యింతలోనే పందులపాకకు కూడా పాకి అదీ తగులబడిపోయింది. పాపం, అన్ని పందులు మలమలా మాడిపోయాయి.

వాంగ్‌కు అసలే పందులంటే తగని ప్రేమేమో!–అన్ని పందులూ తగులబడి పోయిన తరువాత యితనికి వాటి విషయం చటుక్కున జ్ఞప్తికి వచ్చింది. గబగబా పరుగెత్తుకు వెళ్ళి చూశాడు. అన్ని పందులూ కదలిక లేకుండా కట్టెల్లా పడివున్నాయి. వాంగ్‌కు బావురుమంటూ ఏడ్పువచ్చింది. కొంతసేపు ఏడ్చాక అతనికి అనుమానం వచ్చి, అవి సాంతం చచ్చిపోయాయో లేదో అని చూడ బుద్ధి పుట్టింది. వెంటనే కూర్చున్నచోటినుంచీ లేచి పందులుదగ్గిరకు వెళ్ళి ఒక పందిని చేతితో తాకి చూశాడు. వేలు తగిలీ తగలగానే చుర్రున కాలింది. వేలు కాలితే మనం అంతా ఏంచేస్తాం! చప్పున ఆవేలు నోట్లో పెట్టేసుకొంటాం కదూ? వాంగ్ కూడా సరిగ్గా యిలాగే చేశాడు. అలా వేలు నోట్లో పెట్టుకొనేసరికి జిహ్వాకు కమ్మని రుచి తగిలింది. వాంగ్ కళ్లు పెద్దవిచేసి యింకా పరీక్షగా కాలిన పందికేసి చూసి, మనసు వుండబట్టలేక మరొకసారి తన చేతితో పందిమాంసాన్ని పొడిచి, నోట్లో పెట్టుకొన్నాడు. తియ్యతియ్యగా కమ్మకమ్మగా ఉన్నది. వాంగ్ వళ్లు పరవశమైంది. ఇందాకటినుంచీ ఏడ్చి ఏడ్చి వున్నాడేమో, కడుపులో కాలుతున్నది. కాలేకడుపుకు యీ రుచి యీ వాసన బలేగొప్పగా తోచాయి. ఇక ఆగలేక కప్పెడు కప్పెడు మాంసం పీక్కుతినటం మొదలు పెట్టాడు.



వాళ్ళనాన్న చింగ్ చౌ కట్టెల మోపు తలమీద పెట్టుకొని యింటికి తిరిగివచ్చాడు. కానీ యిల్లు ఏదీ? అంతా తగులబడి బూడిద అయిపోయింది. కట్టెల మోపును అక్కడే పారేసి నాలుగు వేపులా చూసి వాంగ్‌ను బిగ్గరగా పిలిచాడు. వాంగ్ యింట్లో వుండి కూడా యింతవనీ జరిగినందుకూ చింగ్‌చౌకు వళ్ళు మండిపోయింది. కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి. ఇది చూచిన వాంగ్‌కు వళ్ళంతా చెమటలు దిగ్గారటం ప్రారంభించింది. తండ్రి యిక తనను కొట్టి చంపుతాడని భయమేసిపోయింది వాంగ్‌కు. ఏం చేయటానికీ తోచక చేతులోవున్న పందిమాంసం యింత తెచ్చి తండ్రినోట్లో గబుక్కున కుక్కేశాడు. వూపిరి సలుపుకోటాకినా నోటినిండావున్న యీ మాంసాన్ని వుమ్మేయనన్నా వుమ్మేయాలి; లేదా మింగేయనన్నా మింగేయాలి కదా. చింగ్ చౌ ఆకలిగొని వున్నాడేమో, వుమ్మేయలేక మింగేశాడు ఇంకేముందీ? దాని రుచికి సమ్మోహితుడైపోయాడు. అంతకుముందు ఎన్నడూ మాంసాన్ని కాల్చితినటం అంటే ఏమీ ఎరుగరేమో - యిప్పుడు దైవవశాత్తు కాలిన మాంసం లభించేసరికి తండ్రీ కొడుకు లిద్దరూ బ్రహ్మానందపడిపోయారు. అంతేకాదు యీ మాంసం ఒకసారి తిన్నాక, దాని రుచి బాగా మరిగారు.

ఇక మరునాటినుంచీ చుట్టుప్రక్కల గ్రామాలలో రోజుకు పదిపన్నెండు గుడిసెలు తగులబడటం ప్రారంభమైంది. ఈ గుడిసెలతోపాటు వగాయిడాని ంగు లు కూడా మాడి చచ్చేవి. వాటిని యీ తండ్రీకొడుకులు యిద్దరూ తెగబడి తింటూవుండేవారు. పందిని కాల్చాలంటే యిల్లు తగులబెట్టితేనే యిది సాధ్యమౌతుందని వీళ్ళ అభిప్రాయం. అందుకోసం ప్రక్కవాళ్ల యిళ్లన్నిటికీ వీళ్లు యిలా ప్రతి రోజూ నిప్పుపెట్టుతుంటే ఎవరు మాత్రం ఎన్ని రోజులు వూరుకొంటారు? ప్రభుత్వాధికారులు కూడా యిలా యిళ్లు తగులబడటం ప్రతి రోజూ అక్కడే ఎందుకు జరుగుతున్నదీ అని ఆలోచించి చివరకు యీ తండ్రీకొడుకులను పట్టుకొనిపోయి న్యాయస్థానంలో నిలబెట్టారు. చింగ్ చౌ, వాంగ్‌పెన్‌లు ఎందుకైనా మంచిదని న్యాయస్థానానికి పోతూ పోతూ కాల్చినపందిమాంసం యింత మూటగట్టుకు వెళ్ళారు. న్యాయాధికారివీరి విషయం అంతా విచారించాడు. వీళ్లు కాల్చిన పందిమాంసం కోసం యిళ్లు తగులబెట్టుతున్నామని ఒప్పుకొంటూ, ఆ మాంసం రుచినిగూర్చి వెయ్యివిధాల వర్ణించారు. వీరి వర్ణనలన్నీ వింటున్న న్యాయాధికారికికూడా నోరూరింది. వీళ్లు పెట్టిన మాంసం ముక్కలను తిని, దాని రుచి తెలుసుకొని అమితంగా ఆశ్చర్యపోయాడు. తమ దేశంలో ఎవరూ అంతకుముందు కనిపెట్టని వంటకాన్ని కనిపెట్టినందుకు వీళ్లిద్దరినీ కనికరించి న్యాయాధికారి వదలివేశాడు. ఆ న్యాయాధికారి తాను కొంత కష్టపడి పందులను యిళ్లు తగులబెట్టనక్కరలేకుండానే యితర విధాల కూడా కాల్చితినవచ్చునని కనిపెట్టాడు. మాంసాన్ని కాలిస్తే మంచి రుచి వస్తుందనేవిషయం చైనాదేశీయులకు యీ విధంగా తెలిసివచ్చింది.

(చార్లెస్ లాంబ్ వ్రాసిన "రోస్టింగ్ ఆఫ్ ది పిగ్" అనే కథకు యిది అనుసరణ.) ★

హకల్ బెరీ ఫిన్

మార్క్ ట్వేన్

బొమ్మరిల్లు సీరియల్

26

తరవాత మేము ఇంటికి వచ్చేశాము. దోవపొడుగునా ఆలోచిస్తూనే ఉన్నాము. చటుక్కున టామ్ అన్నాడు:

"హక్! మన తెలివితేటలు తగలడ్డట్టే ఉన్నాయి. జిమ్ ఎక్కడున్నాడో తెలుసా? మా బాబయ్య ఇంట్లోనే!"

"నిజంగా?"

"ఆ. ఇంటి వెనకాల దూరంగా పశువుల దొడ్డి లేదూ? అందులో తప్పకుండా ఉంటాడు. ఎందుకంటే మధ్యాహ్నం మనం భోజనాలు చేస్తున్నప్పుడు ఒక నీగ్రో నౌకరు పళ్లెంలో భోజనం పెట్టుకుని, మా బాబయ్యదగ్గిర తాళంచెవి తీసుకుని ఆ దొడ్డివైపు వెళ్లాడు."

"ఊ. వెడితే?"

"ఆ భోజనం జిమ్ కోసమే అయిఉంటుంది. ఆదొడ్లో ఏదన్నా గదిలో జిమ్‌ను బందీచేసిఉంటారు. అందుకే తాళంచెవికూడా పట్టుకెళ్లాడు నీగ్రో," అన్నాడు టామ్.

నిజంగా తెలివితేటలంటే టామ్‌వే. అంత చిన్న కుర్రాడికి అంత మంచిబుర్ర ఉండటం ఆశ్చర్యం. టామ్‌సాయర్‌కున్న తెలివితేటలే నాకుంటే నాకు మహారాజ పదవికూడా అక్కర్లేదు. ఇట్టే కనిపెట్టేశాడు జిమ్ ఎక్కడుందీ.

జిమ్‌ను విడిపించేందుకు మంచిప్లాను ఆలోచించమన్నాడు నన్ను టామ్. తనుకూడా ఒకప్లాను ఆలోచిస్తా నన్నాడు. రెండు నిమిషాలాగి "ఆలోచించావా?" అన్నాడు. "ఓ" అన్నాను. చెప్పమన్నాడు.

"గొడ్లదొడ్డిలో ఉన్నది జిమ్ అవునో కాదో తేలిగ్గా కనిపెట్టగలం. బాగా చీకటిగా ఉన్న రాత్రివేళ నా పడవను మన ఇంటికి సమీపంగా ఉన్న రేవులో నిలిపిఉంచుదాం. మీ బాబయ్య నిద్రపోయాక ఆయన దగ్గిర్నించి తాళంచెవి కొట్టేసి దొడ్డి తలుపు తెరిచి జిమ్‌ను విడిపిద్దాం. తరవాత పడవలో ప్రయాణంచేస్తూ స్వేచ్ఛా రాష్ట్రాలకి పోదాం. బావుందా ఈ ప్లాను?"

"బాగానే వుంది గాని చాలా సులభంగా ఉంది నీ ప్లాను. పాలుతాగే పిల్లాడు కూడా ఇట్టే చేసెయ్యగలడు. ప్లాను అంటే ఎంతో అసాధ్యమైనదిగా ఉండాలి. ఎంత కష్టమైతే అంత గొప్ప, అంత అందం. నీ ప్లాను మంచినీళ్లు తాగినంత తేలిగ్గా ఉంది," అని టామ్‌సాయర్ తాను ఆలోచించిన ప్లాను చెప్పాడు. నిజానికి ఆ ప్లాను బలే అద్భుతంగా ఉంది. నా ప్లానుకంటే పదిహేనురెట్లు కష్టంగా ఉంది. పైగా నా ప్లానుతో జిమ్ ఎంత స్వేచ్ఛ పొందుతాడో టామ్ వేసిన ప్లానుతో కూడా అంతే స్వేచ్ఛ పొందుతాడు. అందుచేత నేను తక్షణం టామ్‌సాయర్ ప్లానుకు ఒప్పుకున్నాను. కాని అతడు ఆ ప్లానును చివరిదాకా

అలా ఉండనిస్తాడని నాకు నమ్మకంలేదు. క్షణక్షణానికి మార్చేస్తూ ఉంటాడని నాకు తెలుసు.

నాకు అన్నిటికంటే ఆశ్చర్యం కలిగించిన దేమిటంటే టామ్‌సాయర్ కూడా నా అంత నీచంగా ప్రవర్తించాలనుకోవటం. టామ్‌సాయర్ గౌరవమైన కుటుంబంలో పుట్టినవాడు. పెద్దవాళ్ల భయభక్తుల కింద పెరిగినవాడు. అతడుకూడా నీగ్రోబానిసను దొంగిలించటానికి ప్రయత్నించటం నాకు విపరీతంగా తోచింది. నే నతనికి ఈ విషయంలో జోక్యం కలిగించుకోవద్దని సలహా ఇద్దా మనుకున్నాను. కాని అతడు నానోరు మూసి అన్నాడు:

"హాక్! నువ్వు నాకు సలహా లివ్వనక్కర్లేదు. నేనేం చేస్తున్నానో నాకు తెలియదంటావా?"

"కాని—"

"నీగ్రోను రక్షిస్తానని చెప్పానా లేదా?"

"చెప్పావు."

"ఇంకేంమరి. ఒకసారి మాటిచ్చాక తిరిగి పోతా ననుకున్నావా?"

టామ్‌తో ఇక వాదించి లాభంలేదు. అతని తరహా అంతే. ఒక పనిచేస్తానంటే ఎలాగో చేసి తీరతాడు కాని మధ్యలో మానెయ్యడు.

మర్నాడు ప్రొద్దున్నే లేచి నీగ్రో నౌకర్లుండే గుడిసెలవద్దకు వెళ్ళాము. నీగ్రోలు అప్పుడే చద్దిమూటలు కట్టుకుని పొలాలకు బయల్దేరుతున్నారు. కిందటిరోజు జిమ్‌కోసం భోజనపు పళ్లెం తీసుకువెళ్ళిన నీగ్రో మళ్ళీ తాళంచెవి తీసుకుని పశువులదొడ్డివేపు వెడుతున్నాడు. అతణ్ణి మంచి చేసుకోవాలని చెప్పి పలకరించాము. ఎవరూ పలకరించే దిక్కులేక గోడుగోడుమంటున్నాడల్లే వుంది, ఆ నీగ్రో మేము పలకరించేసరికి అదే పనిగా వాగటం సాగించాడు. తన్ను కామినీపిశాచాలు రాత్రిళ్లు బాధపెడుతున్నాయని, తనచేత అడ్డమైన పనులూ చేయిస్తున్నాయనీ, రకరకాల చప్పుళ్లు చేస్తున్నాయనీ, ఎన్ని మంత్రాలు వేసినా అవి వదిలిపోవటం లేదనీ చెప్పాడు. టామ్ అతన్ని మధ్యలో ఆపి "ఈ భోజనం ఎవరికి తీసుకెడుతున్నావు," అని అడిగాడు.

నీగ్రో కులాసాగా నవ్వాడు. అటూ ఇటూ చూసి మెల్లిగా "నాతో రండి. చూపిస్తాను," అన్నాడు.

టామ్ పదమన్నాడు. నీగ్రో దారితీశాడు పశువులదొడ్డిగేటు తీసి, దొడ్లో ఒక పక్కగా ఉన్న గదివద్దకు తీసుకెళ్లాడు. గదితాళం తీశాడు. కటిక చీకటిగా వుంది. మొదట ఎవ్వరూ కనబడలేదు మాకు. కొంతసేపటికి జిమ్ కనిపించాడు. నాకేసి, టామ్‌కేసి నోరు తెరుచుకుని ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"అరె, హాక్‌గారూ! ఎల్లా వచ్చారిక్కడికి? అరె, టామ్‌సాయర్‌గారు కూడా ఉన్నారే?" అన్నాడు జిమ్.

జిమ్ మాటలు వినగానే గదిబయట నుంచున్న నీగ్రో గభాలున లోపలికొచ్చి "అతను మిమ్మల్ని ఎల్లా ఎరుగునండిసార్?" అని అడిగాడు. నేను మా రహస్యం బయటపడుతుందని గాబరాపడిపోయాను. కాని టామ్ నీగ్రోకేసి ఎగా దిగా చూసి

"ఎవర్ని ఎవరెరుగుదురంటావ్?" అని ప్రశ్న వేశాడు.

"ఇతడు పారిపోయిన నీగ్రోకదండి. మిమ్మల్ని ఎరిగినట్టుగా ఏదో అంటున్నాడే?" అన్నాడు నీగ్రో.

"అత డేమీ అనలేదే."

"అనకపోవట మేమిటిసార్? ఇప్పుడే కదూ మిమ్మల్ని పేర్లుపెట్టి పిలిచాడు?"

"ఎప్పుడు పిలిచాడు? ఏం పేర్లుపెట్టి పిలిచాడు? అసలు అత నెవరు? మే మెవరం?" అని జిమ్‌కేసి తిరిగి "ఇదుగో అబ్బాయ్ నువ్వు మమ్మల్ని ఇప్పుడు పిలిచావా?" అని టామ్ అడిగాడు. జిమ్ మాప్లాను గ్రహించాడు. వెంటనే

"ఎబ్బే. లేదండి." అన్నాడు.

"నువ్వు మమ్మల్ని ఎరుగుదువా?" అని టామ్ అడిగాడు. జిమ్ ఎరగనన్నాడు. టామ్ నీగ్రోని పట్టుకుని దబాయించాడు:

"విన్నావా? అతడు మమ్మల్నెరగడు. మే మతన్ని ఎరగం. అతడు మమ్మల్ని ఎల్లా పిలుస్తాడనుకున్నావ్?"

నీగ్రో తెల్లబోయి అన్నాడు: "కాదు సార్. అతడు మిమ్మల్ని పలకరించినట్టు నిజంగా వినబడిందండి. ఇదంతా కామినీపిశాచాల పనేనండి. మాటి

మాటికీ నన్ను పట్టుకుని గాడిదని చేసి ఏడిపిస్తున్నా యండి. సార్! ఈ సంగతి మీ బాబయ్యగారితో చెప్పకండి. కూకలేస్తారు. మీ బాబయ్యగారికి కామినీ పిశాచాలమీద నమ్మకం లేదండి."

టామ్ ఆ నీగ్రోకు పది సెంట్ల నాణెం ఇచ్చి కామినీ పిశాచాలు పట్టుకోకుండా ఉండేందుకు మంచి తాయెత్తు కొనుక్కో-మన్నాడు. నీగ్రోకు డబ్బు చూడ గానే కళ్లు మెరిశాయి. నాణాన్ని వెలుగులోకి తీసుకు పోయి వెండిదో సత్తుదో పరీక్షించాడు. కొరికి కూడా చూశాడు. ఈలోగా టామ్ జిమ్‌తో మెల్లిగా "జిమ్! నువ్వు మమ్మల్నెరిగినట్టు కనిపించకు. గమ్మునఊరుకో. నిన్ను రక్షించటానికి ప్రయత్నిస్తున్నాం. రాత్రిళ్లే మైనా తవ్వుతున్నట్టు చప్పుడువినిపిస్తే భయపడి కేకలు వెయ్యకు," అని చెప్పాడు. జిమ్ సంతోషంతో టామ్ చేతులుపట్టుకున్నాడు. ఇంతలో నీగ్రో మళ్లీ లోపలికి రావటం చూసి జిమ్ వెనక్కి-తగ్గాడు. మేము బయటికి వచ్చేశాం.

27

తరవాత నేనూ, టామ్ నది ఒడ్డుకు పోయి జిమ్‌ను రక్షించే మార్గాలు మళ్లీ ఆలోచించ సాగాము. నే నెన్ని ఉపాయాలు సూచించినా టామ్ అన్నిటినీ తోసివేశాడు. నేను చెప్పిన ఉపాయాలన్నీ తేలిగ్గా ఉన్నాయనీ, వాటిని ఎవడు పడితే వాడే చెయ్యగల డని అన్నాడు. కొంతసేపు ఆలోచించి ఇలా అన్నాడు:

"ముందు మన మొక **రంపం** సంపాదించాలి."

"ఎందుకు?"

"జిమ్ కాలు కోసేసేందుకు."

"జిమ్ కాలు కొయ్యటానికా?" అని ఆశ్చర్య పోయాను.

"అవును. జిమ్ కాలికి పదడుగుల ఇనప గొలుసు తగిలించి ఒక మంచానికి కట్టివేశారు. కాలు కోసెయ్యనిదే గొలుసు ఎల్లా వస్తుంది?"

"గొలుసు తేలిగ్గా ఊడదీయచ్చు. దానికోసం కాలు కోసెయ్యక్క-ర్లేదు."

"హాఁ! నీకీ విషయాలు బొత్తిగా తెలియవు. నేను బోలెడు పుస్తకాలు చదివాను. కొన్ని పుస్త కాల్లో ఖైదీలు గొలుసు ఊడిరాకపోతే కాలో, చెయ్యో తెగగొట్టుకున్నట్టు రాసివుంది. మనం కూడా అలా చెయ్యాల్సిందే. మనయిష్టం వచ్చినట్టు చేసేట్టయితే ఈ పుస్తకాలన్నీ ఎందుకు?"

నేను మాట్లాడలేదు. ఎంత ఆలోచించినా జిమ్ కాలు తెగగొట్టవలసిన అవసరం కనబడలేదు. చివరికి టామ్ సాయరే అన్నాడు:

"లేదనుకుంటాను."

"ఏమిటి లేదు ?" అని అడిగాను.

"జిమ్ కాలు తెగగొట్ట వలసిన అవసరం లేదు. ఎందుకంటే జిమ్ ఒప్పుకోకపోవచ్చు. కాని అతని కొక తాడు నిచ్చెన అవసరమనుకుంటాను."

"ఎందుకు ?"

"అబ్బ, ప్రతిదానికీ ఎందుకంటా వేం హక్ ? ప్రతి ఖైదీదగ్గిర ఒక తాడు నిచ్చెన వుండి తీరుతుంది. తాడు నిచ్చెన సహాయంతో కోట గోడనించి బయటికి దిగి పారిపోవాలి. పుస్తకాల్లో అలాగే చేస్తారు."

"కాని ఇక్కడ కోటగోడ ఏం లేదుగా ? కిటికీ ఊచలు విరగ్గొట్టి తేలిగ్గా ఇవతలకు రావచ్చు."

"హక్ ! నువ్వెంతసేపూ తేలిక పద్ధతులే ఆలోచిస్తావు. ఒకవేళ కిటికీలోంచి జిమ్ ఇవతలి కొచ్చినా తాడు నిచ్చెన అతనిదగ్గర ఉండితీరాలి. వాడికి మంచి నిచ్చెన తయారుచేసి ఇవ్వటం మన కర్తవ్యం తెలిసిందా ?"

మొత్తానికి ఆలాగైతే నేం మా వ్యూహం సిద్ధమైంది. మూడు వారాలు గడిచేసరికల్లా జిమ్‌ను వీరోచితంగా ఖైదునుంచి తప్పించటానికి కావలసిన సరంజామా అంతా రెడీ చేశాము. ప్రతిరోజూ రాత్రి వేళ అంతా నిద్దర్లు పోయాక నేనూ, టామ్ జిమ్ ఖైదువద్దకు పోయి వెనకవేపు గోడ అడుగునుంచి సొరంగం తవ్వే వాళ్లం. కొన్ని రోజులకు సొరంగం సిద్ధమైంది. అది ఎవరికీ కనిపించకుండా ఆకులు, కొమ్మలు కప్పేవాళ్లం. రాత్రిళ్లు సొరంగంగుండా లోపలికి పోయి జిమ్‌తో మాట్లాడే వాళ్లం.

ఈలోగానే సైలాస్ ఫిలిప్స్ రెండు మూడు సార్లు న్యూ ఆర్లియన్స్‌పట్టణం పేపర్లలో జిమ్‌ను గూర్చి ప్రకటించాడు: జిమ్ అనే పారిపోయిన నీగ్రో తనవద్ద ఉన్నాడనీ, యజమాని ఎవరైతే వారు వచ్చి బహుమతి డబ్బు చెల్లించి తీసుకుపోవచ్చుననీ. కాని ఎవరూ రాలేదు. తరవాత సెంట్ లూయీ పట్టణం పేపర్లలో ప్రకటిస్తానన్నాడు. సెంట్ లూయీ పేరు వినగానే నాకు తారు పుట్టింది. సెంట్‌లూయీ పేపర్లలో జిమ్‌ను గూర్చి ప్రకటన పడితే అది తప్పకుండా మిస్ వాట్సన్‌కు తెలుస్తుంది. తెలిస్తే వెంటనే వచ్చి జిమ్‌ను పట్టుకుపోతుంది. కనుక ఈలోగానే జిమ్‌ను విడిపించాలని టామ్‌ను తొందర చేశాను.

అతడు కాసే పాలోచించి "ఆకాశరామన్న" ఉత్తరాలు రాయాలన్నాడు.

"ఏమిటవి ?" అని అడిగాను.

"ఆకాశరామన్న ఉత్తరాలు ప్రతి పుస్తకంలోనూ ఉంటాయి. ఏదో అపాయం జరగబోతోందనీ, జాగ్రత్తగా ఉండవలసిందనీ ముందు హెచ్చరించటానికి అల్లాంటి ఉత్తరాలు రాయబడతాయి. పదహారో లూయీ ఖైదులోంచి పారిపోదామనుకుంటున్నప్పుడు ఒక దాసీపిల్ల ఖైదు కాపలా వాళ్లతో ఆ ముక్క చెప్పింది. మనమూ అల్లాగే మా సైలాస్ బాబయ్యకు ఒక ఉత్తరం రాద్దాము: జిమ్ నెవరో దొంగతనంగా ఎత్తుకుపోదామనుకుంటున్నారని."

"జిమ్‌ను ఎత్తుకు పోయేది మనమే అయినప్పుడు మనంతట మనమే ఆ ముక్క మీ బాబయ్యకు రాయటం మంచిదేనా ?"

"అవును. ఏం చేస్తాం ? మనం జిమ్‌ను దొంగిలిస్తున్నట్టు మా బాబయ్యకు తెలియాలా అక్కర్లేదా? తెలిస్తేనే మన ప్లానుకు అందం. గప్‌చిప్‌గా ఎత్తుకుపోవాలంటే ఎవరైనా ఎత్తుకు పోగలరు."

"సరే. నీ ఇష్టం. మరయితే దాసీపిల్లగా ఎవరుంటారు ?"

"నువ్వే. మన నీగ్రోల ఇళ్లల్లోంచి వాళ్ల ఆడపిల్లల గౌనూ అవీ ఎత్తుకువచ్చి అవి తొడుక్కో."

"పాపం వాళ్లేడవరూ ?"

"అబ్బే. కాసేపు ఉపయోగించుకుని మళ్లీ అక్కడే పడెయ్యొచ్చు. పావు గంటకంటే ఎక్కువ పట్టదు. ఆకాశరామన్న ఉత్తరం మా బాబయ్య గదిలో పడేసి రావటమే. అంతకంటే ఇంకేం చెయ్యక్కర్లేదు నువ్వు."

"ఆమాత్రం దానికి దాసీపిల్ల వేషం వేసుకోవటం దేనికి టామ్ ? ఈ బట్టలతోనే ఉత్తరం లోపల పడెయ్యొచ్చుగా."

"నువ్వు దాసీపిల్లలాగా కనిపించద్దూ మరి ?"

"ఎవరూ చూడకుండా చెయ్యాలిగా మళ్ళీ ? చూసేట్టయితే పట్టుకోరూ ?"

"అవును. ఎవరూ చూడకుండానే చెయ్యాలి. అయినా దాసీపిల్ల వేషం వేసుకోవటం అవసరం.

పుస్తకాల్లో రాసినదానికి వ్యతిరేకంగా చెయ్యటానికి మనకు హక్కు లేదు."

సరేనని ఒప్పుకున్నాను. టామ్ ఒక ఆకాశ రామన్న ఉత్తరం రాశాడు.

"జాగ్రత్త. అపాయం రాబోతోంది. మీ శ్రేయోభిలాషి".

ఈ ఉత్తరం ఆరాత్రి తీసుకెళ్లి సైలాస్ గారి గదిలో పడేశాను.

మర్నాటి రాత్రి టామ్ సింహద్వారం మీద పుర్రె, ఎముకలు బొమ్మ గీశాడు. ఆ తరవాత రాత్రి దొడ్డివైపు తలుపుమీద శవపేటికబొమ్మ గీశాడు. ఈ బొమ్మలు, ఆ ఉత్తరం చూసుకుని ఇంటిల్లిపాదీ గజగజ వణికి పోయారు. ప్రాణాలు చేతుల్లో పెట్టుకుని తిరిగారు. శాలీపిన్ని మరీని. తలుపు కిర్రుమంటే "అమ్మో" అని గంతేసేది. ఏదన్నా కింద పడినా, ఆమె చూడనప్పుడు వెనకనించి వచ్చి ముట్టుకున్నా హడిలిపోయి ఎగిరేది. ఇంట్లో వారందరినీ ఈ స్థితికి తీసుకొచ్చాక టామ్ ఇంకొక పొడుగాటి ఉత్తరం రాశాడు.

"నేను మీకే మీ అపకారం చెయ్యదలచలేదు. నేను మీ స్నేహితుణ్ణి. ఎర్ర ఇండియన్ల రాష్ట్రంలో ఒక పెద్ద దొంగల ముఠా వుంది. ఆ ముఠా మనిషినే నేను. ఆ ముఠా వాళ్లు మీ దగ్గర ఖైదీగా ఉన్న జిమ్ అనే నీగ్రోను ఇవాళ రాత్రికి దొంగిలించుకు పోవాలను కుంటున్నారు. నాకు పాపభీతి, దైవభీతి ఉన్నాయి. అందుచేత ఈ దొంగతనాన్ని గూర్చి మీకు ముందుగా తెలియజేస్తున్నాను. దొంగలు ఉత్తరపు వేపునించి మీ ఇంటిని ముట్టడిస్తారు. సరిగ్గా అర్ధరాత్రి సమయానికి వాళ్లు వస్తారు. ఏదన్నా అపాయం రాబోతుంటే హెచ్చరించటానికి కొమ్ము బూరా ఊదమని దొంగల నాయకుడు నాకు ఆజ్ఞాపించాడు. నేను కొమ్ము బూరా ఊదకుండా మేకలాగ "మే మే" అని అరుస్తాను. ఆ అరుపు వినగానే మీరు మీ మనుషులతో జిమ్ ఖైదీగా ఉన్న పశువుల దొడ్డిని చుట్టుముట్టి లోపల ప్రవేశించిన దొంగల్ని మట్టం చెయ్యండి. సరిగ్గా నేను మేకలాగ అరిచినప్పుడు మాత్రమే రండి. ముందే వస్తే మన ప్లాను పాడవుతుంది. మీకీ విధంగా సహాయం చేసినందుకు మీరు నాకెట్టి బహుమతీ ఇవ్వనక్కర్లేదు. నేను నా కర్తవ్యం మాత్రమే నెరవేర్చుకుంటున్నాను. మీ శ్రేయోభిలాషి."

ఆ మధ్యాహ్నం భోజనాలయ్యాక నేను టామ్‌తో సహా నదిఒడ్డున అడవుల్లోకి వెళ్లాను. నా పడవను దాచిన చోటినించి ఇవతలకు తీసి ఒకచోట రెడీగా ఉంచాము. ఆ రాత్రే జిమ్‌తో సహా పారిపోవటానికి ప్రయత్నాలు చేసుకున్నాము. దూర ప్రయాణానికి కావలసిన సామగ్రి అంతా సిద్ధం చేశాము.

టామ్ రాసిన రెండో ఉత్తరంతో ఇంట్లో వాళ్లు ఇంకా బేజారెత్తిపోయారు. ఆ రాత్రి పొద్దుగూకే సరికల్లా సైలాస్ ఫిలిప్స్‌గారు ఊళ్లోనించి పదిహేను మంది దాకా స్నేహితులను ఇంటికి తీసుకొచ్చాడు. వాళ్లంతా ఒక గదిలో కిక్కురు మనకుండా చేరి కూర్చున్నారు—ఎప్పుడు అర్ధరాత్రి అవుతుందా అని ఎదురు చూస్తూ. అందరూ మందు దట్టించిన తుపాకులు తయారుగా పెట్టుకున్నారు. వాళ్లని చూసేటప్పటికి నాకు పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. కాని టామ్ చంకలు కొట్టుకున్నాడు. ఇంతమంది మనుషుల్తో ఆరాత్రి యుద్ధం చేయవలసిన అదృష్టం పట్టినందుకు చాలా గర్వపడ్డాడు. పదిహేను మంది మాత్రమే వచ్చినందుకు, ఏ రెండు వందల మందో రానందుకు చింతించాడు.

రాత్రి భోజనాలు కాగానే శాలీపిన్ని పిల్లలందరినీ ఎవరి స్థానాల్లో వారిని పడుకోబెట్టింది. నేనూ, టామ్ మా గదిలోకి పోయాము. ఇల్లంతా దొంగల కోసం ఎదురు చూస్తోంది. మేము కిటికీలోంచి దిగి జిమ్ గదివద్దకు వెళ్ళాము. అంతా కటిక చీకటిగా ఉంది. గోడకింద తవ్విన సొరంగంలోంచి జిమ్‌ను ఇవతలకు తీసుకొచ్చాము. ఇంతలో సమీపంలోనే అడుగుల చప్పుడైంది. గోడపక్కగా ఒదిగొదిగి కూర్చున్నాము. చీకట్లో మేము అవతలి వాళ్లకు గాని, వాళ్లు మాకుగాని కనిపించటం లేదు. వాళ్లు మాకు తగినంత దగ్గిరిగా వచ్చారు. టామ్ కొంచెం వెనక్కి జరగబోయాడు. జరగటంలో ఒక ఎండు కొమ్మమీద కాలు వేశాడు. కొమ్మవిరిగి చప్పుడైంది. వెంటనే "ఎవరు అక్కడ?" అని పదిగొంతుకలు వినిపించాయి. మరు నిమిషంలో నేను, టామ్, జిమ్ ఒక్క గంతేసి పరిగెత్తాము. మా వెనక పదిహేను మంది మనుషులూ తుపాకులు పట్టుకుని పరిగెత్తుకొస్తున్నారు. మేము ఇల్లు దాటి రోడ్డుమీద పడి నది ఒడ్డున మా పడవవున్న దిశగా పరిగెత్తసాగాము. వేటకుక్కలతోసహా మా వెనక మనుషులు వస్తున్నారు. రెండు మూడుసార్లు తుపాకులు పేల్చారు కూడా. తూటాలు మా పక్కనించి దూసుకుపోయాయి. సరాసరి మా పడవను చేరుకున్నాము.

(39-వ పేజీ చూడండి)

మూడు కోరికలు

పూర్వం ఒకప్పుడు ఒక ముసలాయన, ఆయన భార్య ఒకవూళ్లో వుంటూ వుండేవాళ్లు. పాపం చాలా బీదవాళ్లు. పైగా ముసలివాళ్లు అవటంచేత ఏమైనా పనిచేసి సంపాదించుకొందామనుకున్నా శక్తి ఏదీ!

వాళ్లు తిండికే తిప్పలు పడుతుంటే మాయదారి చలికాలం ఒకటివచ్చి పడ్డది వాళ్ల ప్రాణానికి. వాళ్లు వున్న దేశంలో చలి చాలా విపరీతంగా వుంటుంది. డబ్బున్నవారంతా మంచి మంచి వున్ని బట్టలు కొనుక్కొని తొడుక్కొనేవారు. మరి యీ ముసల దంపతులకు అవి ఎల్లా వస్తాయి! అందుకని వాళ్లు చిన్న చిన్న కట్టె పుల్లలను పోగుచేసుకొని మంటచేసి దాని కెదురుగా కూర్చొని చలి కాచుకొనేవారు.

ఒకరోజు యిలా చలిమంటవేసుకొంటూ వేసుకొంటూవుండగా ముసలాయనకు పెళ్లాంతో సరస మాడాలనే బుద్ధి పుట్టింది. "ఓసే; అమ్మీ! ఈవేళ ఓ తమాషా జరుగుతుంది చూసుకోవే! ఈ మంటల్లోనుంచి ఓ చక్కని దేవతవచ్చి మనకు కావలసినంత డబ్బూ, బట్టలూ,... యింకా బలే బలే వంటకాలు యిచ్చిపోతుంది కాసుకో" అన్నాడు.

అరె! ఎంత ఆశ్చర్యం.

ఆ ముసలాడు మాటలు ముగించాడో లేదో ఆ మంటల్లోనుంచీ అందమైన దేవత ఒకామె, తెల్లటి బట్టలు కట్టుకొని, మెడనిండా రకరకాల పూలదండలు వేసుకొని, నెత్తిమీద చిన్న నక్షత్రం పెట్టుకొని పైకి వచ్చింది.

"తాతా; నీ విప్పుడు చెప్పిన మాటలన్నీ విన్నా. నీ కోరికలు తప్పకుండా చెల్లిస్తాను. కానీ నువ్వు మూడే మూడు కోరికలు కోరు. ఊఁ! చప్పున." అన్నది ఆ దేవత.

ముసలాడి మనసు మహదానందంతో నిండిపోయింది. ఆయన యింకా గుక్క తిప్పకోకముందే-ఆ ముసలామెకు ఎప్పటినుంచో ఆకలి అవుతున్నదేమో, యిక వుండ బట్టలేక "ఓ దేవతా; నా ఆకలి తీర్చుకోడానికి కమ్మగా వేయించిన పెద్ద మాంసంముక్క ఒకటి యిప్పించు" అనేసింది. వెంటనే ఒక పెద్ద పళ్లెం నిండా మాంసం ముక్కలు వచ్చి పడ్డాయి. అవి వచ్చీ రావటంతోనే ముసలామె ఆత్రంగా వాటిని గబగబా నోట్లోకి కుక్కేసుకోటం మొదలు పెట్టింది.

ముసలాడు యిది చూచి మండిపడ్డాడు. అంతటి దేవతవచ్చి ఏం కావాలో కోరుకోమంటే యీ వాపిరి గొట్టుమొఖం మాంసం ముక్కల కోసం దేబిరించిందని బలే చిరాకుపడ్డాడు. "ఛీఛీ! నీవు వట్టి పనికిమాలిన దానివి. నే నింకా డబ్బు అడుగుదామా, బట్టలు అడుగుదామా అని ఆలోచిస్తుండగానే తిండికి ఎగబడ్డావు; దరిద్రపుగొట్టు పెద్దమ్మా. నువ్వు తింటున్న ఆ మాంసంముక్క కాస్తా అలా నీముక్కుకే అతుక్కుపోవాలి." అనేశాడు; తాను ఏమి కోరుతున్నదీ కూడా అంత లావు కోపంలో తెలుసుకోకుండానే.

ఇంకే ముందీ-ఆ అవ్వ తింటూ తింటూ వున్న యింత లావు మాంసంముక్కాపోయి ఆవిడ ముక్కుకు అంటుకుపోయింది. ఆవిడకు మొగుడిమీద బలే కోపం వచ్చింది. చెడా మడా తిట్టెయ్యటం మొదలుపెట్టింది. ముసలాయన కూడా అప్పటివరకు జరిగిన తెలువితక్కువను గ్రహించి, తన శక్తినంతా వుపయోగించి ఆవిడ ముక్కుకు అంటుకుపోయిన మాంసంముక్కను వూడలాగాలని తంటాలు పడ్డాడు. ఈయన ఆ మాంసంముక్కను పట్టుకొని గట్టిగా లాగిన కొద్దీ ఆవిడ ముక్కు యింకా ఎక్కువగా మంట పుట్టిందే కాని, ఎంతసేపటికీ ఆముక్క వూడిరాదే! ముసలాయన విసిగిపోయాడు. మిగిలిన ఒక్క కోరికా ఏడబ్బును గురించో అడుగుదామని పెళ్లాసికి నచ్చ చెప్ప చూచాడు. ఆవిడ మాత్రం

అందుకు ఒప్పుకోలేదు. "నీకు ఎంతడబ్బు వస్తే మాత్రం, యీ మాంసం ముక్క యిలా ముక్కుకు తగిలించుకు నేను అస్తమానం తిరగవలసి వస్తే, చూచిన వాళ్లంతా ఎంత ఎగతాళి చేస్తారూ? డబ్బూ వద్దూ; దస్కమూ వద్దూ; యీ మాంసం ముక్క వూడివచ్చేట్లు వరం యిమ్మని అడగండి. అదే పదివేలు." అని హఠం పట్టింది. ముసలాయనకు యిక గత్యంతరం లేదు. ఏడ్పుముఖం పెట్టి ఆ మాంసం ముక్క వూడివచ్చేట్లు వరం యిమ్మని దేవతను అడిగేడు. వెంటనే ఆ మాంసం ముక్క వూడి వచ్చింది; యిటు యీ దేవతా మాయమై పోయింది.

దొరకక దొరకక బాగు పడేందుకు అవకాశం దొరికి, దేవత ప్రత్యక్షమై మూడు కోరికలు (ఒకటి కాదు; రెండు కాదు; మూడు కోరికలు!) కోరుకోమంటే చివరకు ఏమీ కోరుకోకుండానే తేలిపోయింది గదా అని ఆ దంపతు లిద్దరూ కలిసి కాసేపు, విడివిడిగా మరికొంత సేపు బావురుమని ఏడ్చారు.

ఎవళ్లకైనా జీవితంలో బాగు పడేందుకు అవకాశా లనేవి ఆ దేవత ప్రత్యక్షమైనట్లే, అనుకోకుండా వస్తాయి. ఆ అవకాశాలు వచ్చినప్పుడు వాటిని సరిగా వుపయోగించుకోకుండా కాకిలి తనానికి పోతే ఆ ముసలిదంపతులకు పట్టినగతే జీవితంలో అందరికీ పట్టుతుంది.

★



విజ్ఞానవీధులు

"డాక్టర్"






7. పాము చక్షుశ్శ్రవమా ?

అన్ని జంతువులకీ వున్నట్లు, పాముకి చెవులు లేవు. చెవి అంటే "పైకి కనబడే గరాటీ వంటి చర్మవిశేషమూ, అందులోని రంధ్రమూ, దానిలోని కర్ణభేరి అనే చర్మమూ" అందాము. పాముకి ఇలాంటి చెవులు లేవు. అంతే కాదు, చెవిరంధ్రాలు కూడా లేవు. మన పూర్వులు ఈ సంగతి చక్కగా గుర్తించారు. చెవులు లేకపోయినా పాము శబ్దాన్ని గ్రహించడమే కాకుండా నాగస్వర మూదితే తన నైజము మరిచిపోయి పడగ విప్పి ఆనందించగలదు కూడాను. "చెవులు లేకుండా వినడము ఎలాగ ?" అని ఆలోచించి ఊహ మొదలు పెట్టారు. విజ్ఞానము పెంచుకోడానికి వారు ముందు చేసినది అవలోకనము అంతే; అవలోకనానికి మించిన పరీక్ష వారు చెయ్యలేదు. అవలోకనము తర్వాత ఊహ చేశారు. ఈ ఊహనే కాబోలు దివ్యదృష్టి అన్నారు కూడాను.

చెవులు లేని పాము ఎల్లా వినగలుగు తుంది ? కాబట్టి ఎక్కడో అక్కడ చెవి ఉండి తీరాలి. పాము పడగలో మూతి, కళ్లూ మాత్రమే కనపడుతున్నాయి. సంగీతము వింటూ మనము కళ్లు మూస్తాము తన్మయత్వంచేత. కనక కంటికి కూడా వినికిడితో సంబంధ ముండ వచ్చును. అది పాములో పరిణతి చెందీ ఉండ వచ్చును అలాగే జరిగివుంటే పాముకి చక్షువులే శ్రవణేంద్రియాలై యుండాలి. ఇదే నిజమనుకుని పాముని "చక్షుశ్శ్రవ" మన్నారు.

కాని ఇది నిజము కాదు. పాముకి పైకి కనపడే చెవి లేకపోయినా మామూలు చర్మమునకు దిగువన చెవివంటి అంగము ఉన్నది. ఇది దళసరి అయిన చర్మమువల్ల కప్పబడి వుండడము చేత పిట్టలూ జంతువులూ మానవులూ విన్నట్టుగా గాలిద్వారా వచ్చే శబ్దాన్ని పాము వినలేదు. శబ్దము గాలిద్వారానే కాక నీటిద్వారానూ, నేలద్వారానూ కూడా ప్రసరించగలదు. నేల ద్వారా వచ్చే శబ్దాన్ని పాము గ్రహిస్తుందని శాస్త్రజ్ఞుల ఊహ.



(గత సంచిక తరువాయి)

గింజలు తినే గడియారం ఒకటి వున్నదని యీ గోడగడియారం చెప్పుతుంటే సుందరానికి నిజంగా పొడుపు కథ వేసినట్లే వున్నది. గడియారం గింజలు తినడ మేమిటీ అని ఆలోచించాడు. గింజలంటే ఏం గింజలో? ఏమో ! అతనికేమీ అర్థం కాలేదు. తనకు అర్థం కాలే దని చెప్పటానికి మళ్లీ నామోషీగా వున్నది. అందుకోసం తానుగా ఆ పొడుపుకథను విప్పటానికి ప్రయత్నించినట్లు బయటకు పొక్కనీయకుండా గుంభనగా కూర్చొన్నాడు. గడియారం అందు కొన్నది.

"ఏం! సుందరం ఓడిపోయి నట్లేనా ? గింజలు తినే గడియారం ఏదో తెలుసుకోలేవన్నమాటేనా?"

"అబ్బబ్బ ! ఆలోచిస్తుంటే ఏమిటా తొందరా ? ఆగు." అన్నాడు సుందరం బింకంగానే. ఆసరా దొరుకుతుందేమో చూద్దా మని "అయితే, యీ గింజలు తినే గడియార మనేది యీ మధ్య కని పెట్టిందా ? యిదివరకటి నుంచీ వున్నదా ?" అని అడిగాడు.

"మనిషి అన్నవాడు యీ భూమిమీద ఎప్పుడు పుట్టాడో యించుమించు అప్పటినుంచి యీ గడియారం పనిచేస్తూనేవుంది. ఈ గడియారం వునికిని మనుష్యులు సామాన్యంగా రాత్రిపూటగానీ గుర్తించరు."

"ఓహోఁ! అట్లా చెప్పు గింజలు కదూ తింటుందన్నావ్ ! దాని తల మీద ఏమిటి వుంటుందీ ?" సుంద రానికి అర్థమైందని గడియారం పసి కట్టింది. అయినా యీ సంభాషణ యిలాగేయింకా కొంతసేపు కొన సాగిద్దామనే అభిప్రాయంతో "అవును; ఆ గడియారం నెత్తిన తురాయి వుంటుంది." అన్నది.



"నాకు ఏమీ తెలియదను కొన్నావు కదూ ? నీ పొడుపు కథ విప్పేస్తున్నా కాచుకో."

"ఊఁ! చెప్పు"

"కోడిపుంజు,"

"రైట్ ! గింజలు తినే గడి యారం కోడిపుంజు. రాత్రి గడియా రాలలో అనాదినుంచి వుపయోగ పడుతున్నది యిదే. మరి దీనికి టైం ఎంతైందీ ఎలా తెలుస్తుందో ఏమో; తొలిఝామున తప్పకుండా 'కొక్కొరోకో' అని అరిచి తీరు తుంది. టైంవిషయంలో సూర్యు డికి ఎంత నిజాయితీ వున్నదో యీ గడియారానికీ అంత నిజా యితీ వున్నది." ఇంతవరకు సుంద రానికి చెప్పిన అన్ని విషయాలు మరొకసారి జ్ఞాపకం చేసినట్లు అవుతుంది కదా అన్న తలంపుతో, గడియారం: "ఏమోయి సుందరం! పగటిపూట సూర్యుడు వున్నందు వల్ల, రాత్రిపూట క్రొవ్వు వత్తుల మూలంగా, వేకువఝామున కోడి అరుపువల్ల టైం తెలుసుకొనే వారని కదూ యింతవరకూ చెప్పాను ! కానీ కాలం అలా వెళ్లి

పోతున్నా కొందరికి గడియారం వుంటేనే కాని గడవని పరిస్థితి ఏర్పడేది సుమా! ముఖ్యంగా జడ్జీలకు గడియారం వుండవలసిందే!"


"ఏం? ఎందుకనీ?"

"జడ్జి ఒక కేసు విచారిస్తున్నాడనుకో. ఆ కేసులో వాది ప్రతివాదులు కాక, ఎందరో సాక్షులను కూడా విచారించాలి కదా. ఈ వాదీ, ప్రతివాదీ, ప్రతిసాక్షీ తన అర్థం కొద్దీ గంటల తరబడి తన సొద చెప్పుకుపోతుంటే కేసు ఎప్పటికి పూర్తి అవుతుందీ? ఎవరికీ ఎక్కువ అవకాశం లేకుండా తగినంత మాత్రమే టైం యివ్వాలంటే అక్కడ టైం కొలిచేందుకు ఏదో ఒక సాధనం వుండాలి కదా! అందుకని గ్రీకు, రోమను జడ్జీలు విచారించే వారంటే, న్యాయస్థానంలో నీటి గడియారం ఒకటి అట్టే పెట్టుకొనేవారు. నీటి గడియారం అంటే తెలుసుగా నీకు"

"అవును; నువ్వే చెప్పేవుగా యిందాక. గరాటాలో నీళ్లుపోసి, దాని అడుగున చిల్లిలోనుంచీ బొట్లు బొట్లుగా నీళ్లు కారిపోతుంటే మొత్తం నీరంతా కారిపోవటానికి ఎంత టైం పట్టేదీ గుర్తు పెట్టుకొని, దానిని బట్టి ఎప్పటి కప్పుడు టైం ఎంతైందీ తెలుసుకొనేవారనికదూ చెప్పావు?"

"అవును. అలాటి గరాటా గడియారాన్నే యీ గ్రీకు రోమను జడ్జీలు వుపయోగించేవారు. అయితే దీంట్లో చాలా తక్కువ నీళ్లే పట్టేవి. ఒకసారి గరాటాలో పోసిన నీరంతా క్రిందికి కారేసరికి వాఙ్మూలం యిచ్చే ప్రతిసాక్షీ తన ప్రసంగాన్ని ముగించాలనే నియమం వుండేది. ఒక్కొక్క సాక్షికి అవసరాన్ని బట్టి అలా రెండు సార్లు నీళ్లు కారేదాకా అవకాశం యిచ్చేవారు. ఇదంతా చెపుతుంటే చమత్కారమైన ఒక కథ జ్ఞప్తికి వస్తున్నది."

"ఊఁ! చెప్పు: కథ అంటే మనకు ఎంత సరదావో నీకు తెలుసుగా: చెప్పేయ్, చప్పున."



"ఒకప్పుడు రోమ్ నగరవాసి మార్కస్ అనే యువకుని పై హత్యానేరం మోపబడింది. ఇతనిని న్యాయస్థానంలో హాజరు పెట్టి విచారణ సాగిస్తున్నారు. ఇతడు హత్య చేయలేదని సాక్ష్యమీయగల వ్యక్తి ఒక్కడే వున్నాడు. అతని పేరు జూలియస్. అతడు కోర్టుకు హాజరు కావటానికి చాలా వ్యవధి వుండనగానే విచారణ ప్రారంభించేశాడు జడ్జి. అప్పటి ఆచారం ప్రకారం వాది, ప్రతివాది, జడ్జి యీ ముగ్గురూ మాత్రం అరగంట మాట్లాడవచ్చు. మిగిలిన సాక్షులు అందరూ ఐదేసి నిముషాలకంటే ఎక్కువ మాట్లాడేందుకు వీలులేదు. జూలియస్ వస్తున్న సూచనలైనా కనుపించక ముందే హాజరైన సాక్షులలో చిట్టచివరివాడి వాఙ్మూలం కూడా పూర్తి అయింది. తను చేయని హత్యకు తను మరణదండన అనుభవించటంతప్పని స్థితి వచ్చింది మార్కస్‌కు. జూలియస్ ఎప్పుడు వస్తాడా, అసలు వస్తాడా? రాడా? అని ఆందోళనపడుతూ తను మాట్లాడటం మొదలుపెట్టాడు. గరాటాలో నీరు ఒకసారి సాంతం కారిపోయింది. మళ్లీ అందులోకి నీరు తోడారు. ఈ నీళ్లుకూడా కారిపోయాయీ అంటే అతనికి మరణదండన పడిందన్న మాటే. జూలియస్ యింకా రాలేదు. గరాటాలో నుంచి ఒక్కొక్క నీటిబొట్టే కారిపోతుంటే యిక్కడ మార్కస్‌కు ఒక్కొక్క ప్రాణమే ఎగిరిపోతున్నట్లు అయింది. ఇంతలో ఒక గమత్తు జరిగింది. అంతవరకు వడివడిగా కారిపోతున్న నీరు వున్నట్లుండి చాలా నెంపాదిగా కారడం ప్రారంభించాయి. అది చూచి

బస్సు ప్రయాణంలో



పుణ్యం పురుషార్థం

మార్కస్‌కు ధైర్యం వచ్చింది. ఇక తన కథను తెగ పెంచేసి, తన తండ్రి ఎంత ధర్మపరుడైందీ, ఆయన తండ్రి, ఆయన తాత సత్య హరిశ్చంద్రుడు అని పించుకొన్నదీ వీకరువు పెట్టటం మొదలు పెట్టాడు. ఎంతకీ యితని కథ పూర్తి కాలేదు; అక్కడ గరాటాలోనీరుసాంతంకారిపోలేదు. ఈలోగా జూలియస్ కోర్టుహాలులో ప్రత్యక్షమైనాడు. జూలియస్ కనుపించగానే మార్కస్ మొఖం చాటంత అయింది. ఈలోగా జడ్జికి అనుమానం తోచింది. అరగంటలో కారిపోవలసిన నీరు దాదాపు 2 గంటలు గడిచినా యింకా కారుతూ నేవున్నదేమా అని అంటూ ఆ గరటాలో ఎవరైనా రాయి పడవేశారేమో అని అనుమానించాడు. ఈకథ అంతా వ్రాసివున్న పుస్తకంలో ఆ రాయి ఎవరు పడవేసిందీ చెప్పలేదు. ఎవరు పడవేసి వుంటారంటావ్ ?”

“ఆ మార్కస్ యే ఎవరూ చూడకుండా చిన్న మట్టి బెడ్డ గరాటాలోకి వడేట్లు విసరి వుంటాడు.”

“కావచ్చు. ఈ నీటి గడియారం దగ్గర ఎవరో ఒకరు ఎప్పుడూ వుంటూ అందులో నీళ్లు అయిపోయినప్పుడల్లా మళ్ళీ నింపుతూ వుండటం తప్పేది కాదు. అందుకని ఈజిప్టు దేశంలో అలెగ్జాండ్రియా పట్టణంలో వుండే సీలాంటె కుర్రవాడు ఒకడు నీటి గడియారానికి నీటిని సప్లై చేసే బాధ్యత నంతటినీ రెండు బొమ్మలకు అప్పగించాడు.”

“అదెట్లా?” (ఇంకావుంది)

హకల్ బెరీ ఫిన్

(31-వ పేజీ తరువాయి)

మమ్మల్ని తరిమిన మనుషులు కొంత దూరం వరకూ వచ్చి వెనక్కి వెళ్లి పోయారు.

మేము పడవను నీళ్లలోకి తోసి నది మధ్యగల చిన్న లంక వరకూ పోయాము. ఆయాసం తీరాక నేను జిమ్‌తో అన్నాను:

"జిమ్ ! నువ్వు మళ్ళీ స్వతంత్రుడివి అయ్యావు. ఇక నీకు శాశ్వతంగా బానిస తనం తొలిగిపోయింది."

"హక్ గారూ ! మీ ఋణం, టామ్ సాయర్ గారి ఋణం తీర్చుకోలేనండి," అన్నాడు జిమ్ కృతజ్ఞతతో.

మా ప్లాను అనుకున్న దానికంటే చక్కగా నెరవేరినందుకు అందరం ఆనందించాము. కాని టామ్‌సాయర్ ఆనందం వర్ణించేతరంకాదు. ఎందుకంటే ఇవ్వాళ జరిగిన మహా ఘోర యుద్ధంలో అతనికి ఒక కాలులో తూటా ఇరుక్కుపోయింది. ఎంత అదృష్టం అది !

అతని కాలికి తగిలిన గాయం చూడగానే నాకూ, జిమ్‌కూ సంతోషమంతా చల్లారిపోయింది. టామ్ కూడా బాధ పడుతూనే ఉన్నాడు. కాని తను చేసిన సాహస కార్యంముందు ఈ బాధ బాధ అనిపించ లేదు.

నేను, జిమ్ కొంచెం పక్కకు పోయి టామ్ విషయం ఏం చెయ్యాలా అని ఆలోచించాము. జిమ్ నన్ను ఊళ్లోకి వెళ్లి డాక్టర్ని తీసుకురమ్మన్నాడు. ఆ సంగతి టామ్‌తో చెప్పాను. అతడు 'డాక్టరు అక్కర్లేదు. డాక్టరు వస్తే మన సాహసకార్యానికి అందం పోతుంది' అన్నాడు. కాని నేనూ, జిమ్ మా మాట పట్టుకుని వదల్లేదు. ఏమైనా సరే డాక్టరును తీసుకొచ్చి గాయానికి మందు వేయిస్తానని పట్టుబట్టాను. చివరికి టామ్ ఒప్పుకున్నాడు. నేను డింగీ తీసుకుని ఒడ్డుకు బయల్దేరాను. టామ్ నాతో ఇలా చెప్పాడు:

"హక్ ! డాక్టర్ని ఎలా తీసుకురావాలో చెబుతాను విను. డాక్టరు ఇంటి బైటికి రాగానే కళ్లకు గంతలు కట్టు. అతనికి ముందే కొంత డబ్బు లంచం ఇచ్చి దోవలో ఎక్కడా నోరెత్త వద్దని చెప్పు. సందులు గొందులు తిప్పి తిప్పి నదివద్దకు తీసుకువచ్చి డింగీలో ఎక్కించు. డింగీని చాలా దూరం తిప్పి తిప్పి ఇక్కడికి తీసుకురా. డాక్టరు దగ్గిర సీమసున్నం ఉంటే అది లాక్కొని నీ దగ్గిరే ఉంచు. మళ్ళీ అతన్ని ఇంటి దగ్గర దిగబెట్టే దాకా ఇవ్వబోకు. ఎందుకంటే అతని దగ్గిర సీమసున్నం ఉంటే మన పడవమీద గుర్తు పెడతాడు—తరవాత మన్ని పట్టుకో వచ్చని."

టామ్ చెప్పిన అన్నిటికీ ఊకొట్టి బయల్దేరాను. డాక్టరు వచ్చినప్పుడు దూరంగా ఎక్కడన్నా దాక్కోమని జిమ్‌తో చెప్పాను. (ఇంకా వుంది)



పక్షిరాజావారి "కాంచన"లో వేశ్యకన్యగా నటించిన పద్మిని.



ఫిడేలు తీగలను పులకింపజేస్తున్న శశి (సావిత్రి) శుభోదయా వారి "ఆదర్శం" లో

సినిమా సెన్సారింగ్

సినిమా సెన్సారింగ్ విధానం ప్రవేశపెట్టబడినప్పటినుంచీ అనేక మార్పులు పొందుతూవచ్చి ఇప్పటికొక నిర్దిష్టరూపం పొందింది. గత శుక్రవారం మద్రాసు ప్రాంతీయ సెన్సార్ బోర్డు అధికారి కె. శ్రీనివాసన్‌గారు ప్రస్తుతం సెన్సారింగ్ ఏమాదిరిగా అమలు జరుపబడుతోందీ వివరించారు. కొత్తసెన్సార్ నిబంధనలప్రకారం దేశమంతటికీ ఒకే సెన్సార్ సంఘం ఉంటుంది. ఈ కేంద్ర సంఘం ప్రాంతీయ సంఘాలద్వారా సెన్సార్ జరుపుతుంది. దేశమంతటికీ ఒకే సెన్సార్ నిబంధనల ప్రణాళికకూడా వుంటుంది. కేంద్రసంఘంచే ఆమోదింపబడిన ఏచిత్రాన్నైనా దేశంలో ఎక్కడైనా నిరభ్యంతరంగా ప్రదర్శించవచ్చు. ఇదివరకు వలె స్థానిక అధికారులు కలగజేసుకోవటానికి వీల్లేదు. ఇదివరకువలె ఒక రాష్ట్రంలో ఆమోదించబడిన చిత్రం మరొక రాష్ట్రంలో నిషేధించబడటానికి వీల్లేదు. ఇది హర్షించదగిన పరిణామమే.

కాని సెన్సారింగ్‌లో అసలు చిక్కు ఎక్కడవస్తుందంటే ఏ నిబంధనల ననుసరించి వివిధ చిత్రాలను సెన్సార్ చెయ్యాలి, ఒకే నిబంధనలను వివిధప్రాంతాల, వివిధదేశాల, చిత్రాలకు ఎంతవరకూ వర్తింపజెయ్యవీలున్నదీ అని. మాటల్లోగాని, పాటల్లోగాని, అవయవాల కదలికలలోగాని అశ్లీలం స్ఫురించేటట్లు చెయ్యరాదని ఒక నిబంధన. నేరం, న్యాయశాసన అతిక్రమణం మొదలైన వాటిపై ప్రేక్షకులకు సానుభూతికలిగేట్లు చెయ్యరాదని, అలాచేస్తే ప్రజల నైతికస్థాయి దెబ్బతింటుందని మరొక నిబంధన శాసిస్తున్నది. ఈ నిబంధనలను వివిధచిత్రాలకు వర్తింపజెయ్యటంలో చాలా చిక్కులున్నాయి. ఉదాహరణకు ఈ నిబంధనలను హాలీవుడ్ చిత్రాలకు వర్తింపజేస్తే నూటికి తొంభైమంతుల హాలీవుడ్ చిత్రాలను ఈ దేశంలో ప్రదర్శించటానికే వీల్లేదు. పాశ్చాత్యదేశాల సంస్కృతిని, ఆచారాలు, అలవాట్లు, దుస్తులు, సాంఘిక ప్రవర్తన మొదలైన వాటిని గుర్తించి వాటికి కొంత "మార్జిన్" ఇచ్చినా ఇంకా అభ్యంతరంగా ఉండే అంశాలు అనేకం ఆచిత్రాల్లో కనిపిస్తాయి. కామప్రకోపనం లేని హాలీవుడ్ చిత్రాలు చాలాకొద్ది. కొన్ని చిత్రాలలో నీతి బాహ్యంగా ప్రవర్తించే పాత్రలమీద సానుభూతి కలిగించటానికి ప్రయత్నం జరుగుతుంది. బాబ్ హోప్ నటించిన ఒక చిత్రంలో హంతకుడు హత్య చేసేవిధానం ఎంతో నేర్పుగా, ఆకర్షకంగా, ప్రతిచిన్న వివరంతో సహా చిత్రించబడింది. ఇలాంటివన్నీ లెక్కకు

విజయనగరంలో ఆంధ్రరాష్ట్ర సినిమా ప్రేక్షకసంఘంవారి విందు.




రామారావు, వరలక్ష్మి ఆటోగ్రాఫు లిస్తున్నారు.



సభకువచ్చిన ప్రజలను ఆశ్చర్యంగా చూస్తున్న అంజి, రామారావు, వరలక్ష్మి

తీసుకుంటే అనేక హాలీవుడ్ చిత్రాలకు ఈ దేశంలో ప్రవేశమే ఉండదు.
అంతేకాక మనదేశంలో తయారయ్యే దేశభాషా చిత్రాలలో కూడా సెన్సార్లను అనేకమైన చిక్కులు ఎదుర్కొంటున్నాయి. ఉదాహరణకు మలయాళ ప్రాంతాన్ని తీసుకుంటే అక్కడ కింది తరగతుల స్త్రీలు వక్షభాగాన్ని ఆచ్ఛాదన లేకుండానే వదలివేస్తారు. ఒక మలయాళీ చిత్రంలో ఆ ప్రాంతానికి సహజమైన నగ్నవక్షాలను ప్రదర్శించగా సెన్సార్ అధికారులకు పెద్ద ఇబ్బంది కలిగిందట



జబ్బుగావున్న తండ్రి (దొరస్వామి)ని చూట్టానికివచ్చిన కాంచన (లలిత) పక్షిరాజావారి "కాంచన"లో దృశ్యం



ఏదో ఛలోక్తికి రామారావు, వరలక్ష్మి నవ్వుతున్నారు

అందుచేత ఆ చిత్రాన్ని మలబారులో ప్రదర్శించేటప్పుడు అలాంటి భాగాలున్నప్పటికీ, ఇతరప్రాంతాలలో ప్రదర్శించేటప్పుడు ఆ భాగాలు కత్తిరించి వేయాలని అధికారులు నిబంధించవలసి వచ్చింది.


అందుచేత, దేశంలో ప్రదర్శించబడే దేశీయ, విదేశీయచిత్రాలన్నిటికీ ఒకే నిబంధనల ప్రణాళికను వర్తింపజెయ్యడము నేది ఎంత వాంఛనీయమైన విషయమైనప్పటికీ అది ఆచరణలో కష్టసాధ్యంగా కనిపిస్తున్నది. నిజానికి ఇప్పుడు మనదేశంలో ప్రదర్శించబడే విదేశీయచిత్రాలకు ఒకరకమైన నిబంధనలు, దేశీయచిత్రాలకు ఇంకొకరకమైన నిబంధనలు వర్తింపజెయ్యబడుతున్నాయి. ఇది ఒకవిధంగా అన్యాయమే. కాని అన్నిటికీ ఒకే నిబంధనలు విధిస్తే చాలా విదేశీచిత్రాలను బహిష్కరించవలసివస్తుంది. ఇది ఎంతవరకూ సాధ్యమవుతుంది, ఎంతవరకూ వాంఛనీయమూ అని ఆలోచించుకోవాలి.

★


భారతదేశానికి టెక్నికలర్

మనదేశంలో మొదటగా తయారైన టెక్నికలర్ చిత్రం "ది రివర్." కాని ఈ చిత్రం ఇంగ్లీషులో తయారుకావడంవల్లా, పెట్టుబడిదారులు, నిర్మాతలు, దర్శకులు, తదితరులు చాలమంది విదేశీయులే కావడంచేతా అది భారతీయ చిత్రం అని చెప్పుకోవటానికి వీల్లేదు. "ది రివర్"ను మినహాయిస్తే మొదటి భారతీయ టెక్నికలర్ చిత్రం సొహ్రాబ్ మోడీ నిర్మించిన "ఝూన్సీకి రాణీ"యో, మహబూబ్ ప్రొడక్షన్సువారి "ఆన్" చిత్రమో ముందు ఏది విడుదల అయితే అది అవుతుంది.

ఈ చిత్రాల నిర్మాణంమూసి ఇంకా పలువురు భారతీయ నిర్మాతలు టెక్నికలర్ చిత్రాలు తీయటానికి ఉత్సాహిస్తున్నారు.



పీపుల్సువారి "పల్లెటూరు"లో సీతమ్మ (పద్మావతిదేవి) మరణఘడియలు



విజయావారి "చంద్రహారం"లో ధూమకేతువు తన పట్టాభిషేకపు ఏర్పాట్లు చూసి ఆనందిస్తున్నాడు

టెక్నికలర్‌లో తీయటం సామాన్య నిర్మాత అందరికీ సాధ్యంకాదు. టెక్నికలర్ పద్ధతి తెలిసిన నిపుణులు మనదేశంలో లేరు. బ్రిటన్‌లాంటి దేశాలకు మన దేశీయులను పంపి తర్ఫీదు చేయించాలన్నా అనేకమైన అడ్డంకులున్నాయి. తమ టెక్నికలర్ విజ్ఞానాన్ని మనవారికి నేర్పాలనే కుతూహలం ఏ విదేశీ స్టూడియో గాని, లాబొరేటరీ గాని ప్రదర్శించటంలేదు. ఈ పరిస్థితుల మూలంగా మన దేశంలో టెక్నికలర్ నిపుణులు తయారై, ఇతర దేశాల సహాయంలేకుండా మనంతట మనం టెక్నికలర్ చిత్రాలు తయారుచేసుకోవటానికి చాల ఏళ్లు పట్టేటట్లున్నది.

ఈ లోగా తయారయ్యే టెక్నికలర్ చిత్రాలకు ఏ సామాన్య నిర్మాత సాహసించ లేనంత ధనం వ్యయం అవుతుంది. "ఆన్" చిత్రానికి 40 లక్షలపైగా ఖర్చయిందట. రాజ్ కపూర్ తలపెట్టిన "అజంతా" చిత్రానికి అరవై లక్షలకు తక్కువకాదని అంచనా వేశారు. ఈ దేశంలో షూట్ చెయ్యబడిన ఫిల్ములను ఏ బ్రిటిష్ లాబొరేటరీకో పంపి ప్రాసెస్ చేయించుకోవలసిన అవసరం చేతనే ఇంత ధనం వ్యయమవుతున్నది. ఇంతధనం వెచ్చించి తీసేచిత్రం ఏదో ఒక్క భాషలోనే తీస్తే ఆ భాషకు గల మార్కెట్

చాలదు. భారత దేశమంతటా మార్కెట్ గల హిందీ నిర్మాతలుకూడా తమ టెక్నికలర్ చిత్రాలను హిందీలోనే కాకుండా అరవం, ఇంగ్లీషుభాషల్లోకూడా తీయక తప్పటంలేదు. ఇక మరీ పరిమితమైన మార్కెట్ గల తెలుగు, తమిళ నిర్మాతలు టెక్నికలర్ చిత్రాలు తీయసాహసిస్తే ఇంకా ఎంతకష్టమో ఆలోచించుకోవచ్చు.

టెక్నికలర్ నిర్మాణానికి ఒక ప్రత్యేక ప్రయోజనం ఉన్నది ముఖ్యంగా చారిత్రిక చిత్రాలకు టెక్నికలర్ చాలాబాగా సరిపోతుంది. చారిత్రిక చిత్రాలకు, లేక జానపద, పౌరాణిక చిత్రాలకు సెట్టింగులు ప్రధానం. ఈ సెట్టింగులు టెక్నికలర్‌లో ద్విగుణీకృతంగా రాణిస్తాయి. హాలీవుడ్‌లోను, బ్రిటన్‌లోను కూడా టెక్నికలర్ పద్ధతిని సాధారణంగా చారిత్రిక చిత్రాలకు, పాశ్చాత్య జానపద (వైల్డ్ వెస్ట్) పౌరాణిక (బిబ్లికల్) చిత్రాలకు మాత్రమే ఉపయోగిస్తారు. సాంఘిక చిత్రాలలో సంగీతప్రధానమూ, వినోద విలాస ప్రధానమూ అయినవాటికి మాత్రమే ఉపయోగిస్తారు. సాంఘికప్రయోజనం ప్రధానమైనవాటికి, మనస్తత్వ ప్రధానమయినవాటికీ టెక్నికలర్ వాడనే వాడరు. ఇటువంటి చిత్రాలలో పాత్రల మనోభావాలను గాని, జీవితపరిస్థితులను గాని టెక్నికలర్ ద్వారా చూపించటం అసహజంగా ఉంటుంది. మన దేశంలో పౌరాణిక, జానపద చిత్రాలశకం గడిచిపోతోంది. ఈ దృష్ట్యాకూడా టెక్నికలర్ పద్ధతికి మనదేశంలో కొంత పరిమితమైన అవకాశం మాత్రమే ఉంది. ★

సినిమా వార్తలు

వినోదావారి "దేవదాసు" చిత్రం షూటింగ్ చురుగ్గా సాగుతున్నదనీ, ఇప్పటికే అయిదురీళ్లు పూర్తయినాయనీ తెలుస్తున్నది. ఇప్పటివరకూ నాగేశ్వరరావు (దేవదాసు) సావిత్రి (పార్వతి) మాత్రమే ప్రముఖ భూమికలలో బుక్ అయ్యారు. దర్శకుడు—వేదాంతం రాఘ



గోపీ, హరి, లక్ష్మి ముగ్గుర్నీ కూర్చోబెట్టుకుని ఏదో పాట వినిపిస్తున్న శివం (నాగయ్య) అవర్ ఇండియా వారి "నాయిల్లు"లో

వయ్యక్ సంభాషణలు, పాటలు—సముద్రాల రాఘవాచారి; సంగీతం—సుబ్బరామన్.

* * *

వినోదావారు మహాకవి గురజాడ అప్పారావువారి "కన్యాశుల్కం" నాటకాన్ని తెరపైకి తీసుకురాదలచుకున్నారనీ, ఫిలిం రైట్సుకూడా పొందారనీ తెలుస్తున్నది. వచ్చే నెలలోనే సెట్స్‌పైకి కూడా వెళ్ళవచ్చునని తెలుస్తున్నది. చాల కాలంగా, చాలమంది "కన్యాశుల్కం" నాటకాన్ని సెల్యులాయిడ్‌లోకి లాక్కురావాలని కలలు కంటున్నారు. వినోదావారు ఈ ప్రయత్నానికి పూనుకోవటం హర్షించదగినది.

* * *

భావకవిత్వ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించి మహాకవిగా పేరుపొందిన దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు సినిమా రంగంలో దాదాపు స్థిరపడినట్లే చెప్పవచ్చును. వీరు మొదటిసారిగా పాటలు, మాటలు రాసిన "మల్లీశ్వరి" చిత్రం ఆంధ్రదేశంలోనే కాక మద్రాసులోని తమిళ ప్రేక్షకుల మన్ననలను, ఉత్తర భారత పత్రికల ప్రశంసలను కూడా అందుకొంది. శాస్త్రిగారిప్పుడు నాగయ్యగారి "నా యిల్లు" చిత్రానికి మాటలు, పాటలు రాస్తున్నారు. "జీవితనౌక" చిత్రం నిర్మించిన కె & కె. ప్రొడక్షన్సువారు కొత్తగా తీస్తున్న ఒక తెలుగు చిత్రానికి కూడా శాస్త్రిగారు పాటలు, మాటలు రాస్తున్నారు. ఈ చిత్రంపేరు "ఆకలి మంటలు" అనో "ఆకలి పిలుపు" అనో ఉంటుందని తెలుస్తున్నది. ఇవిగాక జెమినీవారి 19 వ చిత్రానికి కూడా కృష్ణశాస్త్రిగారు స్క్రిప్టు రాస్తున్నారు.

* * *

అంజలీ పిక్చర్స్‌వారి "పరదేశి" సగం వరకూ తయారైందట. ఈ చిత్రంలో నాగేశ్వరరావు, అంజలి, రంగారావు, వసంత, గణేశన్ మున్నగువారు నటిస్తున్నారు. దర్శకుడు ప్రసాద్.

* * *

తెలుగుదేశంలోను, అరవదేశంలోను అపూర్వంగా విజయంపొందిన విజయావారి "పాతాళభైరవి" హిందీ తర్జుమా చిత్రానికి బొంబాయిలోను, ఇతర ఉత్తర ప్రాంతాల్లోను అంతగా ప్రజాదరణ లభించక పోవటం ఆశ్చర్యకరం. బొంబాయి పత్రికలు, విమర్శకులు ఈ చిత్రాన్ని ఘాటుగా విమర్శించటం చూస్తే ఉత్తరాదివారికి మనకంటే మంచి అభిరుచులున్నాయని అనుకోవాలో, నిజంగానే ఆ చిత్రం బాగా లేదనుకోవాలో తెలియటంలేదు. "పాతాళభైరవి" కథ జానపదాల తరగతికి చెందినదనే విషయం ఒప్పుకున్న తరవాత దానిలో విమర్శించవలసిన అంశాలేమీ లేవు. అసలు జానపదాలే పనికిరావంటే అది వేరే సంగతి. ఆ దృష్టితో చూసినాకూడా "సాంఘిక" చిత్రాలనే పేరుతో

(48–వ పేజీ చూడండి)

కూతురు - కోడలు

(13–వ పేజీ తరువాయి)

ఉత్తరం వచ్చింది. ఆఫీసు ఇనస్పెక్షను త్వరగా బయలుదేరి రమ్మని.

జా : నిజం !

ప్ర : నిజం, ముమ్మాటికి నిజమే. ఊఁ త్వరగా ప్రయాణ సన్నాహాలు కానియ్.

సో : (వస్తూ) యేమిటి నాయనా కానియ్యమంటున్నావ్.

ప్ర : యేం లేదు సామాను సర్దమంటున్నాను. అర్జంటుగా మావూరు వెళ్లిపోవాలి.

సో : అదేమిటి యింతలోనే యింత ముంచుకు పోయేపనేమొచ్చింది. పది రోజులు ఆఫీసుకు శెలవు పెట్టేవ స్తివిగదూ.

ప్ర : మా ఆఫీసు ఇనస్పెక్షనట. అర్జంటుగా ఆఫీసుకు చేరుకోవాలి.

సో : అయితే అమ్మాయిని ఉంచి వెళ్లు నాయనా, పండగయినతర్వాత పంపిస్తాను.

ప్ర : అలా వీల్లేదండి. మీ అమ్మాయి లేకపోతే అసలే ఆఫీసుపనితో సతమతమవుతుంటే యింట్లో స్వయంపాకంగూడా పెట్టమంటారా ?

సో : అయితే వెళ్ళాల్సిందే.

ప్ర : ఆఁ అక్షరాలా.

... ...

సో : అయితే జానకీ ఏమిటే ఈ అర్థాంతర ప్రయాణం ?

జా : ఆఁ నీవు తెచ్చిపెట్టిందే ?

సో : అదేమిటేవ్ ? నేనేం చేసేను ?

జా : ఇంకా పైగా నేనేం చేసేనంటావేం ? ఒదినను వాళ్ళపుట్టింటికి పంపిస్తే నీసొమ్మేం పోయిందేం ? అందుకే వారికి కోపం వచ్చి ఉంటుంది.

సో : మీఒదినెను పంపించకపోతే ఆయన కెందుకే కోపం ?

జా : అందరి తల్లులూ నీలాంటివాళ్లు కాదుటమ్మా. తమ కూతుళ్లను, అల్లుళ్లను పండక్కి పిలుచుకోందామని ఉండదూ ? లేకపోతే ఇప్పుడేం యినస్పెక్షనే. మొన్ననేగదూ ఇనస్పెక్షను అయింది. వారికి కోపమే వచ్చి ఉంటుంది.

.........(జంత్ర సంగీతం)

సో : (అల్లుడు ప్రకాశంతో) యేం నాయనా కోపం వచ్చిందా?

ప్ర : దేనికి కోపం?

సో : మా కోడలిని పుట్టింటికి పంపించలేదని.

ప్ర : మీ కోడలిని పుట్టింటికి పంపించకపోతే నాకేం కోపం? మీ కోడలిమీద మీరు అధికారం చలాయిస్తారు. నాభార్యమీద నేను చలాయించుకుంటాను. దానికేం ? ఎవరి యిష్టం వాళ్ళది. (పెద్దగా) జానకీ, పెట్టె బేడ్డింగు అన్నీ సర్దేశావా? పిల్లలకు చొక్కా లెయ్యి. బండి పిల్చుకొస్తాను.

సో : బాబూ బండి! పోదుగానికొంచెంసేపాగు. రామం, రామం.

రా : (వస్తూ) యేం అమ్మా!

సో : యేమీ లేదు నాయనా, పాపం మీ మామగారు మరీ మరీ చెప్పివెళ్ళారు

గదా! పండక్కి వెళ్ళకపోతే కోపం వస్తుంది. మధ్యే సాయంకాలమే లలితను తీసుకుని మీ మామగారూరు పోయి పండగ నాలుగు రోజులూ అక్కడ ఉండిరా.

రా: అదేమిటమ్మా మేమిద్దరం అక్కడికెళ్ళి కూచుంటే బావ చెల్లాయివాళ్ల సంగతెవరు చూస్తారు?

సో: నేను లేనుటరా! నీకెందుకు నువ్వు పోయిరా.

రా: సరేనమ్మా నీ యిష్టం (పెద్దగా) లలితా మనం సాయంకాలం బండికి మీ వూరు పోదాం; రెడీగా ఉండు.

ప్ర: యేయ్ జానకీ? పెట్టె బెడ్డింగు ఎక్కడవక్కడ పెట్టేసెయ్. ఇప్పుడు ప్రయాణం వద్దులే.

సో: నాయనా ఈమాత్రం దానికి కోపం తెచ్చుకోవాలా? నాతో చెప్తే సరిపోదూ.

ప్ర: మెల్లగా చెప్తే మీరు వినకపోతిరి. అందరికూతుళ్ళూ మీ కూతురులాంటివాళ్ళు గాదుటండీ. యింట్లో కూతురొకటే, కోడలొకటీనా. మీ కూతురు దగ్గరనుంచి ఒక వారంరోజులుత్తరం రాకపోతే తపించిపోతారే. అందరి తల్లులకూ అలా ఉండదూ? మీ కూతురుని కాఫీ తాగేవా అని పరామర్శ చేస్తారే; కోడలి నెందుకలాగే పరామర్శించరు? మీ కూతురు క్షేమం సుఖంకోసం ఆదుర్దాపడినట్లు మీ కోడలి సుఖక్షేమాలకోసం ఎందుకు ఆదుర్దాపడరు? మీ కూతురు చాకిరీచేస్తే ఎక్కడ నలిగిపోతుందో అని చూస్తారే, మీ కోడలి విషయం కూడా అలా ఎందుకనుకోరు? మీ కూతురు సుఖిస్తుంటే చూడాలని మీ కున్నట్లు యితరులకు కూడా తమ కూతుళ్లపట్ల అలాగే ఉంటుందని ఎందుకనుకోరు.

సో: నాయనా నా బుద్ధి గడ్డితిన్నది. యిప్పుడు తెలిసొచ్చింది. ఇంక నా కూతురునూ, కోడలునూ, ఇద్దరినీ సమానంగా చూసుకొంటాను.

రా: వెళ్ళొస్తా బావగారూ?

ప్ర: పోయిరావోయ్ రామం? వెళ్లి పండుగ నాలుగురోజులూ మామగారింట్లో సంతోషంగా గడిపిరా.

ల: వెళ్లొస్తా నన్నయ్యగారూ?

ప్ర: క్షేమంగా వెళ్లి క్షేమంగా తిరిగిరా అమ్మా. ★

క్రొత్తకారు

(5-వ పేజీ తరువాయి)

కాని అప్పటికే ఆలస్యమైంది. భిక్షకురాలి కాలికి దెబ్బ. నెత్తురు కారుతోంది.

"అప్పుడే చెప్పాను నెమ్మదిగా నడపండని. విన్నారు కారు"

నాకు కాళ్ళాడలేదు. వొళ్లు నఖశిఖ పర్యంతం కంపించి పోతోంది.

కారు ప్రమాదం!...పోలీసు!!...కేసు!!!...కోర్టు!!!! దండన!!! నలుగురిలో అవమానం!!!...ఎన్నో బుర్రలో ఒక్కమాటు గిర్రున తిరిగాయి. కాళ్లక్రింద నుంచి నేల పడిపోతున్నట్లనిపించింది. మడ్ గార్డుని గట్టిగా పట్టుకు నుంచున్నా. ఏం చేయడానికి తోచలేదు. మంచివేళ యింకెవరూ చూడ్డంలేదు. మాఆవిడ ప్రథమ చికిత్స చేస్తోంది. అబ్బ! ఫరవాలేదు. గాయం పెద్దది కాదు. ముష్టిది లేచి కూర్చుంది. నాకు కొంత ధైర్యం వచ్చింది. రుమాలుతో చెమట తుడుచుకుంటూ 'కారుశబ్దం వినిపించలేదూ! అలా చెవిటిదానిలా నడుస్తావు" అని గదమాయించాను తప్పు నామీదవున్నా డబ్బున్నవాడిని గనుక.

"అవును బాబయ్యా ఏదో యింట్లో చంటిపిల్లాడ్ని వదలివచ్చాను. పాలుకేవు యేంచేస్తుంటాడో అని ఆలోచిస్తూ నడుస్తుంటిని, బాబయ్యా." అంది. ఎంత అమాయికురాలు!

"రోడ్డుమీద నడుస్తున్నప్పుడు ఆలోచనలేమిటి. ఈపాటికి చచ్చేదానివి, నేను కారు నాపకపోతే," అన్నా (పచ్చి అబద్ధం!) అధికార స్వరంతో.

"చిత్తం! బాబయ్యా! క్షమించాలి."

బ్రతుకుజీవుడా! చావు తప్పి కన్ను లొట్టపోయిందన్నట్టు గండం గడిచింది. దానికి ఓరూపాయి పడేశాను. ముష్టిది గాయం బాధని మరచి: "ధర్మదాతలు, నూరుకాలాలపాటు సుఖంగా వుండాలి" అని చేతులెత్తి దండం పెట్టింది.

నామనస్సు కళవళపడింది,

"లతా యెక్కు కారు, పోదాం," అన్నాను.

"బీచికి యింకోమాటు పోవచ్చు, కారుని యింటివైపుకు త్రిప్పండి" అంది లత. ★

సినిమా వార్తలు

(43-వ పేజీ తరువాయి)

బొంబాయినుండి వెలువడే చాల చిత్రాలకంటే పాతాళభైరవి మెరుగేనని చెప్పాలి.

* * *

హిందీ సంగీత దర్శకుడు సి. రామచంద్ర స్వయంగా "ఝుంఝూర్" అనే చిత్రం తయారుచేస్తున్నాడు. అందులో కామినీ కౌశల్, సజ్జన్ నటిస్తున్నారు. రామచంద్ర సంగీతం రచిస్తున్నాడు.

గ్రంథస్వీకారం

స్వతంత్రవాణి: క్రొత్త వారపత్రిక సంపాదకుడు: కాశీభొట్ల వెంకటేశ్వర్లు. వెల 2 అణాలు.


ప్రథమ సంచికలో వావిలాల గోపాలకృష్ణయ్యగారు నందికొండ ప్రాజెక్టును గూర్చిన వివరాలు ప్రచురించారు. రాజకీయాలు, సినిమా, మొదలైన మంచి శీర్షికలు వున్నాయి. కార్యాలయం: 43, నల్లన్న మొదలి వీధి, మద్రాసు – 14.

Edited, Printed&Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras



"గౌతమసేవ' — శ్రీ పెదపాటి — ఏలూరు సి ఆర్ రెడ్డి కాలేజి విద్యార్థి

Regd. No M 4479



అనువాదం

నండూరి రామమోహనరావు

వెల రూ. 1-8-0

పోస్టు ఖర్చులు ప్రత్యేకం

వివరాలకు

ఆంధ్ర గ్రంథమాల

మద్రాసు 1.